గురువారం
8-5-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 226
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

విశాలాంధ్ర

స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సైనిక రైళ్లపై పాక్ నిఘా!

న్యూదిల్లీ: భారత 'సైనిక రైళ్ల' కదలికల గురించి తెలుసుకునేందుకు పాకిస్థాన్ నిఘా సంస్థలు యత్నించవచ్చన్న సమాచారంతో రైల్వే శాఖ అప్రమత్తమైంది. రహస్య సమాచారాన్ని అనధికార వ్యక్తులతో పంచుకోవద్దని ఉద్యోగులను హెచ్చరిం చింది. అటువంటి సమాచారం బహిర్గతం చేయడం జాతీయ భద్రతకు ముప్పుగా పరిణమిస్తుందని తెలిపింది. 'సైనిక ప్రత్యేక రైళ్ల కదలికలకు సంబంధించి కీలక సమాచారాన్ని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ సంస్థలు రాబట్టే అవకాశం ఉంది. రైల్వేలో మిలటరీ విభాగానికి తప్ప.. ఎటువంటి అనధికార వ్యక్తులకు ఆ సమాచారం ఇచ్చినా భద్రతా ఉల్లంఘనగా పరిగణిస్తాం. దానివల్ల దేశ భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. సైనిక రైళ్ల కదలికల సమాచారానికి ఉన్న ప్రాధాన్యం, తీవ్రత దృష్ట్యా దీనిపైఅప్రమత్తంగా ఉండాలి' అని అన్ని రైల్వే జోన్ల ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్లకు రైల్వే బోర్డు సందేశం పంపింది.

మద్యం కేసులో బెయిల్ నిరాకరణ

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ఏపీ మద్యం కేసులో నిందితులు కె.ధనుంజయ రెడ్డి, పి.కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పకు ముందస్తు బెయిల్ లభించలేదు. వారి పిటీషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ప్రాసిక్యూషన్ వివరాలు సమర్పించేందుకు ప్రభుత్వ న్యాయవాది సమయం కోరడంతో ప్రస్తుతానికి ముందస్తు బెయిల్ ఇవ్వలేమని, అరెస్టుకు అవకాశం లేకపోలేదని కోర్టు పేర్కొంది. వైసీపీ హయాంలో మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి

- మిగతా 2 లో

సీబీఐ డైరెక్టర్ పదవీకాలం పొడిగింపు

న్యూదిల్లీ: సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీకాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రవీణ్ సూద్ 25 మే 2023న రెండేళ్ల కోసం నియమితులయ్యారు. అయితే పదవీకాలాన్ని పొడిగిస్తూ డీవోపీటీ ఆదేశాలు జారీ చేయడంతో 2026 మే వరకు పదవిలో ఆయన కొనసాగుతారు. ప్రధాని మోదీ అధ్యక్షతన సోమవారం జరిగిన ఎంపిక కమిటీ సమావేశంలో సూద్ పదవీకాలాన్ని పొడిగించాలని నిర్ణయించారు. సూద్ 1986 బ్యాచ్, కర్నాటక కేడర్ ఐపీఎస్ అధికారి.గతంలో కర్నాటక డీజీపీగానూ పని

- మిగతా 2 లో

పోప్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభం

వాటికన్: వాటికన్ దేశాధినేతగా బాధ్యతలు చేపట్టే తదుపరి పోప్‌ను ఎన్నుకునే ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. 70 దేశాలకు చెందిన 133 మంది క్యాథలిక్ మతగురువులైన కార్డినళ్లు వాటికన్‌లోని సిస్టీన్ చాపెల్ చర్చిలో సమావేశమయ్యారు. 'ప్రిన్సెస్ ఆఫ్ చర్చ్'గా ప్రసిద్ధులైన అత్యున్నతస్థాయి కార్డినళ్లు ముందుగా లిటనీ ఆఫ్ సెయింట్స్ గీతాలాపనల మధ్య చాపెల్‌లోకి ప్రవేశించారు. గోప్యతా ప్రమాణం అనంతరం రహస్య బ్యాలెట్ ద్వారా ఓటేశారు. ఈ ఓటింగులో మూడింట రెండొంతుల ఓట్లు, అంటే 89 ఓట్లు సాధించిన వ్యక్తి పోప్‌గా ఎన్నికైనట్టు ప్రకటిస్తారు. నిర్దిష్ట సంఖ్య ఓట్లు సాధించిన వ్యక్తి ఎంపికయ్యే వరకూ ఉదయం, సాయంత్రం రెండుసార్లు ఓటింగ్ నిర్వహిస్తారు.

ఇదీ లోకం!

బాంబుల వర్షం

అర్ధరాత్రి అపరేషన్ సిందూర్

- పాక్‌లో ఉగ్ర స్థావరాలపై భారత్ మెరుపు దాడి
- విరుచుకుపడ్డ క్షిపణులు
- 80 మంది ముష్కరుల హతం
- కీలక మౌలిక సదుపాయాల ధ్వంసం
- 25 నిమిషాల్లో పని పూర్తి

యావత్ భారత దేశం ఎదురుచూస్తున్న, కోరుకుంటున్న ఘట్టం ఆవిష్కృతమైంది. పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. మంగళవారం అర్ధరాత్రి దాటాక చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. భారత సైన్యం, వైమానిక దళం, బలగాలు సంయుక్తంగా ఈ మెరుపు దాడి నిర్వహించాయి. పాక్ రాడార్లకు చిక్కకుండా క్షిపణులతో లక్ష్యాలపై విరుచుకుపడ్డాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పాటు పాకిస్థాన్‌లోని ఉగ్ర మౌలిక సదుపాయాలను ధ్వంసం చేశాయి. అంతర్జాతీయ సరిహద్దుకు 100 కిలోమీటర్ల లోపు ఉన్న 9 ఉగ్ర స్థావరాలను భారత్ లక్ష్యంగా చేసుకుంది. ముఖ్యంగా భారత్‌పై సీమాంతర ఉగ్రదాడులకు కుట్రపన్నినట్లు భావిస్తున్న జైషే మహ్మద్, లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిద్దీన్ వంటి ఉగ్రసంస్థలకు చెందిన ప్రధాన స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసి వాటిని నేలమట్టం చేసింది. పూర్తి కచ్చితత్వంతో దాడులు చేసినట్లు సైన్యం వెల్లడించింది.

2లో

సైన్యానికి సర్వాధికారాలు – పాకిస్థాన్ జాతీయ భద్రతా మండలి

ప్రతీకారం తీర్చుకుంటా – నా వాళ్లతో పాటు నేనూ పోవాల్సింది: మసూద్ అజార్

8లో

ఇది గర్వించే సమయం

ఆపరేషన్ సిందూర్‌పై మోదీ స్పందన

నేడు అఖిలపక్ష భేటీకి కేంద్రం పిలుపు

న్యూదిల్లీ: పాకిస్థాన్, పీవోకేలోని ఉగ్రవాద స్థావరాలపై భారత బలగాలు నిర్వహించిన దాడి గురించి వివరించడానికి కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరన్ రిజుజు ఆ సమావేశం గురించి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "2025 మే 8న ఉదయం 11 గంటలకు దిల్లీలోని పార్లమెంట్ లైబ్రరీ భవనంలోని కమిటీ రూమ్ జి–074లో ప్రభుత్వం అఖిల పక్ష నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది" అని ఆయన చెప్పారు. మరోవైపు, భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన కొన్ని గంటల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్

- మిగతా 2 లో

సైన్యానికి అండగా ఉందాం...

న్యూదిల్లీ: పహల్గాం దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర శిబిరాలపై భారత్ సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. ఈ విషయంలో తమ పార్టీ తరఫున సైనికులకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది. భారత్ చేపట్టిన దాడుల నేపథ్యంలో సీడబ్ల్యూసీ బుధవారం అత్యవసరంగా సమావేశమైంది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్, సచిన్ పైలట్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు.

అనంతరం ఖర్గే, రాహుల్ గాంధీ విలేకరులతో మాట్లాడారు. ఉగ్రవాద స్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో సాహసోపేత నిర్ణయం తీసుకున్న భారత సాయుధ దళాలను చూసి తాము

- మిగతా 2 లో

ఉగ్రవాదానికి చెక్

- పాకిస్థాన్ భూభాగంలో ముష్కరులు లేకుండా చేయాలి
- ప్రాదేశిక శాంతి-సుస్థిరతను పరిరక్షించుకోవాలి
- ఉద్రిక్తతలు-యుద్ధ పరిస్థితిని నివారించాలి
- కేంద్రానికి సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) హితవు



పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టి ఉగ్రవాదానికి కేంద్ర ప్రభుత్వం చెక్ పెట్టిందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వ్యాఖ్యానించింది. పాకిస్థాన్ భూభాగం నుంచి ఉగ్ర కార్యకలాపాలకు తావు లేకుండా ఉండేందుకు అక్కడి ఉగ్రవాద మౌలిక వసతులపై ఉక్కుపాదం మోపేలా పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచాలని కేంద్రాన్ని కోరింది.

2లో

సైన్యానికి సంఘీభావంగా

ర్యాలీకి తరలిరండి

యువతకు సీఎం రేవంత్ పిలుపు

విశాలాంధ్ర–హైదరాబాద్: 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం రోజు చేపట్టిన ర్యాలీలో యువత పెద్దఎత్తున పాల్గొనాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సాయంత్రం ఆరు గంటలకు సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో చేపట్టిన సివిల్ మాక్‌డ్రిల్, అనంతర పరిస్థితులపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులతో సమీక్షించారు. ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. సీఎం మాట్లాడుతూ... రాష్ట్రంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అన్ని శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేయాలన్నారు. నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగనీయొద్దన్నారు. రక్షణరంగ సంస్థల వద్ద, శంషాబాద్ విమానాశ్రయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. కేంద్ర నిఘా బృందాలతో రాష్ట్ర నిఘా బృందాలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. పహల్గాం ఉగ్రదాడితో భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న క్రమంలో హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో మాక్‌డ్రిల్స్ నిర్వహించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పోలీసు, ఫైర్, విద్యుత్తు, ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది మాక్‌డ్రిల్స్‌లో పాల్గొన్నాయి.

30 మంది మావోయిస్టుల మృతి

రెండు భారీ ఎన్‌కౌంటర్లు

విశాలాంధ్ర–చింతూరు/జీకే వీధి/వై రామవరం: మావోయిస్టులకు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. కేంద్రబలగాలు మావోయిస్టులను కాల్చిచంపుతున్నాయి. అటు కర్రెగుట్టల్లోనూ, ఇటు ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల్లో బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో 30 మంది మావోయిస్టులు మృతిచెందారు. అల్లూరి జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత జగన్ మృతిచెందినట్లు తెలుస్తోంది. కర్రెగుట్టల్లో 16 రోజుల నుండి మావోయిస్టుల ఏరివేతకు 20 వేల మంది జవాన్లతో గాలింపు చర్యలు కొన సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళ వారం, బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్లలో 26 మంది మృతిచెందినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఘటనాస్థలాల్లో భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఎదురుకాల్పులను బస్తర్ ఐజీ సుందర్ రాజు పట్టా ధ్రువీకరించారు. ఆపరేషన్ కొనసాగుతున్నందున భద్రతా కారణాల దృష్ట్యా సమాచారాన్ని తెలుపలేమని ఆయన పేర్కొన్నారు. తమ ఆపరేషన్‌కు మంచి ఫలితాలు లభిస్తున్నట్లు తెలిపారు. బస్తరు ప్రాంతాన్ని సురక్షితంగా, శాంతియుతంగా ఉంచడానికి భద్రతా దళాలు పూర్తిగా కట్టుబడి ఉన్నాయన్నారు. కర్రెగుట్టల్లో ఇప్పటి వరకు జరిగిన ఆపరేషన్‌లో ఇది అతిపెద్దదని, దీనికి సంకల్ప్ అని పేరు పెట్టామని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, ఎస్‌టీఎఫ్, రాష్ట్ర పోలీసు బలగాల్లోని అన్ని విభాగాలు సహా 20 వేలపైగానే జవాన్లు 16 రోజులుగా గాలింపు చర్యలు చేపడుతున్నారని

- మిగతా 2 లో

'ఆపరేషన్ సిందూర్'కు పూర్తి మద్దతు

- 'కగార్' నిలిపివేయండి
- సమ్మె ఉద్యోగుల హక్కు
- ఆర్టీసీ కార్మికుల సమస్యలపై సీఎంను కలుస్తా
- అప్పుల ఊబిలోకి నెట్టింది బీఆర్ఎస్సే: కూనంనేని

విశాలాంధ్ర– హైదరాబాద్: ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను స్వాగతిస్తూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ఉగ్రవాదానికి కులం, మతం, దేశం లేదన్నారు. పాకిస్థాన్ పాలకులు, ఉగ్రవాదులు ఒకరిపై ఒకరు ఆధారపడి భారత్ లో నరమేధాన్ని సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. పాక్... ఆక్రమిత కశ్మీర్‌ను ఆసరాగా చేసుకుని ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందన్నారు. దానికి సరైన గుణపాఠం చెప్పాలిందేనన్నారు. కేంద్రం పక్కా కార్యాచరణతో ముందుకు సాగేలా అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. దేశ పౌరులైన మావోయిస్టులను తుదముట్టించేందుకు ఆపరేషన్ కగార్ చేపట్టడం సరైంది కాదని, తక్షణమే దీనిని నిలిపివేయాలని కూనంనేని డిమాండ్ చేశారు. మావోయిస్టు శాంతి చర్చలకు వస్తామంటే వాటికి ఒప్పుకునేదిలేదని, లొంగిపోవాల్సిందేనని ఓ కేంద్ర మంత్రి నియంతలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మావోయిస్టులు తప్పు చేస్తే తప్పకుండా ఖండిస్తామని, దేశ పౌరులైన వారికి అన్ని చట్టాలు వర్తిస్తాయని, వాటి ప్రకారం వారిని శిక్షించాలే తప్ప ఎదురుకాల్పుల్లో చంపేయడం తగదన్నారు. కూంబింగ్ పేరుతో కర్రెగుట్టలను చుట్టుముట్టి 22 మందిని చంపడం ఏమిటని ప్రశ్నించారు. సమ్మె అనేది ఉద్యోగుల హక్కు అని, పాలకులు వారి సమస్యలను పట్టించుకోనప్పుడు వాటిని సాధించుకునేందుకు అది ఒక సాధనమని సాంబశివరావు అన్నారు. టీజీఎస్ఆర్టీసీ కార్మికుల సమస్యలపై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌తో సమావేశమౌతామని కూనంనేని తెలిపారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చల్లో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చిందని, సీఎంతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారని, దీంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశారన్నారు. ప్రధానంగా ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాల పునరుద్ధరణతో పాటు బకాయిల అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న సమస్యలన్నిటికీ కారణం గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని విమర్శించారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిందేనని అన్నారు. గతంలో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితులను

- మిగతా 2 లో

ఉగ్రవాదానికి చెక్

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టి ఉగ్రవాదానికి కేంద్ర ప్రభుత్వం చెక్ పెట్టిందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వ్యాఖ్యానించింది. పాకిస్థాన్ భూభాగం నుంచి ఉగ్ర కార్యకలాపాలకు తావు లేకుండా ఉండేందుకు అక్కడి ఉగ్రవాద మౌలిక వసతులపై ఉక్కుపాదం మోపేలా దాయాది దేశంపై ఒత్తిడి పెంచాలని కేంద్రాన్ని కోరింది. అదే సమయంలో ప్రాదేశిక శాంతి, సుస్థిరతలను కాపాడుకోవాలని, ఉద్రిక్తతలు-యుద్ధ పరిస్థితిని నివారించాలని హితవు పలికింది. ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతిస్తూ సీపీఐతో పాటు సీపీఎం, సీపీఐ(ఎంఎల్) వేర్వేరు ప్రకటనలు చేశాయి. ఉగ్ర మౌలిక వసతుల నిర్వీర్యానికిగాను పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచాలని, ఉద్రిక్తతల నివారణకు దౌత్య పద్ధతులు అనుసరించాలని కేంద్రప్రభుత్వానికి సూచనలు చేశాయి. క్లిష్ట పరిస్థితుల్లో దేశ సమగ్రతను, సమైక్యతను కాపాడుకోవాలని హితవు పలికాయి. అమాయకుల రక్తపాతం, కవ్వింపు చర్యలతో ఉగ్రవాదం మూలాలపై దాడి చేయడం తప్ప భారత్‌కు ప్రత్యామ్నయం లేకుండా పోయిందని ఆపరేషన్ సిందూర్‌నుద్దేశించి సీపీఐ వ్యాఖ్యానించింది. ఉగ్రవాద శిబిరాలను, పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని ఉగ్రవాద మౌలిక వసతులను ధ్వంసం చేసేందుకు భారత సైన్యం దాడులు చేసిందని సీపీఎం పేర్కొంది. ఉద్రిక్తతలను మరింత పెంచవద్దని, యుద్ధాన్ని నివారించాలని సీపీఐ(ఎంఎల్) సూచించింది.

పాకిస్థాన్ సైనిక శిబిరాలకు నష్టం కలిగించకుండా కేవలం ఉగ్రస్థావరాలే లక్ష్యంగా దాడులు చేయడంతో పూర్తిస్థాయి ఘర్షణకు తావివ్వని జవాబుదారీతనంతో భారత్ వ్యవహరించిందని సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉగ్రవాదంపై పోరునకు బలమైన ఏకాభిప్రాయం కోసం తక్షణమే అఖిలపక్షాన్ని పిలవాలని కేంద్రాన్ని కోరింది. పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చకుండా దౌత్య పద్ధతుల్లో ముందుకెళ్లాలని, ప్రాదేశిక శాంతిని పరిరక్షించాలని, రాజకీయపరమైన పరిష్కారాలకు కట్టుబడాలని సూచించింది. ఉగ్రవాదం వల్ల సొంతంగా ఎంతో నష్టపోయిన పాకిస్థాన్...తమ దేశంలో ఉగ్రవాద నెట్‌వర్క్ లేకుండా చేయాలని సీపీఐ పిలుపునిచ్చింది. ఉమ్మడి ప్రాదేశిక సంకల్పంతోనే హింస ఛట్రాన్ని ముగించవచ్చని, తద్వారా దీర్ఘకాలిక శాంతిభద్రతలకు హామీ లభిస్తుందని పేర్కొంది. లౌకిక విలువలు, చట్టం పట్ల భారత పౌరుల అచంచల నిబద్ధతకు, వారి బలం, ఐక్యతకు ఈ క్షణం ప్రతీక అని సీపీఐ వెల్లడించింది. పహల్గాం దోషులను అప్పగించేలా.. వారి భూభగంలో ఏ ఒక్క ఉగ్ర శిబిరం లేకుండా చేసేలా పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచాలని సీపీఎం డిమాండ్ చేసింది. దేశ ఐక్యత, సమగ్రత పరిరక్షణకు హామీనిచ్చే చర్యలను కోరింది. ఆపరేషన్ సింధూర్ క్రమంలో మహిళలు, పిల్లలు సహా పౌర మరణాలు సంభవించినట్లు పాకిస్థాన్ చెబుతోంది కానీ సరిహద్దుల వద్ద కాల్పులు, జమ్మూకశ్మీర్‌లో పౌర మరణాలపై నివేదికలు అందుతున్నాయని సీపీఐ(ఎంఎల్) పేర్కొంది. కేంద్ర హోంశాఖ ఆదేశాలతో దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్స్ జరుగుతున్నాయి... 1971 యుద్ధమప్పటి పరిస్థితులను గుర్తుచేస్తున్నాయని తెలిపింది. ఇటువంటి మాక్ డ్రిల్స్ వల్ల దేశంలో అంతర్గతంగా సమస్యలు రాకుండా చూడాలని కేంద్రాన్ని కోరింది. హిమాన్షీ నర్వాల్, షైలా నేగి వంటి మహిళలపై ద్వేషాన్ని రెచ్చగొట్టే రాజకీయపరమైన స్వరాలు, ట్రోల్ ఆర్మీ నియంత్రణకు సీపీఐ(ఎంఎల్) పిలుపునిచ్చింది. సామాజిక మాధ్యమాల్లో అవాస్తవాల ప్రచారాన్ని కట్టడి చేయాలని, ఫేక్ న్యూస్ అరికట్టాలని కేంద్రాన్ని కోరింది. అణచివేత విధానాన్ని ఆపాలని హితవు పలికింది. న్యాయాన్ని ప్రేమించే భారతీయులంతా ఐక్యంగా ఉండేందుకు భరోసా ఇచ్చేలా సముచిత చర్యలు తీసుకోవాలని సూచించింది. శాంతి, సామరస్యత, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని సీపీఐ(ఎంఎల్) పిలుపునిచ్చింది. పాకిస్థాన్‌లో ఉగ్రవాదాన్ని తుద ముట్టించాలని దాయాది దేశానికి సూచన చేసింది. ఉగ్రవాదం-యుద్ధం వ్యతిరేక స్వరం వినిపించాలని పాకిస్థాన్ ప్రజలను కోరింది. యుద్ధాన్ని వ్యతిరేకించాలని సరిహద్దుకు రెండు వైపుల ఉన్న ప్రజలకు సీపీఐ(ఎంఎల్) సూచించింది.

సైన్యానికి అండగా ఉందాం...

(మొదటిపేజీ తరువాయి)

గర్విస్తున్నామని ఖర్గే అన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడడానికి అన్ని స్థాయిల్లో ఐక్యంగా ఉండాలన్నారు. దేశ రక్షణ, ఐక్యత, స్వేచ్ఛను కాపాడటానికి తమ పార్టీ తరఫున సైనికులకు పూర్తి మద్దతు ఇస్తున్నామని వెల్లడించారు. సాయుధ దళాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని రాహుల్ గాంధీ కూడా ప్రకటించారు. మన సాయుధ బలగాలను చూసి గర్విస్తున్నాన్నారు. సైన్యం తీసుకున్న చర్యల్ని ఆయన ప్రశంసించారు. విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించిన భద్రతా దళాలకు చాలా ప్రేమతో శుభాకాంక్షలు చెబుతున్నానని అన్నారు. గురువారం కేంద్రం నిర్వహించే అఖిల పక్ష సమావేశానికి కాంగ్రెస్ పార్టీ హాజరవుతుందని రాహుల్ గాంధీ ధ్రువీకరించారు.

శరద్‌పవార్ హర్షం

భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధినేత శరద్‌పవార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ చర్య ద్వారా భారత్ శక్తి సామర్థ్యాల గురించి ప్రపంచానికి సందేశం ఇచ్చినట్లయిందన్నారు. ఈ పరీక్షా సమయంలో తాను ప్రధాని మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌కు ఫోన్‌చేసి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపానని పవార్ వెల్లడించారు. కాగా 'జై హింద్, జై ఇండియా' అని పశ్చిమ్ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోస్టు పెట్టారు.

మద్యం కేసులో బెయిల్ నిరాకరణ

(మొదటిపేజీ తరువాయి)

ముడుపులు అందుకున్నట్లు ఈ ముగ్గురిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసును సిట్ దర్యాప్తు చేస్తున్నది. ప్రధాన నిందితుడు (ఏ1) రాజ్ కసిరెడ్డిని ఇప్పటికే అరెస్టు చేశారు. తాజాగా సీఎంఓ కార్యదర్శి ధనుంజయ రెడ్డిని ఏ31గా, అప్పటి సీఎం జగన్‌కు ఓఎస్‌డీ కృష్ణమోహన్ రెడ్డిని ఏ32గా, భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ బాలాజీ గోవిందప్పను ఏ33గా సిట్ చేర్చింది. అరెస్టు భయంతో ముందస్తు బెయిల్ కోసం వీరు హైకోర్టుకు వెళ్లగా... అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి కోర్టు నిరాకరించింది.

సీబీఐ డైరెక్టర్ పదవీకాలం పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ప్రవీణ్ సూద్ 1964లో హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాలో జన్మించారు. 22 ఏళ్లకు ఇండియన్ పోలీస్ సర్వీస్‌లో చేరారు. దిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, న్యూయార్క్‌లోని సిరక్యూస్ విశ్వవిద్యాలయంలోని మాక్స్‌వెల్ స్కూల్ ఆఫ్ గవర్నెన్స్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్నారు. అనేక ఉన్నత స్థాయి కేసుల దర్యాప్తును పర్యవేక్షించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సూద్ కర్నాటకలోని క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్, ఇంటర్ ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్స్ బలోపేతానికిగాను న్యాయవ్యవస్థతో కలిసి పని చేశారు.

యుద్ధం రానివ్వొద్దు...

- ప్రాదేశిక సుస్థిరతకు విఘాతం కలగనివ్వొద్దు
- శాంతియుతంగా చర్చించి సమస్యలు పరిష్కరించుకోండి
- దౌత్యానికి మా వంతు సహకరిస్తాం
- భారత్-పాక్‌కు ప్రపంచ నేతల హితవు

సంయమం పాటించండి

వాషింగ్టన్/మాస్కో: భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగే పరిస్థితులు నెలకొనడంపై ప్రపంచ దేశాధినేతలు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలను శాంతియుతంగా, సామరస్యంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, ఇందుకోసం రాజకీయ, దౌత్య, ద్వైపాక్షిక మార్గాలను అనుసరించాలని భారత్, పాకిస్థాన్‌కు హితవు పలికారు. ప్రాదేశిక శాంతి, సుస్థిరతకు విఘాతం కలగనివ్వవద్దని సూచించారు. దౌత్యానికి తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధమని కొందరు నేతలు వెల్లడించారు. జమ్మూకశ్మీర్, పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ మంగళ-బుధవారం మధ్యరాత్రి పేరిట మెరుపు దాడులు చేసింది. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా 'ఆపరేషన్ సింధూర్' చేపట్టింది. దీంతో ప్రపంచ దేశాధినేతలు స్పందించారు. శాంతికి పిలుపునిచ్చారు. సంయమం పాటించాలని సూచనలు చేశారు. ఈ శుత్రుత్వం త్వరగా ముగుస్తుందని అమెరికా, రష్యా, చైనా, జపాన్, అరబ్‌తో పాటు అనేక దేశాలు ఆకాంక్షించాయి. శాంతి మార్గంలో సమస్యలు పరిష్కారం కాగలవని, యుద్ధం వద్దని, సంయమం పాటించాలని ఐక్య రాజ్య సమితి కూడా పిలుపునిచ్చింది. పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సింధూర్' ద్వారా పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. దాదాపు 100 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఈ పరిణామాన్ని పాకిస్థాన్ యుద్ధ చర్యగా అభివర్ణించింది.

శాంతించాలి...

భారత్, పాకిస్థాన్‌కు ప్రత్యేకంగా ఇచ్చే సందేశమేమీ లేదు కానీ ఇదంతా త్వరగా ముగుస్తుందని ఆశిస్తున్నా అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఓవల్ కార్యాలయంలోకి ప్రవేశించేటప్పుడు విషయం తెలిసిందని చెప్పారు. ఈ పోరు ఇప్పటిది కాదు కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతోందని అన్నారు. ఈ పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. భారత్, పాకిస్థాన్ మధ్య పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు అమెరికా మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. పాకిస్థాన్ మీద భారత్ ప్రతీకార దాడి... పోరు తీవ్రరూపం దాల్చుతుండటం ఆందోళన కలిగిస్తోందని రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మారియా జఖోరోవా అన్నారు. పరిస్థితి చేయిదాటకుండా చూసుకోవాలని హితవు పలికారు. ప్రాదేశిక ఘర్షణను నివారించేందుకు సంయమం పాటించాలని కోరారు. శాంతియుత, రాజకీయ, దౌత్య మార్గాల్లో భారత్, పాకిస్థాన్ మధ్య విభేదాలు పరిష్కారం కాగలవని ఆకాంక్షించారు. 1972 నాటి సిమ్లా ఒప్పందం, 1999 నాటి లాహోర్ డిక్లరేషన్ ప్రకారం ద్వైపాక్షిక మాధ్యమంగా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని భారత్, పాక్‌కు రష్యా అధికారి సూచించారు. ప్రాదేశిక, అంతర్జాతీయ శాంతికి ముప్పు కలిగించే పరిస్థితి తేవద్దని, పరిస్థితి మరింత జఠిలం కాకుండా, ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చకుండా సంయమం పాటించాలని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఉప ప్రధాని అబ్దుల్లా బిన్ జాయేద్ అల్ నహ్యాన్ ఒక ప్రకటనలో కోరారు. చర్చలు, పరస్పర అవగాహనతో సైనిక ఘర్షణల నివారణకు పిలుపునిచ్చారు. దక్షిణాసియా సుస్థిరతకు, ప్రాదేశిక ఉద్రిక్తతల నివారణకు శాంతియుతంగా చర్చించుకోవాలని సూచించారు. శాంతి, సుస్థిరత, సౌభాగ్యతకు కట్టుబడాలన్నారు. శాంతియుతంగా చర్చలు జరుపుకోవాలని భావిస్తే తమ వంతు సహకారం అందించేందుకు యూఏఈ సిద్ధమన్నారు. భారత్, పాక్ మధ్య పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు జపాన్ చీఫ్ కేబినెట్ సెక్రటరీ యోషిమాసా హయాషి తెలిపారు. ఈ పరిస్థితులు యుద్ధానికి దారి తీయొచ్చు... సంయమం పాటించండి అని రెండు దేశాలను కోరారు. దక్షిణాసియా శాంతి, సుస్థిరత కోసం చర్చల ద్వారా పరిస్థితిని నియంత్రించాలన్నారు. ఇదిలావుంటే, ప్రాదేశిక శాంతి, సుస్థిరత పరిరక్షణకు చైనా పిలుపునిచ్చింది. సంయమం పాటించాలని చైనా విదేశాంగ శాఖ ఒక ప్రకటన చేసింది. 'భారత్, పాకిస్థాన్ ఇరుగు-పొరుగు దేశాలు, చైనాకు కూడా ఇవి పొరుగు దేశాలు. వీటి మధ్య ఇలాంటి పరిస్థితులు నెలకొనడం బాధాకరం. అన్ని రూపాల్లో ఉగ్రవాదాన్ని చైనా వ్యతిరేకిస్తుంది. అయితే శాంతి, సుస్థిరత దృష్ట్యా సంయమం పాటించాలని, పరిస్థితిని జఠిలం చేసే చర్యలు నివారించాలని సూచిస్తోంది' అని ప్రకటనలో చైనా విదేశాంగ శాఖ పేర్కొంది.

యుద్ధమొస్తే ప్రపంచం తట్టుకోలేదు: ఐరాస

అణ్వస్త్రాలు కలిగివున్న భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం వస్తే ప్రపంచం తట్టుకోలేదని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు. నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ)తో పాటు ఐబీ వెంబడి భారత సైనిక చర్యలతో సంయమం పాటించాలని పిలుపునిచ్చారు. శాంతియుతంగా దౌత్య మార్గంలో సమస్యలు పరిష్కరించుకోవాలని, యుద్ధంతో సమాధానం లభించబోదని హితవు పలికారు. ఈ మేరకు గుటెర్రస్‌కు అధికార ప్రతినిధి స్టెఫనీ దుజారిక్ వెల్లడించారు.

బాంబుల వర్షం

న్యూఢిల్లీ: యావత్ భారత దేశం ఎదురుచూస్తున్న, కోరుకుంటున్న ఘట్టం ఆవిష్కృతమైంది. పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. మంగళవారం అర్ధరాత్రి దాటాక చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. భారత సైన్యం, వైమానిక దళం, బలగాలు సంయుక్తంగా ఈ మెరుపు దాడి నిర్వహించాయి. పాక్ రాడార్లకు చిక్కకుండా క్షిపణులతో లక్ష్యాలపై విరుచుకుపడ్డాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పాటు పాకిస్థాన్‌లోని ఉగ్ర మౌలిక సదుపాయాలను ధ్వంసం చేశాయి. అంతర్జాతీయ సరిహద్దుకు 100 కిలోమీటర్ల లోపు ఉన్న 9 ఉగ్ర స్థావరాలను భారత్ లక్ష్యంగా చేసుకుంది. ముఖ్యంగా భారత్‌పై సీమాంతర ఉగ్రదాడులకు కుట్రపన్నినట్లు భావిస్తున్న జైషే మహ్మద్, లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిద్దీన్ వంటి ఉగ్రసంస్థలకు చెందిన ప్రధాన స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసి వాటిని నేలమట్టం చేసింది. పూర్తి కచ్చితత్వంతో దాడులు చేసినట్లు సైన్యం వెల్లడించింది. కేవలం ఉగ్రస్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నామని...పాక్ సైనిక శిబిరాలు, పౌర ఆవాసాలు తమ లక్ష్యం కాదని స్పష్టం చేసింది. 'ఆపరేషన్ సిందూర్' విశేషాలను కేంద్ర విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ప్రత్యేకంగా విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. పాక్‌లోని 4, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5 స్థావరాలపై దాడులు చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా కోట్లీలోని గుల్పూర్ టెర్రర్ క్యాంప్‌పై ఎలా దాడి చేశామనేది సోఫియా ఖురేషి వీడియో ప్రదర్శించారు. ఇక్కడే గతంలో 'పూంచ్' దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు శిక్షణ తీసుకున్నారంటూ పేర్కొన్నారు. "అర్ధరాత్రి 1.05 నుంచి 1.30 గంటల వరకు ఆపరేషన్ సిందూర్ నిర్వహించాం. దాదాపు 25 నిమిషాల పాటు సాగింది. పహల్గాం మృతులకు న్యాయం చేసేందుకే ఆపరేషన్ సిందూర్. గుల్పూర్ టెర్రర్ క్యాంప్ అంతర్జాతీయ సరిహద్దుకు 30 కి.మీ. దూరంలోనే ఉంటుంది. లష్కరే తోయిబాకు చెందినదిగా గుర్తించాం. రాజౌరి - పూంచ్ ప్రాంతాల్లో ఇందులోని ఉగ్రవాదులు యాక్టివ్‌గా ఉన్నారు. ఇక్కడే 2023, 2024లో పూంచ్ దాడుల్లో కీలకంగా వ్యవహరించిన ఉగ్రవాదులు ట్రెనింగ్ పొందినట్లు మాకు సమాచారం ఉంది" అని సోఫియా తెలిపారు.

25 నిమిషాల్లోనే ఉగ్రమూకల ఖేల్ ఖతం

భారత భద్రతా బలగాలు పక్కా ప్రణాళికతో కేవలం 25 నిమిషాల్లో 24 క్షిపణులతో దాడులు చేసి ఉగ్రవాద మూకల ఆటకట్టించాయి. చెప్పినట్టే చేసి టెర్రరిస్టులకే టెర్రర్ అంటే ఏంటో చూపించింది. బుధవారం తెల్లవారుజామున 1:05 గంటల నుంచి 1:30 గంటల వరకు 25 నిమిషాల పాటు ఆపరేషన్ జరగ్గా, 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడానికి 24 క్షిపణులను భారత్ ప్రయోగించింది. ఉగ్ర స్థావరాలపై దాడి కోసం భూమి నుంచి, గాలి నుంచి ప్రయోగించే క్షిపణులతో పాటు లేజర్ నిర్దేశిత క్షిపణులు, ఉపగ్రహ గైడెడ్ గ్లైడ్ బాంబులను భారత్ ఉపయోగించింది. నిఘా డ్రోన్‌ల రియల్ టైమ్ పర్యవేక్షణలో అతి తక్కువ ప్రాణనష్టంతో ఉగ్రవాద స్థావరాలను కచ్చితత్వంతో భారత్ ధ్వంసం చేసింది. 'ఆపరేషన్ సిందూర్'లో పెద్ద సంఖ్యలోనే పాక్ ఉగ్రవాదులు హతమైనప్పటికీ మరణాల వివరాలను తగ్గించి చూపేందుకు పాకిస్థాన్ యత్నిస్తోంది.

ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి ముందు భారత త్రివిధ దళాలు పెద్ద కసరత్తే చేశాయి. తొలుత పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీరు (పీఓకే)లోని ప్రధాన ఉగ్రవాద స్థావరాల లొకేషన్లను అత్యంత కచ్చితత్వంతో గుర్తించాయి. ఇందుకోసం భారత నిఘా వర్గాలు అందించిన సమాచారాన్ని వాడుకున్నాయి. పాక్, పీఓకేలోని ముజఫరాబాద్, కోట్లీ, బహవల్‌పూర్, రావల్ కోట్, చాక్స్వరి, భీంబేర్, నీలం వ్యాలీ, జీలం, చాక్వల్‌లలో ఉన్న నిర్దిష్ట ఉగ్రవాద స్థావరాలను భారత్ లక్ష్యంగా ఎంచుకుంది. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలు లష్కరే తోయిబా, జైషే మహ్మద్ గతంలో భారత్‌లో ఎన్నో ఉగ్రదాడులకు పాల్పడ్డాయి. ఈ రెండు ఉగ్ర సంస్థలకు నిలయాలుగా, స్థావరాలుగా మారిన 9 నిర్దిష్ట ప్రాంతాలనే తమ లక్ష్యంగా భారత త్రివిధ దళాలు ఎంచుకున్నాయి. వీటిలో నాలుగు ఉగ్ర స్థావరాలు పాకిస్థాన్‌లో ఉండగా, మిగతా ఐదు ఉగ్ర స్థావరాలు పీఓకేలో ఉన్నాయి. ఉగ్రవాదులను జమ్మూకశ్మీరులోకి చొరబాటుకు పంపేందుకు ముజఫరాబాద్, భీంబేర్‌లను పాక్ ఉగ్రవాద సంస్థలు ఎంట్రీ పాయింట్లుగా వాడుకుంటున్నాయి. అందుకే వాటిని ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా టార్గెట్ చేశారు. మొత్తం మీద 9 ఉగ్రవాద స్థావరాల్లోని డ్రోన్లతో భారత్‌పై నిఘా పెట్టే కమాండ్ కంట్రోల్ సెంటర్లు, ట్రైనింగ్ క్యాంపులు, ఆయుధ డిపోలు, ఇతరత్రా మౌలిక సదుపాయాలను భారత సేనలు విజయవంతంగా ధ్వంసం చేశాయి. ఇవన్నీ రాత్రికి రాత్రి పాక్ ఆక్రమిత కశ్మీరులో ఏర్పాటు కాలేదు. గత 30 ఏళ్లుగా పాక్ ప్రభుత్వం, సైన్యం నుంచి అందుతున్న ఆర్థికసాయంతోనే ఉగ్రవాదులు ఈ మౌలిక సదుపాయాలన్నీ ఏర్పాటు చేసుకున్నట్లు పరిశీలకులు చెబుతున్నారు.

జైషే ప్రధాన కేంద్రంపైనా దాడులు

భారత్ చేపట్టిన దాడుల్లో జైషే ప్రధాన కేంద్రం కూడా ఉంది. అంతర్జాతీయ సరిహద్దుకు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న బహవల్‌పూర్‌లోని మర్కజ్ సుబాన్ అల్లాహ్‌పై భారత సైన్యం దాడి చేసింది. దీన్ని జైషే మహ్మద్‌కు ఆపరేషనల్ హెడ్‌క్వార్టర్‌గా గుర్తిస్తారు. పుల్వామా దాడి సహా భారత్‌పై చాలా కుట్రలకు ఇక్కడే ప్రాణాళిక రచించారు. దీనినే మసూద్ తన ఇంటిగా కూడా వినియోగిస్తాడు. ప్రస్తుతం జేషే నెంబర్-2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్, మౌలానా అమర్ ఇతరుల కుటుంబ సభ్యులు కూడా ఇక్కడే ఉంటున్నట్లు తెలుస్తోంది. సుమారు 600 మంది ఉగ్రవాదుల ఇళ్లు కూడా ఈ క్యాంపస్‌లోనే ఉన్నట్లు సమాచారం.

మసూద్ అజార్‌కు ఎదురుదెబ్బ...

భారత్ చేపట్టిన దాడుల్లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ కుటుంబసభ్యులు హతమయ్యారు. 10 మంది కుటుంబసభ్యులు, మరో నలుగురు అనుచరులు మరణించినట్లు మసూద్ అజార్ వెల్లడించాడు. భారత్ దాడుల్లో మసూద్ అజార్ అక్క, బావ, మేనల్లుడు, అతని భార్యతో పాటు మరో ఐదుగురు మరణించినట్లు చెప్పాడు. జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయం బహవల్‌పూర్‌లోని జామియా మసీదు సుబాన్ అల్లాహ్ ప్రాంతంలో జరిగిన దాడిలో మరణించినట్లు తెలిపాడు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

'రాజీవ్ వికాస్' నిరుద్యోగులకు వరం: మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర బ్యూరో- ములుగుజిల్లా: ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ చిత్తశుద్ధితో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పేదవాడి కలలను సాకారం చేయడానికి ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. జిల్లాలో బుధవారం భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ శబరిష్ , ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రాలతో కలిసి వాజేడు మండలం టేకులగూడెం లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ, రూ.4 కోట్లతో నాగారం నుంచి పాయబట్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు, రూ.1.50 కోట్ల అంచనా విలువ తో వాజేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవన నిర్మాణం, రూ.3 కోట్లతో ఎద్చర్లపల్లి నుంచి ముత్తారం వరకు బీటీ రోడ్డు నిర్మాణం పనులను శంకుస్థాపనలు, రూ.14 లక్షలతో నిర్మించిన బేబీ బర్త్ వెయిటింగ్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం కొంగాలలో 57 మందికి , నాగారంలో 64 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. వెంకటాపురంలో రూ.60 లక్షలతో ఉపకార్య నిర్వాహక ఇంజినీర్ (పి.ఆర్) కార్యాలయ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పాత్రపురం రైతు వైదిక లో ఇందిరమ్మ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ... గత ప్రభుత్వం రూ.8 లక్షల 19 వేల కోట్లు అప్పులు చేసి ప్రజలపై పెను భారం మోపిందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గత పాలకుల అప్పులు తీర్చడంతో పాటు సంక్షేమ ఫలాలను అందజేస్తున్నామని వివరించారు. ప్రతి నిరుపేద కుటుంబానికి రూ.ఐదు లక్షలతో ఇళ్ల నిర్మాణానికి ఇస్తున్నట్టు తెలిపారు. సన్నబియ్యాన్ని పేదలకు అందించాలని లక్ష్యంతో ప్రతి ఒక్కరికి ఆరు కిలోలు అందజేస్తున్నామని అన్నారు. అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలోనే 57 వేల 662 ఉద్యోగాలు ఇచ్చామన్నారు. భూ భారతి చట్టం తెచ్చి పేద రైతులకు చుట్టంగా మార్చామన్నారు. నిరుద్యోగులకు భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో రాజీవ్ వికాస్ పథకం కింద ఆర్థిక సహాయం చేయాలని లక్ష్యంతో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. జూన్ రెండో తేదీన అర్హులకు రూ.ఆరువేల కోట్లు అందజేస్తామన్నారు. రూ.10 లక్షలకు రాజీవ్ ఆరోగ్య వైద్య సేవలు పెంచినట్టు చెప్పారు. రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. ఐటీడీఏ పరిధిలోని నిరుపేదలకు అదనంగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని మంత్రిని కోరారు. వాజేడు, వెంకటాపురం మండలాలలో అర్హులకు దశలవారీగా ఇళ్లు కేటాయిస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వాజేడు మండలం టేకులగూడెం లో 106 ఇళ్లు మంజూరు కాగా 62 ఇళ్లు గ్రౌండ్ లెవెల్ లో ఉన్నాయని, 15 ఇళ్ల లబ్ధిదారులకు మొదటి విడత డబ్బులు చెల్లించడం జరిగిందని వివరించారు. ఏఎస్‌పి శివం ఉపాధ్యాయ, డీఎఫ్ ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఆర్డీఓ వెంకటేష్ పాల్గొన్నారు.

ఇది గర్వించే సమయం

(మొదటిపేజీ తరువాయి)

సమావేశమైంది. సైన్యం నిర్వహించిన ఆపరేషన్‌ను కేబినెట్ ప్రశంసించింది. ఇది మనందరికీ గర్వకారణమైన క్షణమని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. భద్రతాబలగాలు చేసిన కచ్చితమైన దాడిగా ఆపరేషన్ సిందూర్‌ను అభివర్ణించారు. పాకిస్థాన్ లోపలకు చొచ్చుకెళ్లి పంజాబ్ ప్రావిన్స్‌లో 4 చోట్ల, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5 చోట్లు సాయుధ బలగాలు దాడులు జరిపిన తీరును ఆయన వివరించారు. ఆ క్లిష్ట సమయంలో ప్రధాని మోదీ దేశాన్ని నడిపిన తీరును కేంద్ర మంత్రులు కొనియాడినట్లు తెలిసింది. కాగా కేబినెట్ భేటీకి ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సరిహద్దుల్లో పరిస్థితి గురించి ప్రధానికి వివరించారు.

ఐటీఐ అప్‌గ్రేడేషన్‌కు రూ.60వేల కోట్లు

ఈ సమావేశంలో కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఐటీఐ అప్‌గ్రేడేషన్ కోసం 60వేల కోట్ల రూపాయల జాతీయ పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మరోవైపు, కేబినెట్ భేటీ తర్వాత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ప్రధాని మోదీ కలిశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి వీరు సమావేశం అయ్యారు. రాష్ట్రపతితో మోదీ సమావేశమైన విషయాన్ని రాష్ట్రపతి కార్యాలయం సోషల్‌మీడియాలో వెల్లడించింది. అందుకు సంబంధించిన చిత్రాలను కూడా షేర్ చేసింది.

ప్రధాని విదేశీ పర్యటనలు రద్దు

ప్రధాని నరేంద్ర మోదీ వివిధ దేశాల పర్యటనలను రద్దు చేసుకున్నారు. ఈనెల మధ్యలో యూరప్, క్రొయేషియా, నార్వే, నెదర్లాండ్స్ దేశాల్లో మోదీ పర్యటించాల్సి ఉంది. అయితే, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్- పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలోనే ఆయన తన పర్యటనలు రద్దు చేసుకున్నట్లు తెలిసింది. ఇక, రష్యా నిర్వహించనున్న విక్టరీ డే వేడుకల్లోనూ మోదీ పాల్గొనడం లేదని ఇటీవల క్రెమ్లిన్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఉద్రిక్తతలు పెంచాలనే ఉద్దేశం భారత్‌కు లేదు: అజిత్ దోవల్

పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ మెరుపుదాడులు చేసిన నేపథ్యంలో వివిధ దేశాలకు సమచారమిచ్చారు. చైనా విదేశాంగమంత్రితో మాట్లాడుతూ... పరిస్థితులను తీవ్రతరం చేసేలా పాక్ వ్యవహరిస్తే... భారత్ నుంచి తీవ్రస్థాయిలో ప్రతిస్పందన ఆయన స్పష్టం చేశారు. అయితే, ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశం తమకు ఎంత మాత్రం లేదని వెల్లడించారు. ఇదే విషయాన్ని అమెరికా, బ్రిటన్, సౌదీ అరేబియా, జపాన్, రష్యా, ఫ్రాన్స్ దేశాల భద్రతా సలహాదారులు, కార్యదర్శులకూ డోభాల్ వివరించారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌పై తీసుకున్న చర్యలు.. ఆపరేషన్ నిర్వహించడానికి గల కారణాలను ఆయన ప్రపంచ దేశాలకు వివరించినట్లు అధికారులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా అక్కడి ఉగ్రవాదుల శిబిరాలపై దాడులు చేసిన విధానం వారికి చెప్పినట్లు సమాచారం.

30 మంది మావోయిస్టుల మృతి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. చత్తీస్‌గఢ్ ఏడీజీ ఏఎస్‌పీ వివేకానంద సిన్హా సీఆర్‌పీఎఫ్ ఐజీ రాకేశ్ అగర్వాల్, సుందర్ రాజ్ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నారు. రెండురోజుల క్రితం మహిళా మావోయిస్టు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆపరేషన్ సంకల్ప్ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

అల్లూరి జిల్లాలో ఎన్‌కౌంటర్

అల్లూరి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. అల్లూరి జిల్లా వై.రామవరం, జీకేవీధి మండలాల సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. రెండు ఏకే-47లు స్వాధీనం చేసుకున్నారు. రంగంలోకి దిగిన అదనపు బలగాలు అటవీప్రాంతాన్ని జల్లెడ పడుతున్నాయి. మావోయిస్టుల సంచారంపై సమాచారం అందుకున్న పోలీసు యంత్రాంగం ఎస్పీ అమిత్‌బర్ధర్ ఆదేశాలతో కొద్దిరోజుల నుంచి విస్తృతంగా గాలింపు చేపట్టింది. కాగా, వారం రోజుల క్రితం అల్లూరు, కొయ్యూరు, వై.రామవరం, జీకే వీధి మండలాల సరిహద్దు పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులతో మార్మోగిన సంగతి తెలిసిందే. అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరగ్గా... 15 మంది మావోయిస్టులు త్రుటిలో తప్పించుకున్నారు. తప్పించుకున్న మావోయిస్టుల్లో కీలకనేతలు గాజర్ల రవి, జగన్ ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. కిట్ బ్యాగులలో కీలక సమాచారం లభ్యమైనట్టు తెలుస్తోంది. కొందరు మావోయిస్టులకు గాయాలయ్యాయనే అనుమానంతో పోలీసులు గాలింపును విస్తృతం చేశారు.

ప్రతీకారం సంతోషాన్నిచ్చింది

పహల్గాం మృతుడి భార్య భావోద్వేగం

న్యూఢిల్లీ: 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై భారత్ మెరుపుదాడులు నిర్వహించడంతో ఉగ్రదాడిలో చనిపోయిన బాధిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాయి. భారత ప్రతీకార చర్యపై ఉగ్రదాడిలో మరణించిన వ్యాపారవేత్త శుభమ్ ద్వివేది భార్య ఐషాన్య స్పందిస్తూ... తన భర్త మరణానికి ప్రతీకారం తీర్చుకున్నందుకు ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమ నమ్మకాన్ని నిలబెట్టారని, ఇదే నా భర్తకు అసలైన నివాళి అని వ్యాఖ్యానించారు. నా భర్త ఆత్మ ఎక్కడున్నా శాంతిస్తుందని ఆమె పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడిని వ్యక్తిగతంగా తీసుకుని మోదీ, దళాలు ఆపరేషన్ సిందూర్ పేరుతో ప్రతీకారం తీర్చుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. నాలాంటి చాలా మంది మహిళలు తమ సిందూర్‌ను కోల్పోయారని, అలాంటి వారందిరికీ మోదీ ప్రభుత్వం భరోసా కల్పించిందన్నారు. అమాయకుల మరణాలకు భారతదేశం ప్రతీకారం తీర్చుకుంటుందని తాను ఎప్పుడూ నమ్ముతానని ఆమె పేర్కొన్నారు.

'ఆపరేషన్ సిందూర్'కు పూర్తి మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

మెరుగుపర్చుకునేందుకు ఆర్థికవేత్తలు, మేధావులతో ఒక సలహా కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కుంటి సాకులతో ప్రస్తుతం లబ్ధిదారుల జాబితా నుంచి తప్పిస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. గతంలో అరకొర సహాయం పొందిన వారికి ప్రస్తుత జాబితాలో ఇళ్లు కేటాయించాలని కూనంనేని కోరారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం

మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర- పినపాక : రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణం జరిగేలా కృషి చేస్తామని రెవిన్యూ, పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేసారు. ప్రతిపక్షంలో ఉన్న నేతలు పనికిమాలిన ఆరోపణలు ఎన్ని చేసిన ప్రజలకు అభివృద్ధి చేసి చూపెడతామన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం వృధా ఖర్చులకు పోకుండా, అట్టహాసాలు చేయకుండా ప్రజా సంక్షేమం అభివృద్ధి పై దృష్టి పెట్టిందన్నారు. బుధవారం పినపాక మండలం గొట్టెల గ్రామంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌లతో కలిసి పర్యటించారు. ఆ గ్రామానికి చెందిన ఇందిరమ్మ లబ్ధిదారులు ఇర్పా లక్ష్మి కి నూతన వస్త్రాలు అందించి, ఆమె ఇంటికి మంత్రి పొంగిలేటి, ఎమ్మెల్యే పాయం, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ లతో కలిసి శంకుస్థాపన చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. రాష్ట్రంలో అమలుపరిచే సంక్షేమ పథకాలలో మహిళలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించిందని వివరించారు. పినపాక నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇల్లు మొదటి విడతగా అందించామని తెలిపారు. ఆర్డీవో దామోదర్ రావు, ఎంపీడీవో సునీల్ కుమార్, వెంకటేశ్వరరావు, జన్కో ఎంప్లాయ్ కొర్సా బాలకృష్ణ, మండల అధ్యక్షుడు గోడిశాల రామనాథం, తుళ్లూరు బ్రహ్మయ్య, గంగిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కొర్సా ఆనంద్, ఆరె నవీన్ కుమార్, మధుసూదన్ రెడ్డి, కంది సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదలకు రూ.5 లక్షలతో ఇళ్ళు నిర్మిస్తున్నాం : మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - చర్ల : దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పేదవాడికి పేదవాడికి కనీసం గూడు కనిపించే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లలో ప్రతిష్టగా తీసుకొని నిర్మిస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు కేటాయించి పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వం నీడ కల్పిస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి తొలివిడతగా 3500 ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు. సొంత ఇంటి కల ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లో పూరి గుడిసెల స్థానంలోపక్కా ఇళ్ళు కట్టించి పేదల కలలను తమ ప్రభుత్వం నిజం చేస్తుందన్నారు. బుధవారం చర్ల మండలంలోని సుబ్బంపేట గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం తోపాటు లక్ష్మీ కాలనీలో కోటి 16 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. తేగడ గ్రామంలో పుల్లరి సుధాకర్ సరోజిని దంపతుల ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 16 నెలల్లోనే దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పక్కా ఇళ్ళ తోపాటు పేదలు మహిళలు సామాన్య ప్రజల కోసం సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు.

రెవిన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్: భూ సమస్యలున్న ప్రతి ఒక్క రైతు గ్రామ రెవెన్యూ సదస్సును వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ మరిపెడ మండలం అబ్బాయి పాలెం, ఎల్లంపేట, దంతాలపల్లి మండలం రామవరం, వేములపల్లి, వంతడపుల, నరసింహులపేట, ఉగ్గంపల్లి చిన్న గూడూరు మండలాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి నూతన ఆర్ఓఆర్ రెవెన్యూ చట్టం ద్వారా సామాన్య ప్రజలకు భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార శాఖ (ప్యాక్స్) ఆధ్వర్యంలో నడుస్తున్న అబ్బయ్యపాలెం, ఎల్లంపేట, రాజవరం, వేములపల్లి, ఐకెపి ఆధ్వర్యంలో నడుస్తున్న వంతడుపుల, ఉగ్గంపల్లి గ్రామాల లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి, జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో ఎఫెక్యూ నామ్స్, నాణ్యత ప్రమాణాల ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాల న్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్, జిల్లా సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, స్థానిక తహసిల్దార్లు, సైదులు, సునీల్ రెడ్డి, ఉన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - ములుగు జిల్లాబ్యూరో : ఈనెల 20వ, తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మె నోటీసును, సివిల్ సప్లై, డియం, ములుగుకు అందచేయడం జరిగిందని ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ కార్మికులకు ఉపయోగపడే 44 చట్టాలను తొలగిస్తున్న, కేంద్ర ప్రభుత్వంపై తిరుగుబాటుకు అన్ని వర్గాల కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా ములుగుజిల్లా కేంద్రంలో జరిగే సమ్మెలో సివిల్ సప్లై, జీసీసీ హమాలీ కార్మికులు, పాఠశాల వంట కార్మికులు, అంగన్వాడీ టీచర్లు, వర్కర్లు, భవన నిర్మాణ కార్మికులు, కర్షకులు ఏయన్‌యంలు ప్రతీ ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మొలుగూరి రాంబాబు ములుగు గోధాం అధ్యక్షులు రొంటాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి మాత జయంతి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : వాసవి, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో వాసవి మాత జయంతిని స్థానిక అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో బుధవారం నేరేడుచర్ల నందు ఘనంగా నిర్వహించారు. వాసవి మాతకు ప్రత్యేక అభిషేకాలు కుంకుమ పూజ గోపూజ నిర్వహించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. అనంతరం ప్రధాన కూడలి వద్ద చలివేంద్రంలో తవిడిశెట్టి రామ నరసయ్య అయిత ముత్తయ్యల జ్ఞాపకార్థం అయిత శంభులింగం ఉదయలక్ష్మి కృష్ణ సుమంతు ముక్క ప్రదీప్ జ్యోతిర్మాయిలు పులిహోర మంచినీరు మజ్జిగ పంపిణీ చేశారు. వాసవి క్లబ్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, డిస్ట్రిక్ట్ పిఆర్ఓ అరుణకుమారి, జిల్లా ఆరోగ్య శిబిరాల ఇన్‌చార్జి రాచకొండ శ్రీనివాసరావు, పండుగలు సాంప్రదాయాల జిల్లా ఇన్ చార్జి వీరవల్లి శ్రీలత, జిల్లా వాసవి మాత పారాయణం ఇన్ చార్జి కందిబండ వాసంతి, డిస్ట్రిక్ట్ చైర్మన్ కొత్త లక్షణ్, జోన్ చైర్మన్ గెల్లి లక్ష్మీనరసింహారావు, వాసవి క్లబ్ అధ్యక్షుడు అయిత కృష్ణ సుమంత్, ప్రధాన కార్యదర్శి గారిణె వాసు, ట్రెజరర్ చెరుకు రాము వనిత క్లబ్ అధ్యక్షురాలు గరిణె జ్యోతి, ప్రధాన కార్యదర్శి చెరుకు కవిత ట్రెజరర్ రేపాల ఊర్మిళ, కందిబండ నర్మద, దేవరశెట్టి జ్యోతి తడక మల్ల స్వామి మా శెట్టి సైదయ్య, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, ఊటుకూరి నటరాజ్, కట్టమూరి మధు, పాల్వాయి గోపాలకృష్ణ, అనంతల సత్యనారాయణ పాల్గొన్నారు.

దేశ ప్రజల అభ్యున్నతికి సైనిక చర్య తప్పదు

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హుస్నాబాద్ : దేశ ప్రజల అభ్యున్నతికి ఉగ్రవాదులపై సైనిక చర్య తప్పదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేసి, ఆపరేషన్ సింధూర్‌పై సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా 1237 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరయ్యాయని అందులో 443 మాత్రమే లబ్ధిదారులకు ఇచ్చి 227 నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ప్రజా పాలనలో ఒక ఏడాదిలోని నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇల్లు ఇచ్చామని ప్రతి ఏడాది ఇదే తంతు కొనసాగిస్తామని ఆయన చెప్పారు. రెండు నెలల్లో రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ జరుగుతోందని ప్రతి పేదోడికి సంక్షేమ పథకాలు అందేలా పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మొదటి దశలో ఇంద్రమ్మ రెండో దశలో కచ్చితంగా వస్తుందని, అర్హులైన లబ్ధిదారులకు సన్న బియ్యం, సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా కొత్తగా 47 వేల మందికి రేషన్ బియ్యం అందుతుందన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో పహల్గాం టూరిస్ట్‌లపై పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం హర్షణీయమన్నారు. రాజకీయాలకతీతంగా దేశ ప్రజల అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అన్ని పార్టీల నాయకులు మద్దతు తెలుపడం సంతోషకరమని చెప్పారు. ఇకముందు కూడా ఉగ్రవాద చర్యలకు బుద్ధి చెప్పే విధంగా సైనిక చర్యలు ఉండాలనే ప్రజలు కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. జైహింద్ నినాదాలతో సైనిక విజయానికి సంబరాలు జరుపుకొని సైనికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మల, తహసిల్దార్లు, పలు శాఖలు ఉన్నతాధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతిలో సాదా బైనమా, పిఓటి సమస్యల పరిష్కారం: కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంలో సాదా బైనమా, పిఓటి వంటి సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కల్పించిందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. భూములకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే రాష్ట్రప్రభుత్వం పైలెట్ మండలం నకిరేకల్ గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులు ఇవ్వాలని ఆమె చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గత నెల భూ భారతి చట్టంపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో అవగాహన సదస్సులను నిర్వహించిన విషయం తెలిసిందే. భూముల సమస్యలపై గతంలో నిర్వహించిన 4 పైలెట్ మండలాలు మినహాయించి ప్రస్తుతం 28 జిల్లాలలో ఒక పైలెట్ మండలాన్ని ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులను నిర్వహించాలని ఆదేశించడం జరిగింది. ఇందులో భాగంగా ఈ నెల 5 నుండి తిరిగి జిల్లాకు ఒక పైలట్ మండలంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించి అక్కడి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు గ్రామాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం నకిరేకల్ మండలం చందనపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ముందుగా మండల తహసిల్దార్ జమీర్ మాట్లాడుతూ గ్రామంలో అప్పటివరకు 46 దరఖాస్తులు వచ్చాయని చెప్పగా, ఎలాంటి కేసులు వచ్చాయని జిల్లా కలెక్టర్ అడిగారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తర్వాత అసైన్మెంట్ భూములకు ఎలాంటి పట్టాలు ఇవ్వలేదని, 2017 కు ముందు ఏదైనా లావాదేవీలు జరిగినట్లయితే అలాంటి వాటికి దరఖాస్తులు సమర్పిస్తే పరిశీలించడం జరుగుతుందని, రైతు తప్పనిసరిగా మొఖా మీద ఉండి సరైన ఆధారాలు ఉండాలని తెలిపారు. నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి రెవెన్యూ సదస్సులకు హాజరయ్యారు.

కమిషనర్‌కు సార్వత్రిక సమ్మె నోటీసు అందజేత

విశాలాంధ్ర - తొర్రూర్: కేంద్రంలోని మోడీ సర్కార్ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని కేంద్ర కార్మిక సంఘాలు మే 20న జరుప తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. బుధవారం తొర్రూర్ లోని ఐరన్ హార్డ్వేర్ షాపుల యజమానులకు కార్మికులతో కలిసి సమ్మె నోటీస్ ను అనుమాన్ల మోహన్ రెడ్డి, తొర్రూర్ మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్‌కు సార్వత్రిక సమ్మె నోటీస్‌ను బుధవారం అందజేశారు. 45 కోట్ల మంది కార్మిక వర్గం హక్కులను హరిస్తూ కార్పొరేట్ బౌల జాతి కంపెనీల లాభాల కోసం నూతన లేబర్ కోడ్ తీసుకొచ్చారని ఆరోపించారు. టియుసిఐ మహబూబాబాద్ జిల్లా నాయకులు పాడిన బీకు, గుండాల సోమ నరసయ్య, మాచర్ల మురళి ప్రగతిశీల రిక్షా ఎగుమతి హమాలి కార్మిక సంఘం అధ్యక్షులు వల్లకొండ లక్ష్మయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మంగళపల్లి రామస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు అరవపల్లి వెంకన్న, జిల్లా అధ్యక్షులు ఏర్పుల మహేందర్, ఉపాధ్యక్షులు చెడిపల్లి యాకయ్య కార్యవర్గ సభ్యులు రాములు చంద్రు వెంకన్న సాయిలు మల్లయ్య యాకయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి,సింగరేణి: ప్రాణ రక్షణ కోసం ద్విచక్రవాహన దారులు ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. బుధవారం గోదావరిఖని నగరంలో రోడ్డు భద్రతపై అవగాహన పెంచడంలో భాగంగా, ట్రాఫిక్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్మెట్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దివచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాల నుండి మన ప్రాణాలను కాపాడుకోవడంలో హెల్మెట్ ముఖ్యపాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రభుత్వంగా, పోలీస్ విభాగంగా ప్రజలకు అవగాహన కల్పించడం బాధ్యత మాత్రమే కాదు, మానవీయ విధి కూడా అని అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డిపార్టుమెంట్ అధికారి జ్యోతి, ఎస్బిఐ రీజినల్ మేనేజర్, డిసిపి అడ్మిన్ రాజు, ఏసిపి మడత రమేష్ ట్రాఫిక్ ఏసిపి జానీ నరసిమ్ములు, ట్రాఫిక్ సిఐ రాజేశ్వరరావు ట్రాఫిక్ ఎస్ఐ హరి శేఖం, సంతోష్ కుమార్, రామరాజు, సంబంధిత సిబ్బంది అధికారులు నగర పోలీస్ కమిషనర్, మున్సిపల్ అధికారులు, స్థానిక కార్పొరేటర్లు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, మోటార్ బైక్ యూనియన్ సభ్యులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

దేశంలో నెలకొన్న యుద్ధ వాతావరణం

విశాలాంధ్ర - ఖమ్మం : పహల్గాం దాడి తర్వాత దేశంలో యుద్ధ వాతావరణం నెలకొందని సరిహద్దుల్లో ఉద్రిక్తత చోటు చేసుకుంటుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న దానిని తుద ముట్టించాల్సిం దేనని ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం బెజవాడ రవి అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్లో జరిగింది. సమావేశా నికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ మోడీ ఆలోచనలో ఎటువంటి మార్పు లేదని ప్రజల గురించి కాకుండా సంపన్న వర్గాల గురించి మాత్రమే ఆలోచిస్తున్నారన్నారు. ముఖ్యంగా వ్యవసాయ కార్మికులకు సంబంధించి పని దినాలు తగ్గించడం, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. దేశంలో నెలకొన్న ఉద్రిక్తతను మత ఉన్మాదులు అవకాశంగా తీసుకోకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం జరుగుతుండడంతో ప్రభుత్వం పట్ల విశ్వసనీయత సన్నగిల్లుతుందని హేమంతరావు తెలిపారు. రైతు ప్రభుత్వంగా చెప్పుకునే రైతు రుణమాఫీ, రైతు భరోసా విషయంలో ప్రభుత్వం లక్ష్యం దిశగా పని చేయలేదన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే కేవలం 40 శాతం మాత్రమే రుణమాఫీ పూర్తయినట్లు తెలుస్తుందని హేమంతరావు అన్నారు. ముగింపు సభకు ముందు మండల, జిల్లా, రాష్ట్ర జాతీయ మహాసభలు జరగనున్నాయని నిర్ణీత తేదీల్లో ఖమ్మంజిల్లాలోని అన్ని మండల మహాసభలను పూర్తి చేయాలని హేమంతరావు స్పష్టం చేశారు. కార్యక్రమాల నివేదికను జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ప్రవేశపెట్టగా మహాసభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ - మౌలానా తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలే ఇంటికి వెలుగు

విశాలాంధ్ర - కారేపల్లి : ఆడపిల్లలే ఇంటికి వెలుగునిస్తారని నేటి సమాజంలో అన్ని రంగాలలోనూ అమ్మాయిలు ముందుంటున్నారని మండల ప్రత్యేకాధి కారి నవీన్ బాబు అన్నారు. మా ఇంటి మణిదీపం పథకంలో భాగంగా మండల పరిధిలోని రావోజీతండాకు చెందిన దంపతులకు ఆడ కూతురు జన్మించడంతో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఆడపిల్లలు చూపించే ప్రేమ మగపిల్లలు చూపించరని స్పష్టం చేశారు. చదువులోనూ అమ్మాయిలే రాణిస్తున్నారని ప్రశంసించారు. తల్లిదండ్రులు ఆడపిల్లను అదృష్టంగా భావిస్తూ, సమానంగా చూస్తూ కష్టపడి బాగా చదివించాలని కోరారు. సమానంగా ఆస్తిలో వాటా ఇవ్వాలని సూచించారు. మండల తహసీల్దార్ సంపత్ కుమార్, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఈ రవీందర్ ప్రసాద్, ఐసిడిఎస్ సూపర్వైజర్ దేవేంద్ర, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : జిల్లాలో త్రాగునీటి సమస్య లేకుండా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండల పరిషత్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో త్రాగునీటిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, చేతిపంపులు చెడిపోయినట్లయితే అదే రోజున మరమ్మతులు చేపట్టి ప్రజలకు నీటిని అందించాలని బోరు బావులు, పైపు లైన్ల లీకేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, గ్రామాలలో త్రాగునీటి వనరులను పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి అవసరమైన ప్రణాళిక రూపొందించుకోవాలని, మండలంలోని 28 గ్రామాలలో త్రాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా లబ్ధిదారుల జాబితా పారదర్శకంగా రూపొందించాలని, అర్హుల పేర్లు మాత్రమే జాబితాలో ఉండాలని, అనర్హుల పేర్లు ఉన్నట్లయితే సంబంధిత కార్యదర్శి, పరిశీలన చేసిన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లో కేంద్రాలు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఉండాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కుంటాల మండలం అందకూర్ గ్రామంలోని పిఏసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో టెంట్, త్రాగునీరు తదితర వసతులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వాహకుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్... కొనుగోలు ప్రక్రియలో అలసత్వం కారణంగా రెండు లక్షల రూపాయల జరిమానా విధించారు. సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని తక్షణమే తూకం వేసి తరలించాలన్నారు. తేమ శాతం నిబంధనల మేరకే కొనుగోలు చేయాలని సూచించారు. తగినన్ని గన్ని సంచులు, టార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అన్ని రిజిస్టర్లను పరిశీలించిన అనంతరం ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : నియోజకవర్గంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిస్కారం చేపెట్టాలనే లక్ష్యంతో స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు చేసిన కృషి ఫలించింది. కూనంనేని ప్రతిపాదన మేరకు నియోజకవర్గంలో నీటి సమస్య పరిస్కారంకోసం డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ఫండ్ (డిఎంఎఫ్టి) ద్వారా రూ. 8.92 కోట్లు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నిధులతో ట్యాంకులు, పంపు హౌజులు, సంపులు, నూతన పైపు లైన్లు, పైపులైన్ల మరమ్మత్తులు, బోర్లు ఏర్పాటు చేయనున్నారు. కోయగూడెం, సోలెంగుంపు, శేషయ్య గుంపు, ఉప్పరిగూడెం, నర్సింహసాగర్, నారంగ్ తండా, నిమ్మలగూడెం, సింగభూపాలెం, పెనుబల్లి, సాటివారిగూడెం, కరిగేట్టు, సరెకల్లు గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్య పరిస్కారంకోసం రూ.2.92కోట్లు మంజూరై య్యాయి. చుంచుపల్లి మండలానికి రూ.1.70కోట్లు, సుజాతనగర్ మండలానికి రూ.1.40కోట్లు, లక్ష్మీదేవిపల్లి మండలానికి రూ.1.53కోట్లు, పాల్వంచ మండలానికి రూ.1.37కోట్లు మంజూరు కాగా ఈ నిధులతో 71 పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని బుధవారం విశాలాంధ్రతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిస్కారం చూపేందుకు కొన్ని నెలలుగా కృషి చేస్తున్నానని తెలిపారు. డిఎంఎఫ్టి ద్వారా మంజూరైన రూ.8.92కోట్ల విలువచేసే పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేస్తామని భాషాభావం వ్యక్తం చేశారు. జాప్యం జరక్కుండా ప్రజలకు నీటిని అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్య పరిస్కారంకోసం కృషి జరుగుతోందని తెలిపారు. ఈ వేసవిలో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అవసరమైతే ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేపట్టి ప్రజల కస్టాలు తీర్చాలని మున్సిపల్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మంజూరైన నిధులతో పనులు పూర్తి అయితే నియోజకవర్గంలో నీటి సమస్య ఉండదన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగులు, లోన్ యాప్‌లతో మోసపోవద్దు : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : సులభంగా డబ్బు వస్తుందని ఆన్లైన్ బెట్టింగులు, గేములు, లోన్ యాప్ లు డౌన్ లోడ్ చేసుకొని మోసపోవద్దని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు కోరారు. స్టాక్ మార్కెట్ ట్రేడింగులకు అలవాటు పడి, సంపాదనంతా పోయి ఎంతోమంది అప్పుల పాలై ఆత్మహత్యలకు గురవుతున్నారని ఎస్పీ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఒకసారి కొంత మొత్తంలో డబ్బు రాగానే ఆన్లైన్ బెట్టింగ్, రమ్మీ వంటి ఆటలతో మంచి ఆదాయ మార్గమని యువత భావిస్తున్నారని ఆయన తెలిపారు. ఇలాంటి మోసలకు యువత మాత్రమే కాకుండా రిటైర్ ఉద్యోగులు, పెద్దవాళ్లు కూడా వీటి బారినపడి అప్పుల ఊబిలో కూరుకుపోయి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఆన్లైన్ గేములు ముందుగానే ప్రోగ్రామింగ్ చేసి ఉంటాయనే విషయాన్ని గ్రహించలేక అనేక మంది మోసపోయి తమ డబ్బులను పోగొట్టుకుంటున్నారన్నారు. అదేవిధంగా కొందరు అవసరం ఉన్నా, లేకున్నా నిమిషాల్లోనే లోన్లు ఇస్తామంటూ వస్తున్న ఆన్లైన్ లోన్ యాప్‌ల బారిన పడి మోసపోతున్నారన్నారు. వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని అన్నారు. ఎవరైనా బెట్టింగులు పెడుతున్నట్టు తెలిస్తే తమకు సమాచార ఇవ్వాలని కోరారు.

మావోయిస్టులతో చర్చలు జరపండి...

విశాలాంధ్ర - గార్ల : కర్రెగుట్టలో ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయ్యాలని, ప్రజాసామిక హక్కుల కోసం పోరాడుతున్న మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపి శాంతిని నెలకొల్పాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్ చేశారు. మావోయిస్టుల పేర ఛత్తీస్గఢ్‌లో ఆదివాసీల మానవ హననాన్ని ఆపాలన్నారు. కర్రెగుట్టలో ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం గార్ల మండల కేంద్రంలోని స్థానిక సిపిఎం కార్యాలయంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌని ఐలయ్య ప్రసంగిస్తూ మధ్య భారతంలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే బీజేపీ, నరేంద్రమోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, ఆదివాసులపై విచక్షణ కోల్పోయి హత్యాకాండను కొనసాగిస్తుందని ఆరోపించారు. ఈ దేశ పౌరులైన ఆదివాసులు, మావోయిస్టులపై సైనిక బలగాలతో శత్రు దేశంతో చేసినట్లు యుద్ధం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈనెల 9న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. న్యాయవాది విశ్వ జంపాల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలువాల సత్యవతి, సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, టిఆర్ఎస్ మండల కార్యదర్శి పానుగంటి రాధాకృష్ణ, న్యూడెమోక్రసీ నాయకులు మాలోత్ మాన్య, గౌని భద్రయ్య, ఇర్రి రవి, మట్టపల్లి వీరభద్రం, వంగూరి పెద్ద వెంకటేశ్వర్లు, గణేష్, నాగేంద్ర పవన్ కుమార్ పాల్గొన్నారు.

వలస ఆదివాసీలకు ఎస్టీ కుల సర్టిఫికెట్ ఇవ్వాలి : సాబీర్‌పాషా

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : రెండు దశాబ్దాలకు పైగా పెనగడప అటవీ ప్రాంతాల్లో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న ఆదివాసీలకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా ప్రభుత్వాన్ని కోరారు. చుంచుపల్లి మండలం పెనగడప గ్రామపంచాయతీ పరిధిలోగల పాలవాగు, జగ్గారం, మర్రిగూడెం, గడ్డిగుట్ట ఆదివాసీ గ్రామాల ప్రజలతో బుధవారం శేషగిరిభవన్ లో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సాబీర్ పాషా వలస ఆదివాసీల సమస్యలను సమీక్షించి మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి అని భార్య కారణాలవల్ల దశాబ్దాల క్రితం గిరిజన ఆదివాసీలు ఈ మన జిల్లాలోని అనేక అటవీ ప్రాంతాల్లో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని కుటుంబాలతో జీవిస్తున్నారని తెలిపారు. వీరికి రెవిన్యూ శాఖా ద్వారా కుల, ఇతర ధ్రువీకరణ పత్రాలు జారిచేయండంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. జిల్లాలో 150కి పైగా ఆదివాసీ గూడేలు ఉన్నాయని తెలిపారు. సిపిఐ నాయకులు నీడాల సుధాకర్, కట్టా ఉదయ్, మన్నే వీరభద్రరావు, లక్ష్మణరావు, మన్నే మనోజ్ కుమార్, ఆదివాసీలు ముడివి భీమా, ముడివి చుక్కయ్య, చోడేమ్ భీమా, బాలరాజు, కొమరం భీమా, పద్దం నంద, పొడెం చందు పాల్గొన్నారు.

సమిష్టిగా ఉంటేనే గ్రామాల అభివృద్ధి సాధ్యం : సాబీర్ పాషా

విశాలాంధ్ర - కొత్తగూడెం : గ్రామీణ ప్రజలు రాజకీయాలకు అతీతంగా సమిష్టిగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. చుంచుపల్లి మండల పరిధిలోని పెనుబల్లి గ్రామాన్ని సిపిఐ ప్రతినిధి బృందం బుధవారం సందర్శించింది. గ్రామంలో అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో సాబీర్ మాట్లాడారు. పెనుబల్లి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన రహదారి సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పెనుబల్లి బ్రిడ్జి పునర్నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో రూ.32 లక్షల వ్యయంతో అంతర్గత రహదారులు, డ్రైన్లు నిర్మించడం జరిగిందన్నారు. నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, కిలారు ప్రసాద్, భవాని, ఇనుములా నర్సింహా రావు, భాస్కర్, కిరణ్, శరభ చారి, శ్రీను, మురళి, పశయ్య పాల్గొన్నారు.

సంపాదకీయం

ఆపరేషన్ సిందూర్

పహల్గాం ఘాతుకానికి ప్రతిగా మన దేశం మంగళవారం అర్ధ రాత్రి పాకిస్థాన్ మీద దాడులు ప్రారంభించింది. ఇవి దాడులే తప్ప సంపూర్ణమైన యుద్ధ ప్రకటన కాదు. పాకిస్థాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద శిక్షణా శిబిరాల మీద మన దేశం దాడులు చేసింది. ఈ దాడుల్లో కనీసం 90 మంది మరణించారని అంటున్నారు. యుద్ధానికి దిగకుండా దాడులకు పరిమితం కావడంతో భారత్ తన పరిపక్వతను ప్రదర్శించింది. ఈ దాడులు ప్రారంభించినప్పుడు విదేశాంగ కార్యదర్శి విక్రం మిశ్రీ విలేకరుల సమావేశంలో మాట్లాడిన తీరులో కూడా సంపూర్ణమైన పరిపక్వత కనిపించింది.

భారత్-పాక్ ఘర్షణలను ముస్లింల మీద విద్వేషంతో చూసే వారికి యుద్ధం కాకుండా కేవలం దాడులకు పరిమితం కావడం నిరాశ మిగిల్చి ఉండవచ్చు. కానీ గోదీ మీడియా చానళ్లలో యాంకర్ల భాషలో మాత్రం ఆక్రోశం కనిపిస్తోంది. తీవ్రవాద సంఘటన జరిగినప్పుడల్లా దృఢంగా వ్యవహరిస్తుందనీ ఇతర దేశాలు ఏమనుకుంటున్నాయో అన్న అంశాన్ని పట్టించుకోబోమని భారత్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో గోదీ మీడియాకు పత్రికా రచన నియమాలతో ఏ మాత్రం సంబంధం లేదని, పత్రికా రచనలో ప్రమాణాలు పాటించాలన్న చింత ఇసుమంత కూడా లేదని రుజువవుతోంది. ఈ దాడుల గురించి ప్రభుత్వ వైఖరికి, గోదీ మీడియా ఉన్మాదానికి మధ్య అంతరాన్ని స్పష్టంగా గమనించవచ్చు. గోదీ మీడియా యాంకర్లలో వీరరసం పొంగి పొర్లింది. భారత్‌లో పాక్ ప్రేరేపిత తీవ్రవాదుల ఆట కట్టించడానికి, తీవ్రవాదుల ఆగడాలను అరికట్టడానికి పరిమితం అవుతుందని విదేశాంగ కార్యదర్శి విక్రం మిశ్రీ చాలా శాంత స్వరంలో ప్రకటించారు. పహల్గాం ఘాతుకంపై ఐక్య రాజ్యసమితి భద్రతా మండలి విడుదల చేసిన ప్రకటనలోనూ తీవ్రవాద ఘాతుకాలకు సమాధానం చెప్పే హక్కు భారత్‌కు ఉందని తెలియజేసింది. సంయమం పాటించాలని రెండు పక్షాలకు విజ్ఞప్తి చేసింది. మరో వేపు గోదీ మీడియా పత్రికా రచన ధర్మాన్ని వదిలేసి మత ఆధారిత పత్రికా రచనకు పాల్పడుతోంది. సైన్యం తరఫున ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కల్నల్ సోఫియా ఖురేశీ, వైమానిక దళ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ కూడా విలేకరుల సమావేశంలో మాట్లాడినప్పుడు ఎక్కడా ఆక్రోశం కనిపించలేదు. ఈ ఇద్దరు మహిళా అధికారులకు విలేకరులకు వివరాలు చెప్పే బాధ్యత అప్పగించడంలో నిర్దిష్ట ఉద్దేశం ఉన్నట్టు కనిపిస్తోంది. పహల్గాంలో తీవ్రవాదులు ఘాతుకానికి పాల్పడినప్పుడు మహిళలు, పిల్లల జోలికి రాలేదు. కానీ దాడికి బలైన వారు తమ భర్తలను ఆప్తులను కోల్పోయారు. పాకిస్థాన్ మీద చేస్తున్న పరిమిత దాడులకు కేంద్ర ప్రభుత్వం "ఆపరేషన్ సిందూర్" అని పేరు పెట్టడంలో కూడా ఆప్తులను కోల్పోయిన మహిళల దృష్టి నుంచి మాట్లాడే విధానం ప్రత్యేకంగా కనిపించింది. రక్షణ దళాలకు చెందిన ఇద్దరు ప్రతినిధులు కూడా పాక్ మీద చేస్తున్న దాడులను మతం దృష్టితో చూడకూడదని చెప్పడానికి సైతం ప్రత్యేకత ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి రణనీతిని అనుసరించడం ప్రశంసనీయమైంది. పహల్గాం దాడికి మతం రంగు పులమడానికి జరిగిన ప్రయత్నాలను వమ్ము చేయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం మెచ్చదగిన పరిణామం. కశ్మీర్‌లోనూ, జమ్మూలోనూ 370వ అధికరణం రద్దు తరవాత కూడా జరిగిన ఆగడాలను నిరోధించడంలో మోదీ ప్రభుత్వం విఫలం అయిన మాట నిజమే అయినా పాకిస్థాన్ మీద దాడులు ప్రారంభించిన సమయంలో మాత్రం చాలా నిగ్రహం పాటించడం గమనార్హం. పహల్గాం ఘాతుకం తరవాత కశ్మీరీ ప్రజలు ఈ దుశ్చర్యలను ముక్త కంఠంతో ఖండించారు. దేశంలోని మిగతా ప్రాంతాలలో కొంత మేరకు వ్యక్తం అయిన యుద్ధోన్మాదం కశ్మీర్‌లో కలికానిక్కూడా కనిపించకపోవడం సానుకూల పరిణామం. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వ తీసుకోనున్న చర్యలకు మార్గ దర్శకం. పహల్గాం ఘాతుకం ఆధారంగా మత కలహాలు రేకెత్తించాలని చేసిన ప్రయత్నాలు వమ్ము అయినాయి. ఇది నిజంగా భారతీయులను అభినందించవలసిన సమయం. మతపరమైన దృష్టితో కాకుండా ఘాతుకానికి బాధ్యులైన వారిని శిక్షించడమే ఈ దాడుల లక్ష్యం అన్న వాస్తవాన్ని విస్మరించకూడదు. పహల్గాంలో తీవ్రవాదులు మతం ఏమిటో కనుక్కుని మరీ హిందువులను కాల్చి చంపినందువల్ల ఈ దురంతానికి మతం రంగు పులమడం సులభం అనుకున్న వారి ప్రయత్నం నిర్ణయాత్మకమైన రీతిలో వమ్ము అయింది. పాకిస్థాన్ కశ్మీర్‌లో తీవ్రవాదులను రెచ్చగొట్టడం, రహస్యంగా తమ దేశంలో సుశిక్షితులైన తీవ్రవాదులను సరిహద్దు దాటించి మన దేశంలోకి పంపించడం కొత్త కాదు. పహల్గాంలో దాడి చేసిన వారు ఇలా సరిహద్దు దాటి వచ్చిన తీవ్రవాదులు అయి ఉండవచ్చు. కానీ తీవ్రవాదులకు మతంతో నిమిత్తం లేదు. పాక్ పెంచి పోషించిన తీవ్రవాదులు తమ దేశంలోనే మారణకాండకు పాల్పడిన సంఘటనలు కొల్లలుగా ఉన్నాయి. తీవ్రవాదులకు పాకిస్థాన్ నిలయం అయి ఉండవచ్చు. దశాబ్దాలుగా కశ్మీర్‌లో తీవ్రవాదానికి బలైన వారందరూ తీవ్రవాదులు కారు. ఇదే తీవ్రవాదులకు మత పట్టింపు ఉండదని నిరూపిస్తోంది.

పహల్గాంలో ఘాతుకానికి పాల్పడ్డ వారిని గుర్తించారట. అయితే వీరి పేర్లు, జాతి మొదలైన వాటిని సకారణంగానే కేంద్ర ప్రభుత్వం వెల్లడించలేదు. భవిష్యత్తులో కూడా మన దేశంలో తీవ్రవాద దాడులు జరిగే అవకాశం ఉన్నందువల్ల తీవ్రవాదులకు, వారిని ప్రోత్సహిస్తున్న వారిని శిక్షించడానికి భారత్ నిర్దిష్ట స్థలాలపై దాడులు చేసింది. దాడికి పాల్పడ్డ వారెవరో ఇక ముందు బహిర్గతం కావొచ్చు. భారత్ పాకిస్థాన్ సైనిక స్థావరాల మిద సైనికుల మీద దాడి చేయకపోవడం చూస్తే ఇప్పుడు జరుగుతున్నవి కేవలం దాడులే తప్ప యుద్ధ ప్రకటన కాదని తేలిపోతోంది. కానీ గోదీ మీడియా మన సేనలు పాకిస్థాన్‌లో చొరబడి దాడి చేశాయని, పాకిస్థాన్ మీద దాడి చేశాయని దురుద్దేశ పూరితంగానే దుష్ప్రచారానికి దిగాయి. ప్రభుత్వం అత్యంత సంయమంతో ప్రవర్తిస్తున్నా గోదీ మీడియా బాధ్యతారహితంగా అత్యుత్సాహం ప్రదర్శిస్తూ తీవ్ర అపకారం తలపెడ్తోంది. అధికారికంగా ప్రభుత్వం ఏం చెప్పింది, ఏం చెప్పలేదు, ప్రభుత్వ భాష ఎలా ఉంది. పౌరుల వ్యక్తీకరణ ఎలా ఉంది, రాజకీయ పార్టీల, ప్రతిపక్షాల భాష ఎలా ఉంది, గోదీ మీడియా ప్రేలాపనలు ఎలా ఉన్నాయి అని తప్పని సరిగా గమనించవలసిందే. భారత ప్రభుత్వం చేస్తున్న దాడులలో పౌరులు కనీసం గాయపడ్డ, లేదా మరణించిన దాఖలాలే లేవు. అంటే ఇది పాక్ పౌరుల మీద దాడి కాదు. భారత్ చేసిన దాడిలో కచ్చితంగా ఎంత మంది మరణించారో అధికారిక సమాచారం అయితే లేదు. కానీ ఎ.బి.పి. న్యూస్ చానల్ మృతుల సంఖ్య 900 అని చెప్పి తన అత్యుత్సాహం ప్రదర్శించింది. ఇండియా టుడే 90 మంది మరణించారంటోంది. రిపబ్లిక్ టీవీ సహజంగానే లష్కరే తోయిబా అగ్ర నాయకులు ఈ దాడిలో హతమయ్యారని చెప్తోంది. దాడిలో మృతుల సంఖ్య మీద ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో జరిగిన తీవ్రవాద దాడుల్లో ఊహాగానాల వల్ల దేశ భద్రతకు అపారమైన నష్టం కలిగినా గోదీ మీడియా కట్టుకథలే ప్రచారం చేస్తోంది.

'ఉపాధి హామీ'ని కాపాడండి

బి కేశవరెడ్డి

పనులులేని కాలంలో గ్రామీణ పేదలకు వారి సొంత గ్రామాలలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని దుర్వినియోగం కాకుండా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అనంతపురం జిల్లా నార్పల మండలం బండ్లపల్లి గ్రామం నుంచి అనంతపురం కృష్ణ కళామందిరం వరకు 2025 ఏప్రిల్ 21,22 తేదీలలో రెండు రోజులపాటు పాదయాత్రను దిగ్విజయంగా కూలీలు, శ్రామికులు నిర్వహించారు. ఎర్రటిఎండను లెక్క చేయకుండా 30కిలోమీటర్ల దూరం పాదయాత్రను చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకత్వంలో ఈ పాదయాత్ర జరగింది. సంవత్సరానికి 200పనిదినాలు కల్పించాలని రోజు కూలీ రూ.700 ఇవ్వాలని, ఏడాదికి ఉపాధి కూలీకి 12వేల రూపాయలు భృతిని కల్పించాలని, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకంలో తమ వాటాను బడ్జెట్‌లో



కేటాయించాలని, మెటీరియల్ కంపోనెంట్ నిధులు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, కాంట్రాక్టర్ల ద్వారా పనులు చేయించరాదని, మెడికల్ కిట్లు, మజ్జిగ, తాగునీరు అందించాలని, చట్టంలో చేర్చిన 86 రకాలు పనులు కింద రైతుల పొలాల్లోనే ఉపాధి కూలీలతో పనులు చేయించాలని తదితర డిమాండ్లతో పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్ర ప్రారంభం రోజు ఏప్రిల్ 21న బండ్లపల్లి గ్రామంలో గొప్ప బహిరంగ సభ జరిగింది. ఈ చట్టాన్ని మొట్టమొదటిసారిగా ఆంధ్ర ప్రదేశ్‌లోని కరువు ప్రాంతమైన రాయలసీమ అందులో అత్యంత కరువు తాండవించే అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఆనాటి యూపీఏ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ, అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ఎంతో అట్టహాసంగా ప్రారంభించారు.

పాదయాత్ర ప్రారంభ సభలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర అధ్యక్షులు సి హెచ్ కోటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రావ్, సీపీఎం అనంతపురం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీశ్, అనంతపురం, పుట్టపర్తి జిల్లాల కార్యదర్శులు సీ జాఫర్, ఎం వేమయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ చైర్మన్ దాదా గాంధీ, ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు వై ఎల్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సభ అనంతరం ఈ పాదయాత్ర కార్యక్రమాన్ని జల్లి విల్సన్ సంఘం జెండాను ఊపి ప్రారంభించారు. డప్పు వాయిద్యాలు, కళాకారుల ఆట, పాటలతో ఎంతో ఉల్లాసంగా, సంఘం రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆయా జిల్లాల నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ బీకేఎంయూ జెండాలు, బ్యానర్లు,ప్లే కార్డులు చేతబట్టి పెద్ద పెట్టున నినాదాలతో కూలిదండు ఎర్రని ఎండలో ముందుకు సాగింది. మార్గమధ్యమంలో ఉన్న ప్రతి గ్రామంలోనూ ఉపాధి కూలీలు, పేదలు,ఆ గ్రామంలోని ప్రజలు ఎదురేగి పూల వర్షం కురిపించడం ఎంతో ఆనందాన్నిచ్చింది. మజ్జిగ, మంచినీళ్ల ఏర్పాటు చేసి ఆదరించి, అండగా నిలవడం గొప్ప ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని కలిగించింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు తో పాటు వయసులో పెద్దవారైన అనేక మంది దాదాపు 15 కిలోమీటర్లు ఎక్కడా కూర్చోకుండా ఏకధాటిగా నడవడం ద్వారా మాలాంటి వారందరికి ఆదర్శప్రాయులయ్యారు. మొదటిరోజు బండ్లపల్లిలో అనంతపురం జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి పాదయాత్రలో పాల్గొన్న వారికి సదుపాయాలు ఏర్పాటు చేయడం ద్వారా కార్యక్రమాన్ని ప్రోత్సహించారు. రెండవ రోజు సిద్దరాంపురం లో బి ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్ర కార్యక్రమం కొనసాగింది. మండల పార్టీ కార్యదర్శి మర్రిస్వామి స్వాగతం పలికారు. అనంతపురం నగరంలోకి ప్రవేశించిన తర్వాత వన్‌టౌన్ లోని తాడిపత్రి బస్టాండ్ వద్దకు చేరుకోగానే గాంధీ విగ్రహం దగ్గర పార్టీ ప్రజా సంఘాల నాయకుల నేతృత్వంలో పూల వర్షంతో ఘనంగా ఆహ్వానించారు.

22 వ తేదీ సాయంత్రం అనంతపురం నగరంలోని కృష్ణ కళా మందిర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ముఖ్య వక్తలుగా ఏఐసీసీ ముఖ్య అధికార ప్రతినిధి, రాజ్యసభ మాజీ సభ్యులు తులసిరెడ్డి, జల్లి విల్సన్, సి హెచ్ కోటేశ్వరరావు,ఆవుల శేఖర్,ఆర్ వెంకట్రావు తదితరులు ప్రసంగించారు. పాదయాత్ర కార్యక్రమం జిల్లాలో చర్చనీయాంశం అయింది. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుంటామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక హెచ్చరికగా ఈ పాదయాత్ర కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం జయప్రదానికి సహకరించిన అనంతపురం జిల్లా, నగర ప్రజలకు, మేధావులకు, ఉద్యోగులకు, జిల్లా డ్వామా యంత్రాంగానికి, వివిధ పార్టీ నాయకులకు అనంతపురం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకత్వం కృతజ్ఞతలు తెలియజేస్తున్నది.2004లో యూపీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని ఏర్పాటు చేశారు. 2005లో పార్లమెంట్ ఆమోదించగా 2006లో వెనకబడిన 300 జిల్లాలలో ప్రారంభించారు. యూపీఏ ప్రభుత్వంలో భాగస్వాములైన వామపక్షాల వత్తిడిపైన ఈ పథకాన్ని తీసుకువచ్చి అమలు జరిపారు. మోదీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేస్తోంది.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం
అనంతపురం జిల్లా కార్యదర్శి

సీపీఐ జాతీయ మహాసభలకు సన్నాహాలు

భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) 25వ జాతీయ మహాసభలకు ఆతిథ్యం ఇచ్చేందుకు సీపీఐ పంజాబ్ రాష్ట్ర సమితి సన్నాహాలు ప్రారంభించింది. సీపీఐ 25వ జాతీయ మహాసభలు సెప్టెంబరు 21 నుంచి 25వ తేదీ వరకు చండీగఢ్‌లో జరగనున్నాయి. సీపీఐ శత వసంత వేడుకలు జరుపుకుంటున్న నేపథ్యంలో జరగనున్న ఈ మహాసభలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మహాసభల నిర్వహణకు ఇప్పటికే ఆహ్వానసంఘం ఏర్పడింది. మహాసభల ఏర్పాట్లకు సంబంధించిన పనులను ఆహ్వానసంఘం చకచకా చేసేస్తోంది. పంజాబ్ ట్రిబ్యూన్ మాజీ సంపాదకులు, మాజీ ఐపీఎస్, కళా, సాహిత్య, సాంస్కృతిక రంగంలో పేరెన్నికగన్న వ్యక్తి డా॥ స్వరాజ్ సింగ్ అధ్యక్షునిగా, సీపీఐ రాష్ట్ర సమితి కార్యదర్శి బంత్ సింగ్ బ్రార్ ప్రధాన కార్యదర్శిగా ఆహ్వానసంఘం ఏర్పడింది. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, వివిధ రంగాల ప్రముఖులు ఆహ్వానసంఘం సభ్యులుగా ఉన్నారు. అన్ని రాష్ట్రాల నుంచి ఎన్నికైన ప్రతినిధులు, వివిధ రంగాల నుంచి దాదాపు వెయ్యిమంది ప్రతిధులు ఐదు రోజులపాటు జరిగే ఈ మహాసభలకు హాజరుకానున్నారు.

మహాసభల ప్రారంభ సూచికంగా సెప్టెంబరు 21వ తేదీ మొదటి రోజు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై విశ్లేషణలతో వివిధ రంగాల నిష్ణాతులు రాసిన వ్యాసాలతో సర్వాంగ సుందరంగా సావనీర్‌ను తీసుకురానున్నారు. అమరవీరులను స్మరిస్తూ, వారి కుటుంబాలను గౌరవిస్తూ జాతాలు నిర్వహించనున్నారు.

మహాసభల లోగో ఆవిష్కరణ

మహాసభ ఏర్పాట్లపై చర్చించేందుకు ఏప్రిల్ మాసాంతంలో లూధియానాలో జరిగిన సీపీఐ పంజాబ్ రాష్ట్ర సమితి సమావేశంలో సీపీఐ జాతీయ మహాసభల లోగోను ఆవిష్కరించారు. స్వాతంత్ర్యోద్యమంలో కీలక ఘట్టమైన జలియన్ వాలాబాగ్ అమరుల స్థూపం, దానికి రెండు పక్కలా వ్యవసాయ రాష్ట్రమైన పంజాబ్‌కు చిహ్నంగా గోధుమ కంకులు, వెనుక ఎర్రజెండా ఈ లోగోలో చోటుచేసుకున్నాయి. సమితి సమావేశాల అనంతరం జరిగిన మీడియా సమావేశంలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి వర్గ సభ్యులు అమర్‌జిత్ కౌర్, పంజాబ్ రాష్ట్ర కార్యదర్శి బంత్ సింగ్ బ్రార్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర ధరలు, పేదరికం, అసమానతలు, నిరుద్యోగం, విద్య, వైద్యం ఖర్చు పెరుగుదల వంటి సమస్యలతోపాటు వ్యవసాయ సంక్షోభం తదితర కీలకాంశాలపై జాతీయ మహాసభలో చర్చిస్తామన్నారు. వీటితో పాటు పెరుగుతున్న విద్వేషాలు, అశాంతి, రాజ్యాంగంపై దాడి వంటి అంశాలపై కూడా చర్చ జరుగుతుందని తెలిపారు. సీపీఐ జాతీయ మహాసభ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు.

లోగో ఆవిష్కరిస్తున్న రాజా, అమర్‌జిత్‌కౌర్, పంజాబ్ రాష్ట్ర నాయకులు

పెరుగుతున్న పేదరికం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, విద్య, ఆరోగ్యం, ప్రాథమిక సౌకర్యాల ఖర్చులు పెరగడం, పెరిగిన అసమానతలు, పెరుగుతున్న నిరుద్యోగం కూడా మన ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్లుగా రాజా పేర్కొన్నారు. వ్యవసాయ సంక్షోభం మరింత తీవ్రతరం అవుతోందనీ, ఇది వలసలకు, భవిష్యత్‌పై మరింత అనిశ్చితికి దారితీస్తుందని రాజా హెచ్చరించారు.

ఏప్రిల్ 23 నుంచి 25వరకు తిరువనంతపురంలో జరిగిన సీపీఐ జాతీయ సమితి సమావేశాల చర్చలు, నిర్ణయాలను వెల్లడించారు. రాజ్యాంగంలోని ప్రధాన విలువలకు పూర్తిగా విరుద్ధమైన విద్వేషపూరిత, విభజన రాజకీయాల వల్ల శాంతి, సామరస్యానికి కలిగే ప్రమాదాలను వివరించారు. పాలక వర్గంలోని శక్తివంతమైన వ్యక్తులు ఇటువంటి సమూహాలు, శక్తులకు ఆశ్రయం కల్పించడం మన ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రముప్పు కలిగిస్తోందన్నారు. మరోవైపు పెరుగుతున్న పేదరికం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, విద్య, ఆరోగ్యం, ప్రాథమిక సౌకర్యాల ఖర్చులు పెరగడం, పెరిగిన అసమానతలు, పెరుగుతున్న నిరుద్యోగం కూడా మన ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్లుగా రాజా పేర్కొన్నారు. వ్యవసాయ సంక్షోభం మరింత తీవ్రతరం అవుతోందనీ, ఇది వలసలకు, భవిష్యత్‌పై మరింత అనిశ్చితికి దారితీస్తుందని రాజా హెచ్చరించారు. ఈ సమస్యలన్నింటిపైనా జాతీయ మహాసభలలో విస్తృతంగా చర్చిస్తామని వెల్లడించారు.

అమర్‌జిత్ కౌర్ మాట్లాడుతూ దేశమంతటా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో జాతీయ మహాసభలకు చండీగఢ్ ఆతిథ్యం ఇవ్వడం విశేషమని అన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో సీపీఐ నిర్వహించిన గర్వకారణమైన పాత్రను, సామాన్య, శ్రామిక, అణగారిన, రైతాంగ, వర్గాల కోసం చేసిన కృషి, జాతి నిర్మాణంలో నిర్వర్తించిన పాత్రను ప్రజలకు తెలియజేసేందుకు మహాసభ ఒక మంచి అవకాశమని చెప్పారు. బంత్‌సింగ్ బ్రార్ మాట్లాడుతూ బ్రిటీష్ వలసవాదుల నుంచి భారత దేశం స్వాతంత్ర్యం సాధించడంలో ముందంజలో ఉండి త్యాగాలు చేసిన వారిలో అనేకమంది పంజాబ్ ప్రజలు కూడా ఉన్నారని తెలిపారు.

(న్యూయేజ్ మే 4-10 సంచిక నుంచి)

మణిపూర్ సంక్షోభ కారకుడు అమిత్‌షా

రవీంద్రనాథ్ సిన్హా

రెండేళ్లపాటు మణిపూర్‌లో సంక్షోభం ఏర్పడి బీభత్సం జరగడానికి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కారణమని మెయితీల సంఘాలు ఆగ్రహంతో ఉన్నాయి. 2025 మే 3వ తేదీన మెయితీ సంఘాలు మణిపూర్‌లోని వివిధ చోట్ల సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించాయి. 2023 మే 3వ తేదీన జాతుల మధ్య హింసాకాండ తలెత్తి క్రమంగా రాష్ట్రం అల్లకల్లోలమైంది. 2011 గణాంకాల ప్రకారం, మణిపూర్‌లో 53శాతం మెయితీలు నివసిస్తున్నారు. లోయ ప్రాంతంలో మెయితీలు, అటవీప్రాంతంలో కుకీ-జోలు నివసిస్తున్నారు. వీరంతా గిరిజనులు, బాగా వెనకబడిన వీరికి ఎస్టీ హోదా ఉంది. మెయితీలు కూడా తమకూ ఎస్టీ హోదా మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా విచారణ జరిపిన కోర్టు మెయితీలకు అనుకూలంగా మే 3న తీర్పు ఇవ్వగా అదే రోజు కుకీ-జోలు ఆందోళన ప్రారంభించగా అది తీవ్ర హింసాకాండకు దారితీసింది. కల్లోలం ఏర్పడి రెండవ సంవత్సరం పూర్తయిన సందర్భంగా మణిపూర్‌లో అనేక చోట్ల సభలు, సమావేశాలు జరిగాయి.

రాష్ట్రంలో తలెత్తిన హింసాకాండను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం శ్రద్ధ తీసుకోలేదు. రాష్ట్రంలో ఉన్నదీ బీజేపీ ప్రభుత్వమే. రాష్ట్ర ముఖ్యమంత్రి బిరేన్‌సింగ్ మెయితీలు నాయకుడే. మణిపూర్ సమస్యను పరిష్కరించకపోగా మరింతగా తీవ్రతరం కావడానికి కారకుడయ్యాడు. బిరేన్‌సింగ్‌ను తొలగించి మరొక ముఖ్యమంత్రిని నియమించి ఉంటే సమస్య పరిష్కారం అయి ఉండేదని అభిప్రాయపడ్డారు. హోం మంత్రి అమిత్ షా మణిపూర్‌లో పర్యటించినప్పటికీ సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధిని ప్రదర్శించలేదు. మోదీ ఒక్కసారి కూడా మణిపూర్‌ను సందర్శించలేదు. మెయితీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తొలి నుంచి వెనకేసుకు వచ్చాయి. కొండ ప్రాంతాల్లో నివసించే కుకీ-జోలు తదితర గిరిజనులను వెళ్లగొట్టి, అక్కడ ఉన్న ఖనిజ నిక్షేపాలను సంపన్నులకు కట్టబెట్టాలన్న దురాలోచన కేంద్రానికి ఉందన్న ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా మెయితీల ధాటికి తాము తట్టుకోలేమని, తమకు ప్రత్యేక పాలన ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నా కేంద్ర, రాష్ట్రాలు పట్టించుకోలేదు.

కుకి-జోలు 'ప్రత్యేక దినోత్సవం'గా న్యూ ఢిల్లీ (మే1వ తేదీ) గౌహతి, బెంగళూరు తదితర చోట్ల సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో సున్నితంగానే విమర్శలు చేశారు. మెయితీలు మణిపూర్ సమగ్రత (కొకోమి), 'మణిపూర్ ప్రజలు' పేరుతో సమన్వయ కమిటీ బానర్ కింద ఖుమాల్ లంపక్‌లో (ఇంఫాల్) సదస్సును నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం "కావాలని నిర్లక్ష్యం చేయడం లేదా వ్యూహాత్మకంగా మణిపూర్‌లో హింసాకాండను కొనసాగించడం జరిగింది. స్వంత జాతీయ, భౌగోళిక రాజకీయాల ప్రయోజనాల కోసం రాష్ట్రానికి చెందిన, మణిపూర్ ప్రజల గౌరవాన్ని, భద్రతను, హక్కులను చిన్నచూపు చూడటం జరిగింది". ఇటీవల అమిత్ షా చేసిన ప్రకటనను ఈ సదస్సు తిరస్కరించింది. మెయితీలు, కుకీ-జోల మధ్య కేవలం సాధారణమైన సంఘర్షణలు జరిగాయని అమిత్ షా చెప్పడాన్ని సదస్సు ఖండించింది. టెర్రరిస్టులు, మత తీవ్రవాదుల మధ్య హింసాకాండ జరిగినప్పటికీ అమిత్ షా పెద్ద గొడవేమీ కాదన్న రీతిలో మాట్లాడారు. "అమిత్ షా ప్రకటన ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నది, సాదాసీదాగా జరిగిన ఘర్షణగా చెప్పడమేగాక, తీవ్రతను, సంఘర్షణను, గందరగోళాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు." మాజీ ఐఏఎస్ అధికారి ఆర్ కే నిమయ్ మోడరేటర్‌గా సదస్సు జరిగింది. ఈ సదస్సులో చేసిన తీర్మానంపై కొకోని కన్వీనర్ ఖొరై జామ్ అథోబా సంతకం చేశారు. అంతరంగికంగా లేదా బాహ్యంగా మణిపూర్‌ని విభజించేందుకు, ప్రత్యేక ప్రాంతాలుగా చేసేందుకు ప్రయత్నిస్తే దృఢంగా సమైక్యంగా వ్యతిరేకిస్తాం అని సదస్సు వెల్లడించింది.

నిర్దిష్ట సమయంలో స్పష్టంగా ప్రజల హక్కులను, గౌరవాన్ని కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, ఒకవేళ ఏ చర్య తీసుకోకపోతే మణిపూర్ ప్రజలను పూర్తిగా దూరంగా ఉంచుతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. "అలాంటి పరిస్థితుల్లో ప్రజలు సమస్యగా సొంత పంథాలో తగిన చర్యలను తీసుకోక తప్పదు. మణిపూర్ ప్రజలు, భారత ప్రభుత్వం మధ్య పరస్పర సంబంధం ఉండాలి" అని న్యూదిల్లీ తమ బాధ్యతను విస్మరించలేదు. కేంద్రం తన బాధ్యతను తప్పించుకోలేదు. విదేశాలలో జన్మించిన సాయుధగ్రూపులు అంటే కుకీ జాతీయ సంస్థ, రాష్ట్రంలో పనిచేస్తున్న ఐక్య పీపుల్స్ ఫ్రంట్ సంస్థలను పరోక్షంగా కేంద్రం సమర్థించరాదని సదస్సులు జరిపిన మెయితీలు తుదిగా హెచ్చరించారు. సదస్సు చేసిన తీర్మానంలో కేంద్రం తీసుకోవలసిన చర్యలను పేర్కొన్నారు. అవి ఇలా ఉన్నాయి. అంతరంగికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన ప్రజలతో కలిపి సహకార ప్యాకేజీలతో పునర్ నివాసం ఏర్పాటు చేయాలి. రాష్ట్రం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిని తిరిగి చదువుకునేందుకు హామీ ఇవ్వాలి. తప్పిపోయిన పిల్లలను వెదికిపట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించాలి. ఎంపీల కుటుంబాలు తిరిగి ఇక్కడికే వచ్చి నివసించేందుకు వీలుగా నష్టపరిహారం ఇవ్వాలి. అలాగే వ్యవసాయ సీజన్ వస్తున్నందున పొలాలు పంటలు వేసుకునేందుకు సహాయం చేయాలి. గత రెండేళ్లుగా దెబ్బతిన్న పొలాలకు, ఇతర సౌకర్యాలకు సహాయం చేయాలి.

2050 నాటికి చంద్రుడిపై భారతీయుడు: మోదీ

న్యూఢిల్లీ: అంతరిక్షంలో భారత్ ఎన్నో గొప్ప విజయాలు సాధిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. 'గ్లోబల్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ సదస్సు' ప్రారంభం సందర్భంగా మోదీ బుధవారం ప్రసంగించారు. మంగళ్‌యాన్, చంద్రయాన్ వంటి ప్రయోగాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. చంద్రుడిపై నీటి జాడ ఉందని తొలిసారి చంద్రయాన్ ద్వారా గుర్తించామన్నారు. దక్షిణాసియా దేశాల కోసం ప్రత్యేక ఉపగ్రహం ప్రయోగించినట్లు గుర్తు చేశారు. త్వరలో భారత వ్యోమగామి రోదసీలో పర్యటిస్తాడని మోదీ పేర్కొన్నారు. 2050 నాటికి చంద్రుడిపై భారతీయుడు అడుగుపెడతాడని వెల్లడించారు. ఢిల్లీలో గ్లోబల్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ కాన్ఫరెన్స్ నేటినుంచి 9 వరకు జరగనుంది.

పౌరులను చంపడం భావ్యం కాదు: ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: సరిహద్దు నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ రేంజర్లు పౌరులను లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరపడం భావ్యం కాదని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం మెరుపుదాడులు చేసిన క్రమంలో నియంత్రణ రేఖ వెంట పాక్ సైన్యం జరిపిన కాల్పుల్లో పది మంది పౌరులు మృతి చెందారు. దీనిపై ఒమర్ స్పందిస్తూ... 'పాకిస్థాన్‌లోని పౌరులను కాకుండా కేవలం ఉగ్రస్థావరాలను మాత్రమే భారత్ లక్ష్యంగా చేసుకుంది. అయితే, పాక్ మాత్రం అన్యాయంగా జమ్మూకశ్మీర్ పౌరులపై దాడి చేసి 10 మందిని పొట్టన పెట్టుకుంది' అని మండిపడ్డారు. ఎల్‌ఓసీ వెంబడి ఉన్న అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడినట్లు అబ్దుల్లా తెలిపారు. అక్కడి పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని, పాక్ చర్యలను దీటుగా ఎదుర్కొంటామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పౌరుల భద్రత, వారికి మౌలిక సదుపాయాలు సమకూర్చడం వంటి వాటిపైనే దృష్టిసారించినట్లు తెలిపారు. అత్యవసర సమయాల్లో ఎలా ప్రతిస్పందించాలనే దానిపై వారికి అవగాహన కల్పించే అంశాలపై ముందుకువెళ్తున్నామని వెల్లడించారు. కాగా, సరిహద్దుల్లో పరిస్థితిని ఉన్నతాధికారులతో కలిసి సమీక్షించేందుకు ఒమర్ అబ్దుల్లా అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు.

జైషే స్థావరం ధ్వంసం

వీడియో షేర్ చేసిన బీజేపీ

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. లష్కరే తోయిబా, జైషే మహ్మద్ ఉగ్రముఠాలే లక్ష్యంగా వాటి స్థావరాలపై బాంబులతో విరుచుకుపడింది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో జరిపిన మెరుపుదాడులతో ఈ ఉగ్రసంస్థలకు గట్టి దెబ్బ తగిలింది. ముఖ్యంగా బహవల్‌పూర్‌లోని జైషే ప్రధాన కేంద్రంపై దాడిని భారీ విజయంగా భావించవచ్చు. దాడుల్లో ఈ స్థావరం ధ్వంసమైంది. అందుకు సంబంధించిన దృశ్యాలను బీజేపీ ఐటీ విభాగం ఇంఛార్జ్ అమిత్ మాలవీయ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. 'పాకిస్థాన్ పంజాబ్ ప్రావిన్స్‌లోని బహవల్‌పూర్‌లో గల మర్కజ్ సుబాన్... జైషే ముఠా ప్రధాన కార్యాలయం. ఈ ఉగ్రశిబిరంలోనే జైషే అనేక ఉగ్ర కుట్రలకు పథక రచన చేసింది. 2019 ఫిబ్రవరి 14న జరిగిన పుల్వామా దాడికి ఇక్కడే కుట్ర చేసింది. ఆ దాడికి పాల్పడిన వారికి ఇక్కడే శిక్షణ అందించారు. ఇప్పుడు ఆ స్థావరాన్ని ధ్వంసం చేశాం' అని మాలవీయ రాసుకొచ్చారు. ఆపరేషన్‌కు ముందు, తర్వాత ఆ ఉగ్ర శిబిరం ఎలా ఉందో వీడియోలో చూపించారు. దాడి కారణంగా భవనం దెబ్బతింది. గోడలు కూలిపోవడంతో పాటు భారీ గొయ్యి ఏర్పడింది.

పాక్ విచక్షణారహిత కాల్పులు

15 మంది భారత పౌరుల మృతి

- ఎల్‌ఓసీ వెంబడి జమ్మూకశ్మీర్‌లో దుశ్చర్య
- 57 మందికి గాయాలు... కొందరి పరిస్థితి విషమం

జమ్మూ/శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వెంబడి ఉన్న గ్రామాలపై పాకిస్థాన్ సైన్యం బుధవారం భారీ ఫిరంగి, మోర్టార్ దాడులకు పాల్పడటంతో నలుగురు పిల్లలు సహా 15 మంది మరణించగా, 57 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. దక్షిణ కశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని తొమ్మిది ఉగ్రవాద లక్ష్యాలపై భారత సాయుధ దళాలు క్షిపణి దాడులు చేసిన కొద్దిసేపటికే సరిహద్దు అవతల నుంచి తీవ్రమైన కాల్పులు ప్రారంభమయ్యాయి. భారత సైన్యం ఈ దాడులకు తగిన విధంగా స్పందిస్తోందని, కాల్పులకు ఒడిగట్టిన పాక్ సైన్యానికి చెందిన అనేక పోస్టులు ధ్వంసమైన తర్వాత శత్రువు వైపు అనేక మంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో అత్యంత దారుణంగా దెబ్బతిన్నది పూంచ్ జిల్లా. ఇక్కడ అనేక మంది పౌరులు మరణించారని, 42 మంది గాయపడ్డారని, వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. పాకిస్థాన్ జరిపిన విచక్షణారహిత కాల్పులు సరిహద్దు నివాసితులలో భయాందోళనలు సృష్టించాయని, వారు తమ గ్రామాల లోపల లేదా వెలుపల భూగర్భ బంకర్లలో ఆశ్రయం పొందవలసి వచ్చిందని లేదా సురక్షిత ప్రదేశాలకు మారాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. బాలాకోట్, మెంధార్, మంకోట్, కృష్ణ ఘాటి, గుల్పూర్, కెర్ని, పూంచ్ జిల్లా ప్రధాన కార్యాలయాలు సహా పూంచ్‌లోని నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు జరిగాయని, ఫలితంగా డజన్ల కొద్దీ ఇళ్లు, వాహనాలు దెబ్బతిన్నాయని వివరించారు. మృతులను బల్వీందర్ కౌర్ అలియాస్ రూబీ (33), మొహమ్మద్ జైన్ ఖాన్ (10), అతని అక్క జోయా ఖాన్ (12), మొహమ్మద్ అక్రమ్ (40), అమ్రిక్ సింగ్ (55), మొహమ్మద్ ఇక్బాల్ (45), రంజీత్ సింగ్ (48), షకీలా బి (40), అమర్జీత్ సింగ్ (47), మరియం ఖాటూన్ (7), విహాన్ భార్గవ్ (13), మొహమ్మద్ రఫీ (40) గా అధికారులు గుర్తించారు. బారాముల్లా జిల్లాలోని యురి సెక్టార్‌లో జరిగిన సరిహద్దు కాల్పుల్లో ఐదుగురు మైనర్ పిల్లలు సహా పది మంది గాయపడగా, రాజౌరి జిల్లాలో మరో ముగ్గురు గాయపడ్డారని, కుప్వారా జిల్లా కర్నా సెక్టార్‌లో జరిగిన కాల్పుల్లో అనేక ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయని అధికారులు వెల్లడించారు. మే 6, 7 తేదీల మధ్య రాత్రి సమయంలో పాకిస్థాన్ సైన్యం ఎల్‌ఓసీ, జమ్మూకశ్మీర్ ఎదురుగా ఉన్న అంతర్జాతీయ సరిహద్దు వద్ద కాల్పులు జరిపిందని, ఫిరంగి దాడులతో సహా ఏకపక్ష కాల్పులకు తెగబడిందని రక్షణ ప్రతినిధి ఒకరు తెలిపారు. భారత దళాలు ప్రతీకార చర్యలో శత్రు దళాల పోస్టులను ధ్వంసం చేసిన తర్వాత వారి వైపు భారీగా ప్రాణ నష్టం జరిగిందని సైనిక వర్గాలు తెలిపాయి. జమ్మూ ప్రాంతంలోని ఐదు సరిహద్దు జిల్లాల్లోని అన్ని విద్యాసంస్థలు బుధవారం మూసివేయాలని అధికారులు ఆదేశించారు.

సోఫియా, వ్యోమికా ఎవరు?

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. పాక్, పీఓకేలోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై విజయవంతంగా దాడులు నిర్వహించింది. ఈ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలను కేంద్ర రక్షణ, విదేశాంగ శాఖ విలేకరుల సమావేశంలో వెల్లడించాయి. భద్రతా బలగాలకు చెందిన ఇద్దరు మహిళలు దాడుల వివరాలు వెల్లడించడం అందరి దృష్టినీ ఆకర్షించింది. ఇంత క్లిష్టమైన ఆపరేషన్ గురించి దేశ ప్రజలకు వెల్లడించిన వారిద్దరు కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్.

గుజరాత్‌కు చెందిన సోఫియా... బయోకెమిస్ట్రీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆమెకు పీస్ కీపర్‌గా అపార అనుభవం ఉంది. ఐరాసకు చెందిన పీస్ మిషన్‌లో భాగంగా 2006లో కాంగోలో విధులు నిర్వర్తించారు. 2016లో పూనెలో జరిగిన 'ఎక్సర్‌సైజ్ 18' పేరిట భారత ఆర్మీకి చెందిన బృందానికి నాయకత్వం వహించి చరిత్ర సృష్టించారు. అది మల్టీ నేషనల్ మిలిటరీ ఎక్సర్‌సైజ్. దానిలో 18 దేశాలు పాల్గొన్నాయి. అన్ని దేశాలు ఉన్నప్పటికీ... ఒక్క భారత్ బృందానికి మాత్రమే మహిళ నాయకత్వం వహించడం విశేషం. అప్పుడు బలగాలు శాంతి పరిరక్షక కార్యకలాపాలు, మందుపాతర తొలగింపుపై దృష్టిసారించాయి. 1990ల్లో సోఫియా సైన్యంలో చేరారు. ఆర్మీ సిగ్నల్ కార్ప్స్‌కు చెందిన సీజన్డ్ ఆఫీసర్. మూడు దశాబ్దాల ప్రయాణంలో ఆమె రాజీలేని వైఖరి ప్రదర్శించారు. తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ ఆమె పనితీరును ప్రశంసించారు. ఇక వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ గురించి పరిశీలిస్తే... చిన్నప్పుడే పైలట్ కావాలని కలలు కన్నారు. చదువుకునే రోజుల్లో ఎన్‌సీసీలో చేరారు. ఇంజినీరింగ్ విద్య పూర్తిచేసిన ఆమె... తన కలకు తగ్గట్టుగా భారత వైమానిక దళంలోని హెలికాప్టర్ పైలట్‌గా వృత్తి జీవితం ప్రారంభించారు. డిసెంబర్ 18, 2019న ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదా పొందారు. తన కుటుంబం నుంచి భారత భద్రతా బలగాల్లో చేరిన తొలి వ్యక్తి ఆమే కావడం విశేషం. జమ్మూకశ్మీర్, ఈశాన్య భారతంలోని ఎత్తైన ప్రాంతాలతో పాటు అత్యంత సవాలుతో కూడిన ప్రాంతాల్లో చేతక్, చీతా హెలికాప్టర్లు నడిపారు. అనేక రెస్క్యూ ఆపరేషన్లలో పాలుపంచుకొన్నారు. ఈ రోజు జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్రం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు కనిపిస్తోంది. దాడి ఎంత కచ్చితత్వంతో చేసిందో... బ్రీఫింగ్ విషయంలోనూ అంతే పక్కాగా వ్యవహరించింది. ఇందులో పాల్గొన్న భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి కశ్మీరీ పండితుడు. ఈ ఆపరేషన్‌ను వ్యూహాత్మక విజయంగా చూడటమే కాకుండా కలిసికట్టుగా చేసిన కృషిగా కేంద్రం చూపాలనుకున్నట్లు వెల్లడవుతోంది. మహిళలు నాయకత్వం వహిస్తారు.. ప్రతీకారం తీర్చుకుంటారని వెల్లడి చేయాలనుకుందని తెలుస్తోంది. పర్యాటకులను వారి భార్యల ముందు చంపినదానికి కౌంటర్‌గా ఈ ఇద్దరు మహిళలను ముందు వరుసలో నిలబెట్టారని విశ్లేషకులు భావిస్తున్నారు.

1947 నుంచి భారత్-పాక్ ఘర్షణ

సైనిక పోరాటాలు... వైమానిక దాడులు... మెరుపు దాడులు

న్యూఢిల్లీ: భారత సాయుధ దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై మంగళవారం రాత్రి క్షిపణి దాడులు చేశాయి. ఇందులో జైషే మొహమ్మద్ ఉగ్రవాద సంస్థకు కీలకమైన కోటగా పిలువబడే బహవల్పూర్ కూడా ఉంది. పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' అనే పేరుతో ఈ దాడులు భారతదేశం, పాకిస్థాన్ మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న సైనిక ఉద్రిక్తతలలో మరో అధ్యాయాన్ని సూచిస్తున్నాయి. భారతదేశ స్వాతంత్ర్యం, ఉపఖండం విభజన తర్వాత 1947 యుద్ధం నుంచి పుల్వామా ఆత్మాహుతి బాంబు దాడికి ప్రతీకారంగా భారతదేశం 2019లో బాలాకోట్ మెరుపు దాడి వరకు భారత్-పాక్ సైనిక ఘర్షణల చరిత్ర విస్తరించి ఉంది.

- **1947 (మొదటి ఇండో-పాక్ యుద్ధం):** 1947లో భారత్, పాకిస్థాన్ మధ్య మొదటి యుద్ధం జరిగింది. దీన్నే మొదటి కశ్మీర్ యుద్ధం అని పిలుస్తారు. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జమ్మూకశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేసేందుకు నిర్ణయించారు మహారాజా హరిసింగ్. దీంతో 1947 అక్టోబరులో పాకిస్థాన్ మద్దతుగల గిరిజన మిలీషియాలు రాచరిక రాష్ట్రం జమ్మూకశ్మీర్‌పై దాడి చేయడంతో ఈ యుద్ధం అనివార్యమైంది. అప్పుడు ఈ ప్రాంతాన్ని రక్షించడానికి భారత్ తమ సాయుధ దళాలను పంపింది. భారత్, పాక్ మధ్య జమ్మూకశ్మీర్ కోసం ఈ యుద్ధం జరిగింది. అయితే ఐక్యరాజ్యసమితి జోక్యంతో రెండు దేశాలు 1949 జనవరిలో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నాయి. అప్పుడు నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) ఏర్పాటయింది.
- **1965 (రెండో ఇండో-పాక్ యుద్ధం):** 1965లో భారత్, పాకిస్థాన్ మధ్య రెండోసారి యుద్ధం జరిగింది. ఆగస్టు 5న స్థానిక తిరుగుబాటుదారుల వేషంలో వేలాది మంది పాక్ సైనికులు జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి భారత భూభాగంలోకి చొరబడ్డారు. 'ఆపరేషన్ జిబ్రాల్టర్' పేరుతో రహస్య ఆపరేషన్ నిర్వహించేందుకు పాక్ ప్రయత్నించి విఫలమైంది. జమ్మూకశ్మీర్‌ను అస్థిరపరచడం, స్థానిక తిరుగుబాట్లను రెచ్చగొట్టడం లక్ష్యంగా పెట్టుకుంది. భారత్ ప్రతిస్పందనతో పాక్ తోకముడిచింది. ఈ యుద్ధం 1965 సెప్టెంబరు 23 వరకు కొనసాగింది. ఆ తర్వాత సోవియట్ యూనియన్, అమెరికా మధ్యవర్తిత్వంతో రెండు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి.
- **1971 (బంగ్లాదేశ్ స్వాతంత్ర్య యుద్ధం):** 1971లో భారత్, పాక్ మధ్య మూడో యుద్ధం జరిగింది. బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం రావడానికి ఈ యుద్ధమే కారణం. బంగ్లాదేశ్ స్వాతంత్ర్య ఉద్యమానికి మద్దతుగా భారత్ యుద్ధంలోకి ప్రవేశించింది. తూర్పు, పశ్చిమ సరిహద్దులలో తీవ్రమైన పోరాటం తర్వాత పాకిస్థాన్ దళాలు 1971 డిసెంబర్ 16న లొంగిపోయాయి.
- **1999 (కార్గిల్ యుద్ధం):** 1999లో భారత్-పాకిస్థాన్ మధ్య కార్గిల్ యుద్ధం జరిగింది. జమ్మూకశ్మీర్‌లోని కార్గిల్ సెక్టార్‌లోని పర్వతాలను పాకిస్థాన్ దళాలు, ఉగ్రవాదులు ఆక్రమించారు. వైమానిక దళం 'ఆపరేషన్ సఫేద్ సాగర్' మద్దతుతో భారతదేశం ఆ భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి 'ఆపరేషన్ విజయ్'ను ప్రారంభించింది. 1999 మేలో ప్రారంభమైన ఈ యుద్ధం జులై వరకు జరిగింది. పాక్ సైన్యాన్ని, ఉగ్రవాదులను తరిమికొట్టి భారత్ విజయం సాధించింది. అందుకే జులై 26ని కార్గిల్ విజయ్ దివస్‌గా జరుపుకుంటారు.
- **2016 (ఉరి దాడి):** 2016 సెప్టెంబరు 18న జమ్మూకశ్మీర్ ఉరిలోని భారత సైనిక స్థావరంపై పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాదులు దాడులు జరిపారు. ఈ దాడిలో 19 మంది సైనికులు మరణించారు. ఆ తర్వాత అదే ఏడాది సెప్టెంబర్ 28, 29న భారత్ నియంత్రణ రేఖ వెంబడి మెరుపు దాడి నిర్వహించింది. పీఓకేలోని అనేక ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను లక్ష్యంగా చేసుకుంది. చొరబాటులకు సిద్ధమవుతున్న ఉగ్రవాదులను మట్టుబెట్టింది.
- **2019 (పుల్వామా దాడి):** 2019 ఫిబ్రవరి 26న జరిగిన పుల్వామా ఉగ్ర దాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది మరణించారు. అందుకు ప్రతిస్పందనగా భారత వైమానిక దళం... పాకిస్థాన్ బాలాకోట్‌లోని జైషే మహ్మద్ ఉగ్రవాద శిక్షణా శిబిరంపై వైమానిక దాడులు చేసింది. యుద్ధ విమానాలతో పాక్ భూభాగంలోని ఉగ్రవాద శిబిరాన్ని లక్ష్యం చేసుకుంది. 1971లో జరిగిన భారత్- పాక్ యుద్ధం తర్వాత ఇదే మొదటి వైమానిక దాడి.

లష్కరే నుంచి జైషే మహ్మద్ వరకు...

ఉగ్ర శిబిరాల వివరాలు ఇవే

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో భారత్‌కు ఓపిక, సహనం నశించాయి. ముష్కరులు అమాయకుల ప్రాణాలు తీయడమే కాకుండా... మీ ప్రధానికి వెళ్లి చెప్పండనడంతో వారిని ఏమాత్రం ఉపేక్షించకూడదని నిర్ణయించుకొంది. పఠాన్ కోట్ నుంచి రియాసీ దాడి వంటి పెద్ద కుట్రలకు కేంద్రాలుగా నిలిచిన శిక్షణ శిబిరాలను నేలమట్టం చేసింది. జైషే మహ్మద్, లష్కరే తోయిబా, ఉగ్రవాదుల భారీ సొరంగాలను ధ్వంసం చేసింది. సరిహద్దుకు 100 కిలోమీటర్ల దూరంలో గల బహవల్‌పూర్‌లోని మర్కజ్ సుబాన్ జైషే మహ్మద్‌కు ఆపరేషనల్ హెడ్‌క్వార్టర్‌గా ఉంది. పుల్వామా దాడి సహా భారత్‌పై చాలా కుట్రలు ఇక్కడే పురుడు పోసుకున్నాయి. మసూద్ అజార్ సన్నిహితులు ఈ కేంద్రం నుంచి ఆత్మాహుతి దాడులకు శిక్షణ ఇవ్వడం, ప్లానింగ్ వంటివి చేశారు. దీనిని జైషే చీఫ్ మసూద్ ఇంటిగా వినియోగిస్తాడు. జైషే నెంబర్-2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్, మౌలానా అమర్ ఇతరుల కుటుంబసభ్యులు కూడా దీనిలో ఉంటున్నారు.

లష్కరే కార్యాలయం ఉగ్ర యూనివర్సిటీ

మురిద్కేలోని మర్కాజ్ తోయిబా లష్కరే తోయిబా ప్రధాన కార్యాలయం. సరిహద్దుకు 30 కిలోమీటర్ల దూరంలోని లష్కరే క్యాంపు కార్యాలయం ఇది. దాదాపు 82 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఉగ్ర క్యాంపస్ ఇది. ఇందులో మదర్సా, మార్కెట్ వంటివి ఉన్నాయి. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేయడంలో ఈ క్యాంపస్‌దే కీలక పాత్ర. ఇది లష్కరే ప్రధాన కార్యాలయంగా పనిచేస్తోంది. దాదాపు 1000 మంది వరకు ఇక్కడ ఉగ్ర శిక్షణ పొందుతున్నారు. దీని నిర్మాణానికి 2000లో అల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ 10 మిలియన్ డాలర్లు విరాళం ఇచ్చాడు. 26/11 ఉగ్రదాడికి పాల్పడిన దుర్మార్గుల్లో ఒకడైన అజ్మల్ కసబ్‌కు ఇక్కడే ఇంటెలిజెన్స్ శిక్షణ ఇచ్చారు. ఈ దాడి కుట్రదారులు డేవిడ్ హెడ్లీ, తహవ్వూర్ రాణా ఈ కేంద్రాన్ని సందర్శించారు. లష్కరే సిద్ధాంతకర్తలు అమిర్ హమ్జా, అబ్దుల్ రెహ్మాన్ అబ్ది, జాఫర్ ఇక్బాల్ ఈ ప్రాంగణంలోనే నివాసం ఉంటున్నారు. లష్కరే చీఫ్ హఫీజ్ సయీద్, జకీర్ రహ్మాన్ లఖ్వీకి ఇక్కడ ఇళ్లు ఉన్నాయి.

తెహ్రా కలాన్‌లోని సర్జల్ క్యాంప్. జైషే మహ్మద్ ఉగ్ర స్థావరం ఇది. దీన్ని కూడా జమ్మూకశ్మీర్‌లోకి ఉగ్రవాదులను పంపించేందుకు ఉపయోగిస్తున్నారు. భారత్‌లోని సాంబా సెక్టర్‌కు కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. భారత్‌లోకి రహస్య సొరంగాలు తవ్వేందుకు ఇది కేంద్రంగా ఉంది. షకర్‌గర్ ప్రాంతాన్ని లష్కరే, జైషేలు సొరంగాల నెట్‌వర్క్‌గా మార్చేశాయి. భారత్‌లోకి ఆయుధాలు, మత్తు పదార్థాలు రవాణా చేసేందుకు ఇది ప్రధాన లాంచ్‌ప్యాడ్. ఇక్కడ కంట్రోల్ రూమ్ ఉంది. వీటిల్లో హిజ్బుల్ ముజాహిదీన్ రేడియో రిసీవర్లు, కమ్యూనికేషన్ సెంటర్లు ఉన్నాయి. జైషే కమాండర్లు ఇక్కడికి వచ్చి వెళుతుంటారు. ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్‌కు ఇక్కడ పారా గ్లైడింగ్‌లో శిక్షణ ఇచ్చారు. పఠాన్‌కోట్ ఎయిర్ బేస్‌పై దాడి చేసిన ఉగ్రవాదులకు జైషే కమాండర్ షాహిద్ లతీఫ్ ఇక్కడే బ్రెయిన్ వాష్ చేశాడు. కాగా, హిజ్బుల్ కీలక కేంద్రం సియల్‌కోట్‌లోని మెహమూనా జోయా క్యాంప్. అంతర్జాతీయ సరిహద్దుకు 15 కి.మీ. దూరంలో ఉన్న హిజ్బుల్ ముజాహిదీన్ శిబిరం ఇది. దీనికి చుట్టూ నివాస భవనాలు ఉన్నాయి. దీనికి మోహద్ ఇర్ఫాన్ ఖాన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇతడు 1995లో

జమ్మూలోని మౌలానా ఆజాద్ స్టేడియంలో వరుస పేలుళ్లకు పాల్పడ్డాడు. నాడు గవర్నర్ కేవీ కృష్ణారావు త్రుటిలో ఈ దాడుల నుంచి బయటపడ్డారు. ఈ ఉగ్ర స్థావరంలో దాదాపు 50 మంది ఉండేందుకు వీలుగా ఏర్పాట్లు ఉన్నాయి. నిత్యం ఇక్కడ 20-25 మంది ఉంటారు. బర్నాలలోని మర్కాజ్ అహ్లే హదిత్ ఉగ్ర స్థావరం. ఇది లష్కరే తోయిబా ఉగ్ర క్యాంప్. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని భింబెర్ జిల్లాలో ఉంది. ఇక్కడ 150 మందికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు ఉన్నాయి. నిత్యం 40 మంది ఇక్కడ ఉంటారు. ఈ కేంద్రాన్ని లష్కరే కమాండర్ ఖాసీం గుజ్జర్, అనాస్‌జరార్ నిర్వహిస్తున్నారు. పూంఛ్-రాజౌరి-రియాసీ సెక్టార్‌లోకి లష్కరే ఉగ్రవాదులు, ఆయుధాలు పంపించేందుకు దీన్ని వినియోగిస్తున్నట్లు సమాచారం.

కోట్లిలోని మర్కాజ్ అబ్బాస్ ఉగ్ర స్థావరం జైషే ఆయుధాగారం. నియంత్రణ రేఖకు 35 కి.మీ. దూరంలో ఈ క్యాంప్ ఉంది. కోట్లీ మిలిటరీ క్యాంప్‌నకు కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో దీనిని నిర్వహించడం గమనార్హం. ఇక్కడ 125 మంది శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు ఉన్నాయి. ఏ సమయంలోనైనా కనీసం 50 మంది ఉంటారు. హఫీజ్ అబ్దుల్ షకూర్ అలియాస్ ఖారీజరార్ ఈ కేంద్రానికి నాయకుడు. జైషే వ్యవస్థాపక సభ్యుల్లో ఒకడు. గతంలో హర్కత్ ఉల్ ముజాహిదీన్‌లో పనిచేశాడు. 2016న గ్రోటాలోని బాలెనీ ఆర్మీ క్యాంప్‌పై దాడిలో ఇతడి హస్తం ఉన్నట్లు ఎన్ఐఏ వెల్లడించింది. పఠాన్‌కోట్ ఉగ్రదాడి తర్వాత జైషే తన ఆయుధాలు, మందుగుండును దశాకా మర్కజ్ నుంచి తరలించి ఇక్కడ నిల్వ చేయడం మొదలుపెట్టింది. అవసరమైనప్పుడు షకూర్ స్వయంగా ఆయుధాలను తన వాహనంలో సియాల్‌కోట్‌కు తరలిస్తాడు. 2023 ఏప్రిల్ 20న పూంఛ్‌లో జరిగిన దాడులకు, జూన్ 24న బస్సులో ప్రయాణిస్తున్న అమాయక యాత్రికులపై దాడికి ఇక్కడి ఉగ్రవాదులే కారణమని సమాచారం. ఉగ్రవాదులకు పర్వత యుద్ధతంత్రంలో శిక్షణ ఇస్తారు. ఇది కోట్లిలోని మస్కర్ రహీల్ షహీద్. పీఓకేలో హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన స్థావరం ఇది. దాదాపు 200 మందికి ఉగ్ర శిక్షణ ఇచ్చేలా దీనిని నిర్మించారు. ప్రస్తుతం అక్కడ 30 మంది వరకు ఉండొచ్చని అంచనా. తుపాకీల వినియోగం, శారీరక దృఢత్వంపై శిక్షణ ఇస్తారు. హిజ్బుల్ చీఫ్ సయ్యద్ సలాహుద్దీన్ దీనికి అధిపతి. కొండల ప్రాంతంలో ఉండే ఈ క్యాంప్‌లో నాలుగు గదులు, బ్యారక్‌లు ఉన్నాయి. వీటిలో పెద్దఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రి ఉన్నట్లు సమాచారం. వీటితోపాటు ఉగ్రవాదులకు బ్రెయిన్ వాష్ చేసేందుకు అవసరమైన ప్రచార సామగ్రి పెద్దఎత్తున ఇక్కడ నిల్వ చేస్తారు. లష్కరే శిక్షణ కేంద్రం ముజఫరాబాద్‌లోని షవాయ్ నాలా. ఇది 2000 సంవత్సరం నుంచి పనిచేస్తోంది. దీనికి హంజైఫా బిన్ యెమెన్, బైత్ ఉల్ ముజాహిద్దీన్ అనే పేర్లు కూడా ఉన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తంగ్ధర్ సెక్టార్‌లో సరిహద్దుకు 30 కిలోమీటర్ల పరిధిలో షవాయ్ లష్కరే క్యాంప్ ఉంది. ఈ ముఠాకు కీలకమైన క్యాంప్ ఇది. లష్కరే కమాండర్ అబు దుజానా దీనికి ఇన్‌ఛార్జి. పెద్దఎత్తున లష్కరే కేడర్ ఇక్కడ నివాసం ఉంటోంది. వీరిలో కమాండర్లు, శిక్షకులు ఉన్నారు.

పాక్ ఎస్ఎస్‌జీ కమాండోలతో శిక్షణ

ముజఫరాబాద్‌లోని సైద్నా బిలాల్ ఉగ్ర స్థావరం. పీఓకేలోని జైషే ప్రధాన కేంద్రాల్లో ఇది ఒకటి. ముఫ్తీ అస్గర్ ఖాన్ కశ్మీరీ దీనికి అధిపతి. భారత్ నుంచి పారిపోయిన... ఆసిక్ నెంగ్రూ, జైషే కమాండర్ అబ్దుల్ జిహాదీ కూడా ఈ క్యాంప్‌ను వాడుకొన్నారు. ముజఫరాబాద్ రెడ్‌ఫోర్ట్‌కు ఎదురుగా ఉంటుంది. ఇక్కడికి వచ్చేవారికి పాక్ ఎస్ఎస్‌జీ కమాండోలు శిక్షణ ఇస్తారు. జమ్మూకశ్మీర్‌లోకి ఉగ్రవాదులను తరలించేందుకు వీలుగా దీన్ని రవాణా క్యాంప్‌గా నిర్వహిస్తున్నారు. ఇక్కడ నిత్యం 50-100 మంది ఉగ్రవాదులు ఉంటారని తెలుస్తోంది.

విభిన్నం... 'ఆపరేషన్ సిందూర్'



న్యూఢిల్లీ: భారత్ గతంలో జరిపిన మెరుపు దాడుల కంటే తాజాగా నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' పూర్తిగా భిన్నమైనది. 2016లో ఉరి ఉదంతం తరువాత నిర్వహించిన మెరుపు దాడులు, 2019లో బాలాకోట్ దాడులు సహా గతంలో ఎన్నడూ ఇటువంటి దాడులు చేపట్టలేదు. సాంకేతికపరంగా ఈ ఆపరేషన్ అత్యంత బలమైంది.. ఖర్చుతో కూడుకున్నది. అంతేకాకుండా ఉగ్రవాదం విషయంలో గతంలో అనుసరించిన వైఖరి పూర్తిగా మారిపోయిందనే బలమైన సంకేతం పాక్‌కు వెళ్లింది. 'భారీ సంఖ్యలో ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో టెర్రరిస్ట్ నెట్‌వర్క్‌లు, వాటి హ్యాండిలర్లకు తీవ్ర హెచ్చరికలు వెళ్లినట్లు అయింది. దీంతోపాటు అవసరమైతే భారత్ ముందస్తుగా దాడి చేయగలదని, పాక్‌లోని ఏ లక్ష్యం తమకు దూరం కాదని స్పష్టం చేసింది. ఉగ్రదాడులకు ప్రతిస్పందించడమంటే కేవలం శక్తిని చూపడం మాత్రమే కాదని, టెర్రరిస్టుల కార్యకలాపాలు, ఇతర వనరుల పునాదులు పెకలించేస్తామని ఈ దాడులతో పేర్కొంది. అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలు ఛేదించే 24 ఆయుధాలను భారత్ వినియోగించింది. వీటిల్లో క్షిపణులు, బాంబులు, ఆత్మాహుతి డ్రోన్లు ఉన్నాయి.

10 వరకు విమాన సర్వీసుల రద్దు

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి భారత్ గట్టిగా ప్రతీకారం తీర్చుకుంది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్, పీఓకేలోని 9 ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులకు పాల్పడింది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత గగనతలంలో కొంత మేర కేంద్రం ఆంక్షలు విధించింది. దీంతో ఇప్పటికే అనేక విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఈ క్రమంలోనే ప్రముఖ విమానాయాన సంస్థ ఇండిగో కీలక ప్రకటన చేసింది. మే 10వ తేదీ వరకు 165కు పైగా విమానాలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. 'గగనతలంపై ఆంక్షల నేపథ్యంలో అమృత్‌సర్, బికనీర్, చండీగఢ్, ధర్మశాల, గ్వాలియర్, జమ్మూ, జోధ్‌పూర్, కిషన్‌గఢ్, లేహ్, రాజ్‌కోట్, శ్రీనగర్ సహా కొన్ని విమానాశ్రయాల నుంచి మే 10వ తేదీ ఉదయం 5.30 గంటల వరకు 165కి పైగా విమాన సర్వీసులను రద్దు చేస్తున్నాం' అని ఇండిగో ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రయాణికులు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లు చూసుకోవాలని తెలిపింది. ఆయా విమాన ప్రయాణికులు రీషెడ్యూల్ లేదా టికెట్ రద్దు చేసుకునే సదుపాయం కల్పిస్తున్నట్లు వెల్లడించింది. ఇందుకు ఎలాంటి అదనపు ఛార్జీలు లేవని, రద్దు చేసుకుంటే పూర్తి రీఫండ్ ఇస్తామని పేర్కొంది. ఎయిర్‌ఇండియా కూడా ఇదే విధమైన ప్రకటన చేసింది. మే 10వ తేదీ ఉదయం వరకు శ్రీనగర్, జమ్మూ, లేహ్, జోధ్‌పూర్, అమృత్‌సర్, భుజ్, జామ్‌నగర్, రాజ్‌కోట్, చండీగఢ్ విమానాశ్రయాలకు తమ విమానాల రాకపోకలు నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. ప్రయాణికులకు వన్‌టైమ్ రీషెడ్యూల్ ఛార్జీల మినహాయింపు కల్పించింది. లేదా పూర్తి రీఫండ్ ఇస్తామని తెలిపింది. స్పైస్‌జెట్, ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ ఎయిర్ విమానాలు కూడా రద్దయ్యాయి.

విశాలాంధ్ర హైదరాబాద్

నాగోల్ అగ్నిప్రమాద బాధితులను తక్షణమే ఆదుకోవాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, నాగోల్, సాయి నగర్ గుడిసెల్లో జరిగిన అగ్ని ప్రమాద బాధితులను సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఈ.టి.నరసింహ, సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు చందు నాయక్‌లతో కలసి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి బుధవారం పరామర్శించారు. అగ్ని ప్రమాదం వలన 28 గుడిసెలు పూర్తిగా, కొన్ని గుడిసెలు పాక్షికంగా దగ్ధమయ్యాయని, దీంతో నిత్యావసర సరకులు, వస్తువులు, డబ్బులు, బంగారం తోపాటు సర్వస్వం కోల్పోయామని బాధితులు చాడ వెంకట్ రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రెండు దశాబ్దాల క్రితం నాగోల్, సాయి నగర్‌లో జరిగిన సిపిఐ భూ పోరాటంలో భాగంగా ప్రభుత్వ భూమిలో వందలాది మంది పేదలకు గుడిసెలు వేయించారని, ఆతరువాత వారికీ ఇళ్ల పట్టాలుకూడా సిపిఐ స్థానిక నాయకత్వం ఇప్పించడం జరిగిందని గుర్తు చేశారు. అకస్మాత్తుగా మంటలు చెలరేగి గుడిసెలు దగ్ధమై సర్వస్వం కోల్పోవడం చాలాబాధాకరం, బాధితులకు సిపిఐ అన్ని విధాలా ఆదుకుంటుందని అని అన్నారు. తక్షణ సహాయం కింద ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని పెంచి వెంటనే అందజేయాలని, అలాగే అగ్ని ప్రమాదంలో గుడిసెలు, ఇళ్ళు కోల్పోయిన బాధితులకు ఇంటి నిర్మాణానికి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేయాలనీ చాడ వెంకట్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 332వ ఆరాధన మహోత్సవా లలో భాగంగా బుధవారం ట్యాంక్ బండ్‌పై పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవ కమిటీ చైర్మన్ అట్లూరి రవీంద్ర చారి, కరుణశ్రీ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అట్లూరి రవీంద్ర చారి ఆహ్వానం మేరకు తెలుగుదేశం నాయకులు పెద్దోజు రవీంద్రాచారి ఆరాధన ఉత్సవాలలో పాల్గొని బ్రహ్మంకి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సందర్భంగా పెద్దోజు రవీంద్రాచారి మాట్లడుతూ వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞాన కర్తగా, గొప్ప దార్శనికునిగా, మహా తత్త్వవేత్తగా, ఒక యోగిగా, సంఘ సంస్కర్తగా అవతార పురుషుడని అన్నారు. వీరబ్రహ్మేంద్ర స్వామి తమ తత్త్వాల ద్వారా, ఇతర రచనల ద్వారా, సామాజిక విప్లవాన్ని సాధించిన మహనీయుడని, సమాజంలోని మూఢ విశ్వాసాలను ఖండిస్తూ అజ్ఞానంలో మగ్గిపోతున్న మానవాళికి జ్ఞానోదయాన్ని కల్గించిన క్రాంతిదర్శి, జీవన తత్త్వాన్ని తత్త్వాలుగా ప్రజల్లోకి వెదజల్లి, సామాన్యుల నుండి పండితుల వరకు అందరినీ ప్రభావితం చేశారన్నారు. తెలుగు సాహిత్యంలో, తెలుగు వారైన యోగి పుంగవులలో గురు శ్రేష్ఠులలో ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టించిన చైతన్యమూర్తి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి అని అన్నారు. ఆనాడు చెప్పిన కాలజ్ఞాన వేదవాక్కులు సత్యవాక్కులుగా నిరూపితమై నాటికి, నేటికి నిజమవుతున్నాయని, ఈ రోజు దేశంలో ఉన్న పరిస్థితులు యుద్ధ వాతావరణం బెంగాల్ అల్లర్ల గురించి, కాశ్మీర్ ఉగ్రవాద దాడుల గురించి ఆనాడే ఆయన భోదనలలో తెలియజేశాన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ప్రకాష్, మేడ్చల్ సత్యనారాయణ, తిరుమూర్తుల గౌరిశంకర్, చింతోజు మాధవాచారి, కొల్లూరి శ్రీనివాసా చారి, మహరాజు రవీంద్రా చారి, నర్సింహా చారి పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్టుకు కార్మికులను తిరిగి తీసుకోవాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో పలువురు కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. గత ఏడాది 2024లో ట్రాన్స్‌పోర్టుకు 814 మందిని తీసుకున్నారు. గత నెల 23న దాదాపు 262 మందిని తిరిగి పంపించారు. అయితే వీరిని ఎక్కడ విధులు నిర్వహించాలో తెలియజేయుండా పంపడంతో వారు అయోమయంలో ఉండి తమ పరిస్థితి అగాదంలో పడిందని, తిరిగి ట్రాన్స్‌పోర్టుకు పంపించాలని నిరసన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్‌ను కలిసి తమ గోడును వెళ్ళబోసుకున్నారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించి, ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారని జిహెచ్ఎంసి కన్వీనర్ కన్వీనర్ అకుల శ్రీనివాస్ తెలిపారు. కార్మికుల సంఘం నాయకులు సముద్రాల శ్రీనివాస్, ఎండీ జహీర్, గద్దం జగదీష్, కె.బాలరాజు బిఎంఈయు నాయకులు సి.హెచ్ సంజీవ్, భూపతి, మురళీ, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

డిప్యూటీ కమీషనర్ ప్రశాంతిని కలిసిన గంగాధర్ రెడ్డి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి జోన్ డిప్యూటీ కమీషనర్‌గా నియమితులైన శుభ సందర్భంగా ప్రశాంతిని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డిప్యూటీ కమీషనర్ ప్రశాంతితో సమావేశమై గచ్చిబౌలి డివిజన్ పరిధిలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై డిప్యూటీ కమిషనర్‌తో చర్చించడం జరిగింది. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడలని అని కోరారు. అదేవిధంగా చెరువుల సుందరికరణ, పార్కులు అభివృద్ధి చేపట్టాలని, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, అభివృద్ధి విషయంలో అధికారులతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు ఏర్పాటుకు కృషి చేయాలని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి కోరారు.

ఆపరేషన్ సింధూర్‌తో ప్రభుత్వం అప్రమత్తం

ఉద్యోగులు, అధికారులు, మంత్రుల విదేశీ పర్యటనలు రద్దు : సీఎం రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్ : 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో సైన్యంతో మనమంతా వెన్నంటి ఉన్నామనే సందేశం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి సమయంలో రాజకీయాలకు తావు లేదన్నారు. అత్యవసర సేవలు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులు, మంత్రులు, అధికారులందరూ అందుబాటులో ఉండాలన్నారు. మంత్రులు, అధికారులు విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగులు, మీడియా, సోషల్ మీడియాలో అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్‌ఫ్రీ నంబర్ సిద్ధం చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నారు. నగరంలోని సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ఇది కొనసాగనుంది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఇతర నేతలు పాల్గొననున్నారు. ఇండియన్ ఆర్మీ పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డీజీపీ జితేందర్, హోం సెక్రటరీ రవి గుప్తా, ఆర్మీ, పోలీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల రక్షణకు సంబంధించి అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ చేపట్టనున్నారు. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు,ఇతర నేతలు పాల్గొననున్నారు.

విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి అనధికారికంగా నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపైన కఠినంగా వ్యవహరించాలని అన్నారు. బ్లడ్ బ్యాంకుల్లో రక్తనిల్వలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అత్యవసర మెడిసిన్ సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రైవేటు- ఆస్పత్రుల్లో బెడ్‌ల అందుబాటుపైన ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రెడ్ క్రాస్ సమన్వయం చేసుకోవాలని అన్నారు. ఆహార నిల్వలు తగినంత ఉండేలా చూడాలని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ మీద అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపైన ఉక్కు పాదం మోపాలని హెచ్చరించారు. ఫేక్ న్యూస్ వల్ల ప్రజల్లో మరింత ఆందోళన పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఫేక్ న్యూస్‌ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంకి అనుసంధానం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు- సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు- భద్రతను పెంచాలని సూచించారు. హైదరాబాద్‌లోని అన్ని విదేశీ రాయబార కార్యాలయాల దగ్గర భద్రతను పెంచాలని ఆదేశించారు. ఐటీ- సంస్థల దగ్గర భద్రతను పెంచాలని అన్నారు. హైదరాబాద్ నగరంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవసరమైతే పీస్ కమిటీలతో మాట్లాడాలని సూచించారు. రౌడీషీటర్లపైన, పాత నేరస్తుల పట్ల పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన

భారత సైన్యానికి సెల్యూట్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను అంతమొందించిన భారత సైన్యం చర్యలు అభినందనీయమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర తెలిపారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సాయుధ దళాలు విజయవంతం కావడాన్ని హర్షిస్తూ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న యుద్ధ ట్యాంక్ ముందు మిఠాయిలు పంచుతూ భారత సైన్యానికి సెల్యూట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్లలో ఉన్న ఉగ్రవాద మౌలిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత సాయుధ దళాలు ఆపరేషన్ సిందూర్ ప్రారంభించడాన్ని ఏఐవైఎఫ్ స్వాగతిస్తుందన్నారు. ఇటీవల పహల్గాంలో దారుణమైన ఉగ్రవాద దాడి చేసిన పాక్ ప్రేరేపిత ఉగ్ర చర్యల వలన, 25 మంది భారతీయ పౌరులు, ఒక నేపాలీ జాతీయుడు ప్రాణాలను కోల్పోయామని, ఈ చర్యకు నేడు భారత సాయుధ దళాలు ధీటైన గట్టి జవాబు ఇచ్చారన్నారు. అమాయక ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఉగ్రవాదానికి ఎక్కడిదని వారు ప్రశ్నించారు. దేశ ప్రజలంతా భారత సాయుధ దళాలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని, భారత పౌరులంతా ఐక్యమత్యంగా ఉన్నామనే సందేశాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్య ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు కళ్యాణ్, హేమంత్, శ్రీనివాస్, రమేష్, రమ్య, కీర్తన, ఫాతిమా, రాము పాల్గొన్నారు. మే 20న జరిగే దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుకు డిహెచ్‌పిఎస్ సంపూర్ణ మద్దతును తెలియజేస్తూ కార్మిక పిలుపులో భాగస్వామ్యం కావాలని నిర్ణయించుకోవడం జరిగింది. ఆపరేషన్ కాగాను తక్షణమే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సమావేశంలో తీర్మానం చేయడం జరిగింది. జూన్ చివరి వారంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర రెండవ మహాసభలు వరంగల్‌లో నిర్వహించాలని సమావేశాల్లో నిర్ణయించడం జరిగింది. మే 12న రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్లు, డబల్ బెడ్ రూమ్ రాజీవ్ యువ వికాస్ పథకంలో లోపాలపైన రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన పిలుపు. ఈ సమావేశంలో జాతీయ సమితి సభ్యులు బోయిని అశోక్, పొన్నగంటి లావణ్య,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్, ఆఫీస్ బేరర్స్ కే.సహదేవ్, ఏ.రాజ్ కుమార్, జేరుపోతుల కుమార స్వామి, ఉషశ్రీ, సలిగంటి శ్రీనివాస్ శ్రీనివాస్, బి.లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించిన దక్షిణ మధ్యరైల్వే

విశాలాంధ్ర - హైదరాబాద్ : పౌర రక్షణ కార్యక్రమం అనుగుణంగా హోం మంత్రిత్వ శాఖ (ఏం.ఎచ్.ఏ) చేపట్టిన యుద్ధ పూర్వ సన్నద్ధత చొరవలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని కాచిగూడ రాయచూర్, ఔరంగాబాద్ రైల్వే స్టేషన్‌ల వద్ద బుధవారం విస్తృతంగా సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించారు. క్లిష్టమైన పరిస్థితుల్లో అత్యవసర ప్రతిస్పందన యంత్రాంగాలను, అంతర్-సంస్థ సమన్వయాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా విస్తృత యుద్ధ పూర్వ సంసిద్ధత చొరవలో భాగంగా ఈ డ్రిల్ చేపట్టారు. ఈ డ్రిల్‌ను దక్షిణ మధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ కంట్రోలర్ ఉదయనాథ్ కోట్లా పర్యవేక్షణలో పౌర రక్షణ వాలంటీర్లు, బోధకులు, సంబంధిత సిబ్బంది బృందంతో కలిసి నిర్వహించారు. అంకితభావంతో కూడిన ఈ బృందం ఈ డ్రిల్‌లో చురుకుగా పాల్గొని ఊహించని అత్యవసర పరిస్థితులలో శత్రుదాడి దృశ్యాలను అనుకరించడంలో రైల్వే మొత్తం సంసిద్ధతను అంచనా వేయడానికి దోహదం చేశారు. అదే విధంగా రాయచూర్, ఔరంగాబాద్ రైల్వే స్టేషన్‌ల వద్ద జరిగిన మాక్ డ్రిల్‌లో సివిల్ డిఫెన్స్ వాలంటీర్లు, ఆర్‌పి.ఎఫ్, రైల్వే సిబ్బంది కూడా పాల్గొన్నారు. వైమానిక దాడుల హెచ్చరిక సైరన్‌లను చేయడం, రైల్వే సిబ్బంది, ప్రయాణీకులు అత్యవసర హెచ్చరికలకు వెంటనే స్పందించేలా చూసుకోవడం, క్రాష్ బ్లాక్ అవుట్ చర్యల అమలు, అనుకరణ వైమానిక ముప్పు సమయంలో దృశ్యమానతను తగ్గించడానికి పవర్-డౌన్ ప్రోటోకాల్‌లను పరీక్షించడం, నిర్దేశించిన భద్రతా మండలాలకు ప్రయాణీకుల సమన్వయ కదలికను సులభతరం చేస్తూ తరలింపు ప్రణాళిక రిహార్సల్స్, అగ్నిమాపక, ప్రాథమిక లైఫ్ సపోర్ట్ (బి.ఎల్.ఎస్), ప్రథమ చికిత్స నిర్వహణ రెస్క్యూ ఆపరేషన్లతో సహా వివిధ పౌర రక్షణ సేవల కోసం కార్యాచరణ సంసిద్ధతను తనిఖీ చేయడం, రైల్వే భద్రతా సిబ్బంది, స్థానిక అధికారులు అత్యవసర ప్రతిస్పందనదారుల మధ్య ప్రతిస్పందన ఏకీకరణను పెంపొందించడానికి ఇంటర్-ఏజెన్సీ సమన్వయ డ్రిల్, సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ ప్రయాణీకుల భద్రత, రైళ్ల కార్యకలాపాల నిర్వహణలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే ధైర్యం నిర్ధారించడంలో దక్షిణ మధ్య రైల్వే నిబద్ధతను బలోపేతం చేయడంలో కీలకమైన దశగా ఉపయోగపడుతుంది. రియల్ టైమ్ అత్యవసర అనుకరణలో రైల్వే సిబ్బంది, స్వచ్ఛంద సేవకులను చురుకుగా పాల్గొనేలా చేయడం ద్వారా, ఈ చొరవ ప్రయాణీకులు, రైల్వే సిబ్బందిలో విశ్వాసాన్ని కలిగించడానికి ప్రయత్నిస్తుంది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొన్న దక్షిణ మధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ విభాగం బృందానికి ఈ ఇతర సభ్యులను అభినందించారు. నిర్మాణాత్మక అత్యవసర ప్రతిస్పందన విధానాలను అమలు చేయడంలో మరియు బహుళ-ఏజెన్సీ సహకారాన్ని పెంపొందించడంలో దక్షిణ మధ్య రైల్వే క్రియాశీలమైన విధానాన్ని ఈ డ్రిల్ ప్రతిబింబిస్తుందని, క్రమం తప్పకుండా శిక్షణా సెషన్లు, మాక్ డ్రిల్‌ల ద్వారా, దక్షిణ మధ్య రైల్వే పరిస్థితుల సంసిద్ధతను పెంపొందించడానికి, కీలకమైన మౌలిక సదుపాయాలను రక్షించడానికి, సంక్షోభ సమయాల్లో ప్రయాణీకుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడానికి కట్టుబడి ఉందని తెలిపారు.

రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని న్యూ వెంకటేశ్వర నగర్‌లో 10 లక్షల రూపాయల వ్యయంతో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ మాట్లాడుతూ... ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా నెరవేర్చుతున్నానన్నారు. డివిజన్‌లోని ప్రతి కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, బి.ఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌లో కూలిన లిఫ్ట్

ముగ్గురు కార్మికుల మృతి

విశాలాంధ్ర - హైదరాబాద్, జవహర్‌నగర్ : వహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 11 గంటల సమయంలో మల్కారం డంపింగ్ యార్డ్ లో ప్రమాదం చోటుచేసుకుంది.జవహర్ నగర్ ఎస్ హెచ్ ఓ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం డంపింగ్ యార్డ్ లో పవర్ ప్రాజెక్ట్ ఫేస్2లో గల చిమ్ని లో పనులు జరుగుతుండగా ప్రమాదవశాత్తు చిమ్ని లిఫ్ట్ వైర్ తెగి అందులో పనిచేస్తున్న ముగ్గురు వ్యక్తులు సురేష్ సర్కార్(21) ప్రకాష్ మండల్ (24) అమిత్రాయ్ (20) లిఫ్ట్ వైర్ తెగి కిందపడి తీవ్రంగా గాయపడగా వెంటనే ముగ్గురిని ఈసీఐఎల్ లో గల శ్రీకర హాస్పిటల్ కు చికిత్స నిమిత్తం క్షతగాత్రులను హుటాహుటిన తరలించారు.కార్మికులకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు.వీరంతా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించారు. మృతి చెందిన కార్మికుల వివరాలు సేకరించి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గౌలిపుర స్లాటర్ హౌస్ త్వరలో పున:ప్రారంభిస్తాం : కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సంతోష్ నగర్ సర్కిల్ గౌలిపుర మేకల మండి (స్లాటర్ హౌస్) త్వరలో పున:ప్రారంభించడం జరుగుతుందని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ అన్నారు. బుధవారం ఉదయం గౌలిపుర స్లాటర్ హౌస్ భవనం ఆయన పరిశీలించారు. గౌలిపుర మేకల మండి గతంలో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో బాగా నడిచిందని, కాలనీకి చెందిన ఒక వ్యక్తి కోర్టుకు వెళ్లడంతో నిలిచిపోయిందని అప్పటి నుండి స్లాటర్ హౌస్ పనిచేయకపోవడంతో ఆధారపడిన కుటుంబాలు ఇబ్బందులు పడ్డారని, కోర్టు తీర్పు ఇచ్చి చాలా రోజులు అవుతున్నందున యంత్రాలు, మరమ్మత్తులు ఇంకా కొన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కమ్యూనిటీ పెద్దలు ఈ సందర్భంగా కమిషనర్‌ను కోరారు. బిల్డింగ్, యంత్రాల మరమ్మత్తులు, నీరు ఇతర వసతులు ఏర్పాటు చేసి త్వరలోనే పునఃప్రారంభించడం జరుగుతుందని కమ్యూనిటీ పెద్దలకు కమిషనర్ వివరించారు. ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు ప్రతిపాదనలు తయారు చేయాలని కమిషనర్ ఆదేశించారు. కమిషనర్ వెంట హెల్త్ అడిషనల్ కమీషనర్ పంకజ, జోనల్ కమీషనర్ వెంకన్న, జోనల్ ఎస్.ఈ మహేశ్వర్ రెడ్డి, ప్రాజెక్టు ఎస్.ఈ శ్రీలక్ష్మి, సంతోష్ నగర్ డిప్యూటీ కమీషనర్ మంగతాయారు, గౌలిపుర కార్పొరేటర్ భాగ్య లక్ష్మీ, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర - మల్కాజిగిరి : అష్టబుజా దేవి ఆలయం నుండి బాలాజీ అపార్ట్మెంట్స్ వరకు సిసి రోడ్‌ను శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి రూ.17 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. ఈ రోడ్ ప్రారంభం సందర్భంగా కాలనీవాసులతో కలిసి మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ రోడ్ నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుని నిధులు మంజూరు చేయించి, మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా కృషి చేసిన ఎమ్మెల్యేకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సుధాకర్ శర్మ, ఆనంద్‌బాగ్ అసోసియేషన్ అధ్యక్షులు మురళి కృష్ణ, శ్రీధర ఎంక్లేవ్ శాస్త్రి, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, రవీంద్ర, గీత, సత్య, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సతీష్, శ్రీకాంత్, జనార్దన్, బంటి, నవీన్, కోటేశ్వర్, బాకబురావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేర్ హాస్పిటల్స్‌లో మాతృదినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ ఎ మామొరబుల్ సెలబ్రేషన్ పేరుతో ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ వేడుకలో తల్లుల గొప్పతనాన్ని సెలబ్రేట్ చేశారు. మాతృమూర్తులు, పిల్లలు, కేర్ గివర్లు, సిబ్బంది అందరూ కలిసి ఆనందంగా ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎలికో లిమిటెడ్ వైస్-చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వనిత దాట్ల హాజరై, మాతృమూర్తుల శ్రమ, మమకారం, శక్తి గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ సీఓఓ నిలేష్ గుప్తా, సీనియర్ ఓబ్స్టెట్రిషియన్, గైనకాలజిస్ట్ డాక్టర్ ఎస్.వి. లక్ష్మి, సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ శైలజ కంభంపాటి తల్లుల ఆరోగ్యం, కుటుంబాలలో వారి పాత్ర గురించి ముఖ్యంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిల్లల కోసం ఆటలు, వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. దీపప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో నిలేష్ గుప్తా ప్రారంభ ప్రసంగం ఇచ్చారు. పలువురు గౌరవ అతిథులు తల్లుల గురించి భావోద్వేగంతో మాట్లాడారు. ఈ సందర్భంగా కేర్ హాస్పిటల్స్ "మదర్స్ హెల్త్" అనే ప్రత్యేక ఆరోగ్య ప్యాకేజ్‌ను విడుదల చేసింది. ఇది అన్ని వయస్సుల తల్లుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రూపొందించబడింది. ముందస్తు హెల్త్ చెకప్, సమగ్ర వైద్య సేవలతో ఇది తల్లుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా ఉందన్నారు.

తెలుగు వర్సిటీలో ఫైన్ ఆర్ట్స్, ఫిల్మ్ యాక్టింగ్‌లో శిక్షణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : సురవరం ప్రతాప రెడ్డి తెలుగు యూనివర్సిటీ నాంపల్లి ప్రాంగణంలో శిల్పం చిత్రలేఖనం శాఖ, రంగస్థల కళల శాఖ ఆధ్వర్యంలో వేసవి సెలవులలో ఫైన్ ఆర్ట్స్, ఫిల్మ్ యాక్టింగ్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కోట్ల హనుమంతరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మే 15వ తేదీ నుండి శిక్షణ తరగతులు మొదలై నెల రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని, శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు సర్టిఫికెట్ కూడా ఇస్తామని తెలిపారు. ఈ కోర్సులకు రూ.5,000 ఫీజుని చెల్లించవలసి ఉంటుందని, సంబంధిత డిమాండ్ డ్రాఫ్టు, రిజిస్ట్రార్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరిట చెల్లించాలని తెలిపారు. వివరాలకై 8309011865, 8309498807 (ఫైన్ ఆర్ట్స్), 9346461733 (ఫిల్మ్ యాక్టింగ్) నంబర్లకు సంప్రదించాలని తెలియజేశారు.

ఇండియన్ ఆర్మీకి జోహార్లు : ఆరెకపూడి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఉగ్ర దాడిలో భర్తలను కోల్పోయిన ప్రతీ మహిళ ప్రతీకారానికి చిహ్నంగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా నిర్వహించిన ఇండియన్ ఆర్మీకి జోహార్లు అని, ఉగ్రవాదుల పహల్గామ్ దాడికి కౌంటర్‌గా ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయ వంతం అయిన శుభ సందర్భంగా భారత సైన్యంకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భారత సాయుధ బలగాలు కొనసాగిస్తున్న ఆపరేషన్ సిందూర్‌కు పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తున్నాం అని, పాకిస్తాన్ మరియు పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)లోని ఉగ్రవాద కేంద్రాలపై భారత సైన్యం నిర్వహించిన నిర్దేశిత దాడులు దేశ ప్రజలందరినీ గర్వపడేలా చేశాయని పేర్కొన్నారు. ఈ సమయంలో ప్రతి పౌరుడు భారత సైనికులకు అండగా సంఘీభావంగా, ఐక్యంగా నిలబడాలని కోరారు. భారత సైన్యం ఎంత వీరోచితంగా దాడులు చేసిందో అంతే అప్రమత్తంగా వుండి దేశ రక్షణలో మేమెవరికి తీసిపోము అన్నట్టుగా వారికి శక్తి సామర్థ్యాలుండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నామని తెలియచేసారు.

నరేష్ కుమార్ రాజ్ నాగసాని జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : సంగారెడ్డి జిల్లా, పటాన్చెరు 113వ డివిజన్, బిజెపి పార్టీ డైనమిక్ యువ నాయకులు, ప్రజల ఆత్మా బంధువు నరేష్ కుమార్ రాజ్ నాగసాని ముదిరాజ్ జన్మదిన వేడుకకు అభిమానులు, కార్యకర్తల శుభాకాంక్షలు అభినందనల వెల్లువెత్తాయి. అనునిత్యం ప్రజా సేవయే మాధవ సేవయే అంటూ, అన్న అంటే నేను ఉన్నానంటూ చిన్న వయసులోనే ఎన్నెనో బ్లడ్ డొనేషన్ కార్యక్రమాలు, కరోనా (కోవిడ్- 19) మహమ్మారి కాలంలో కూడా నరేష్ కుమార్ చేసిన ఎలలేని సేవలు వర్ణనాతీతం భవిష్యత్తు మరింత ఉన్నతంగా, మరిన్ని ఉన్నత స్థాయి శిఖరాలు అధిరోహించి, సమున్నతంగా, సంపూర్ణ ఆయురారోగ్యా లతో నిండు నూరేళ్ళు సంతోషంగా వుండాలని ఆశిస్తూ.... ప్రజాల మంచి కోరకు మీలాంటి మంచి యువ నాయకులు నేతగా ముందు రావాలి అని కోరుకున్నారు. ఈ క్రమంలో బిజెపి కార్యకర్తలు, నవీన్ ముదిరాజ్, చిట్ల. శివ కుమార్ ముదిరాజ్, భారత్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కందికల్‌లో ఆక్రమణలను తొలగించిన హైడ్రా

విశాలాంధ్ర - హైదరాబాద్ : బండ్లగూడ మండలం కందికల్ విలేజీలోని ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 303, 306 సర్వే నంబర్లలో ఉన్న 2500 గజాల ప్రభుత్వ స్థలాన్ని హైడ్రా స్వాధీనం చేసుకుంది. వాస్తవానికి ఈ స్థలం యూఎల్‌సీ ల్యాండ్ కాగా.. సయ్యద్ బషీరుద్దీన్, సయ్యద్ అమీదుల్లా హుస్సేన్ కబ్జా చేశారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద ఉన్న భూమిని తన పేరుమీద రెగ్యులరైజ్ చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోయినా.. అందులో అనుమతులు లేకుండా.. షెడ్డులు, రూంలు నిర్మించారు. ఈ మేరకు ప్రభుత్వ భూమి కబ్జా జరుగుతోందని.. కాపాడాలని స్థానికుల నుంచి ప్రజావాణికి ఫిర్యాదు అందడంతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత అధికారుల నివేదిక ఆధారంగా ప్రభుత్వ భూమి అని నిర్ధారించుకున్నారు. హైకోర్టు కూడా ఈ అక్రమ కట్టడాలను తొలగించాలని 2 నెలల క్రితం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అక్కడ నిర్మించిన ఆర్‌సీసీ రూములు 4, రేకుల షెడ్డులు, షాపులు 4 వరకూ కూల్చివేసి.. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో స్థానిక రాజకీయ నాయకులు, కబ్జా చేసిన వారికి చెందిన వారు కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించగా స్థానిక పోలీసుల సహకారంతో వారిని లిఫ్ట్ చేసి కూల్చివేతలను హైడ్రా కొనసాగించింది. హైడ్రాకు ఫిర్యాదు చేయగానే క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆక్రమణల తొలగింపును చేపట్టిన హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర- దుండిగల్: ఉచిత వైద్య శిబిరాలను ప్రతీ ఒక్కరూ సద్వినియో గం చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకా నంద్ పేర్కొన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 - జీడిమెట్ల డివిజన్ అయోధ్య నగర్‌లోని కమ్యూనిటీ హాల్ లో "గ్రేస్ క్యాన్సర్ హౌండేషన్, బైబిల్ ఫౌండేషన్" ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్యశిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని, ఈ వైద్య శిబిరా లను అందరూ సద్వినియోగ పరుచుకోవాలి. బైబిల్‌మిషన్ పాస్టర్ చిట్టి బాబు, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, జిహెచ్ఎంసి డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నదీమ్ రాయ్, ఎల్లా గౌడ్, విజయ్ హరీష్, శ్రీకాంత్, గుబ్బల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మల్కాజ్గిరి మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షులు మల్కాజ్గిరి మేడ్చల్ జిల్లా తెలుగుదేశం పార్టీ కన్వీనర్ కందికంటే అశోక్ గౌడ్ పుణ్య దంపతులకు వివాహ వార్షికోత్సవం శుభాకాంక్షలు తెలిపిన జిల్లా నాయకులు రుద్రగోని రాంచందర్ గౌడ్, కొండ జంగారెడ్డి, కృష్ణారావు, కోటేశ్వరరావు బ్రహ్మం తదితరులు ఉన్నారు. - విశాలాంధ్ర, కాప్రా

కృష్ణా నీటి అక్రమ వాడకాలకు చెక్

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కృష్ణా నది నుంచి ఏపి అక్రమంగా నీటిని తరలించకుండా నియంత్రణ అవసరమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు నదిపై వివిధ ప్రదేశాల్లో టెలిమెట్రీ పరికరాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఉత్తమ్ కేంద్రాన్ని కోరారు. పోలవరం బ్యాక్ వాటర్ వల్ల ముంపు ప్రమాదం ఉందని పేర్కొంటూ రిటెన్షన్ వాల్ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర జల సంఘం చైర్మన్ అతుల్ జైన్‌తో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో బుధవారం భేటీ అయ్యారు. వివిధ ప్రాజెక్టులతో పాటు అనేక అంశాలను చర్చిం చారు. మేడిగడ్డ, సమ్మక్క సారక్క, పాలమూరు-రంగా రెడ్డి ప్రాజెక్టులపై వీరిద్దరి మధ్య చర్చ జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. మేడిగడ్డ డ్యామ్ కూలిపోవడంపై జాతీయ డామ్ సంరక్షణ సంస్థ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. అనంతరం సమావేశ వివరాలను ఉత్తమ్ వెల్లడించారు. మేడిగడ్డ డ్యామ్ కూలిపోవడంపై జాతీయ డ్యామ్ సంరక్షణ సంస్థ ఇప్పటికే నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో మేడిగడ్డ డిజైన్, ఆపరేషన్‌లో లోపాలున్నాయని స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా, ప్రాజెక్ట్ పునరుద్ధరణకు సరైన మార్గాలను అన్వేషిస్తున్నాం అని పేర్కొన్నారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీల విషయంలో కేంద్ర జల సంఘంతో సంప్రదింపులు కొనసాగించాల్సిన అవసరం ఉందని ఎన్డీఎస్ఏ సూచించిందని చెప్పారు. ఇందులో భాగంగా మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను పునరుద్ధరించాలా లేదా అనే అంశంపై తుది నిర్ణయం తీసుకోలేదని మంత్రి తెలిపారు. అలాగే తుమ్మిడి హట్టి వద్ద కొత్త ప్రాజెక్టును నిర్మించను న్నట్లు వెల్లడించారు. ఇంకా సమ్మక్క సారక్క ప్రాజెక్టుకు 44 టీఎంసిల నీటిని త్వరితగతిన కేటాయించాలని కోరారు. వీటితోపాటు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు మొత్తం 90 టీ-ఎంసిలు అవసరమని, తక్షణమే 45 టీఎంసులను ముందుగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యా, వైద్య రంగాల అభివృద్ధే లక్ష్యం : మంత్రి శ్రీధర్‌బాబు

మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర - కొత్తూరు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము విద్య, వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత నిస్తుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కొత్తూరు, నందిగామ మండలాల్లో నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు రూ.5 కోట్లతో నిర్మించిన పలు భవనాలను బుధవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ప్రారంభించేందుకు వచ్చారు. వారికి అడుగడుగున కాంగ్రెస్ నాయకులు ఘనంగ స్వాగతం పలికారు. మేకగూడలో భారీ గజమాలతో సన్మానించారు. చాకలి గుట్ట తండాలో మాజీ సర్పంచ్ రాజునాయక్ నిర్మించిన బస్ షెల్టర్, ప్రజలకు దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రం, న్యాట్కో ట్రస్టు వారు నిర్మించిన అంగన్వాడి కేంద్రం, మేకగూడలో బస్ షెల్టర్, గ్రామపంచాయతీ భవనం, గంధాలయ భవనం, సంజిగూడ, నందిగామల్లో అంగన్వాడి కేంద్రాలు, కొత్తూరులో ఉన్నత పాఠశాల భవనాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రితో పాటు ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అప్పుల్లో కూరుకు పోయిందని అన్నారు. అయినప్పటికీ పరిస్థితులను అధిగ మిస్తూ, సంపదను సృష్టిస్తూ రాష్ట్రంలో అన్ని అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. కొంత ఆలస్యమైనప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తూచా తప్పకుండా అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. ఏడాదిన్నర పాలనలో నే ప్రభుత్వాన్ని ప్రజల్లో నుండి వస్తున్న స్పందన చూసి ఓర్వలేక విపక్షాలు తమ ఉనికిని కాపాడుకో వడానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణ లు చేస్తున్నట్లు ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పట్టు పట్టి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి నియోజక వర్గానికి పెద్ద మొత్తంలో నిధులు తెస్తూ నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, నందిగామ, కొత్తూరు మండలాల ఎంపీడీవోలు అరుంధతి, సుమతి, తాసిల్దార్లు రాజేశ్వర్, రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, షాద్నగర్ మార్కెట్ కమిటి వైస్ ఛైర్మెన్ బాబర్ అలీఖాన్, కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, నందిగామ మండలపార్టీఅధ్యక్షుడు జంగ నర్సింహా యాదవ్, కొత్తూరు మున్సిపల్ వైస్ ఛైర్మెన్ డోలి రవీందర్, మాజీ ఎంపీపీలు వేణుగోపాల్ గౌడ్, శివశంకర్ గౌడ్, సీనియర్ నాయకులు గోవర్ధన్ గౌడ్, దేవేందర్ ముదిరాజ్, జగన్, కర్రోళ్ల సురేందర్, కొమ్ము కృష్ణ పాల్గొన్నారు.

సింగరేణిలో అవినీతి దందాలపై ఉక్కు పాదం

అవినీతి, అక్రమార్కులపై సమాచారం ఇవ్వాలని ఉద్యోగులకు యాజమాన్యం పిలుపు

విశాలాంధ్ర - హైదరాబాద్ : శ్రమకు మారుపేరుగా నిలుస్తూ, దేశానికి వెలుగులు అందిస్తున్న సింగరేణి సంస్థలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కొన్ని అరాచక శక్తులను ఇప్పటికే ఏరివేయడం జరిగిందని, ఇంకా ఇటువంటి అవినీతి దందాలు నడిపే వారికి సంబంధించిన, వెనక ఉండి నడిపిస్తున్న వారి సమాచారం తెలియజేస్తే వారిని కూడా ఉక్కుపాదంతో అణిచివేస్తామని సింగరేణి యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. మెడికల్ బోర్డు ప్రక్రియలో అన్ ఫిట్ చేయిస్తామని, బదిలీలు జరిపిస్తామని, కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన వారిని వైద్య పరీక్షల్లో ఫిట్ చేయిస్తామని, డిప్యూటేషన్లు, ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ పరీక్షల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సింగరేణి ఉద్యోగిని మంగళవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో సంస్థ ఈ ప్రకటన జారీ చేసింది. అమాయకులైన కార్మికులను వంచిస్తున్న ఎవరినైనా సరే సంస్థ ఉపేక్షించబోదని, కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. అవినీతికి బలైన బాధితులు, లేదా దీనిపై సమాచారం ఉన్న ఏ ఇతర కార్మికులైన, ఇతరులైన సరే సింగరేణి విజిలెన్స్ శాఖకు తెలియజేయవచ్చని, ఫిర్యాదుదారుల పేర్లను గోప్యంగా ఉంచడమే కాక వారికి సంస్థ పూర్తి రక్షణ కల్పిస్తుందని యాజమాన్యం పేర్కొంది. ఏరియాల్లో, గనుల్లో, డిపార్ట్‌మెంట్లలో సింగరేణి ఉద్యోగులు లేదా అధికారులు, లేక బయట వ్యక్తులు ఎవరైనా సరే లంచాలు ఆశిస్తున్నట్లయితే వారి వివరాలను విజిలెన్స్ శాఖకు, ఏసీబీకి అందించి పట్టించాలని యాజమాన్యం సూచించింది. అవినీతి అక్రమాలకు పాల్పడే వ్యక్తులు ఎవరైనా సరే, ఏ హోదాలో ఉన్న వదిలిపెట్టేది లేదని యాజమాన్యం స్పష్టం చేసింది. గతంలోనూ సింగరేణిలో అక్రమాలకు పాల్పడిన పలువురు ఉద్యోగులపై విచారణ జరిపి డిస్మిస్ చేసిన విషయాన్ని గుర్తుచేసింది. చట్టప్రకారం పలువురిపై చర్యలు కూడా తీసుకున్నట్లు వెల్లడించింది. ఇకముందు కూడా పారదర్శక సింగరేణి కోసం అక్రమార్కులపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేసింది. సింగరేణి సంస్థను అవినీతి రహిత కంపెనీగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు సహకరించాలని యాజమాన్యం విజ్ఞప్తి చేసింది. కొత్తగూడెం విజిలెన్స్ శాఖ వారి ఫోన్ నెంబర్ 94911 44104కు గాని విజిలెన్స్ శాఖ మెయిల్ ఐడి vig@scclmines.com కు సమాచారం ఇవ్వాలని సూచించింది.

13న మిస్ వరల్డ్ పోటీదారుల హెరిటేజ్ వాక్

విశాలాంధ్ర, హైదరాబాద్ : మిస్ వరల్డ్ - 2025 పోటీలను విజయవంతంగా జరిగే విదంగా ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు పర్యాటకశాఖ సంచాలకులు జెడ్.హనుమంతు కొండిబా, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ ఓల్డ్ సిటీలోని చార్మినార్, లాడ్ బజారు, చౌమహల్లా ప్యాలెస్‌ను పర్యాటక శాఖ డైరెక్టర్ జెడ్.హనుమంత్ కొండిబా, సౌత్ జోన్ డిసిపి స్నేహ మెహ్రా, ఇతర శాఖల అధికారులతో కలసి చేపట్టబోయే ఏర్పాట్లపై అన్ని ప్రాంతాలను సందర్శించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 10 నుంచి 31 వరకు మిస్ వరల్డ్ పోటీలు తెలంగాణ హైదరాబాద్‌లో జరుగనున్నాయని తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 13న మిస్ వరల్డ్ పోటీదారులు హైదరాబాద్ పాత బస్తిని సందర్శించి చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్, లాడ్ బజారు సందర్శన, చౌమహల్ల సందర్శించనున్నారని తెలిపారు. తెలంగాణ ఖ్యాతిని విశ్వమంతటా పరిచయం చేసేందుకు ఉపయోగపడే మిస్ వరల్డ్ 2025 వేడుకలను ప్రభుత్వం ప్రతిష్టా'త్మకంగా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 116 దేశాలకు చెందిన యువతులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. పోటీదారులతో పాటు దేశ విదేశాల నుంచి ఈవెంట్ కవరేజీకి దాదాపు మూడు వేల మంది మీడియా ప్రతినిధులు హాజరవుతారని, అలాగే వివిధ దేశాల నుంచి పోటీలకు వచ్చే వారిని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో స్వాగతించాలని, పోటీలు పూర్తయ్యేంత వరకు ఎక్కగా చిన్న పొరపాటు లేకుండా ఏర్పాట్లు అద్వితీయంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించడం జరిగిందని అన్నారు. ఓల్డ్ సిటీలోని చార్మినార్, లాడ్ బజార్‌తో పాటు తెలంగాణ తల్లి, సచివాలయంతో పాటు రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాలను మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించనున్నారు. మిస్ వరల్డ్ కాంటెస్టెంట్ల సందర్శన సందర్భంగా ఏర్పాటు పకడ్బందీగా ఉండాలని సూచించారు.

భద్రత కట్టుదిట్టంగా ఉండేలా చూడాలని, అవసరమైన వసతులు రవాణా కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటరమణ, పర్యాటక శాఖ, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: డివిజన్‌లో కాలనీల సమస్యలకు ప్రత్యేక చొరవ చూపాలని మాజీ కార్పొరేటర్ ఆగంరాజు ముదిరాజ్ పేర్కొన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 17 డివిజన్ సమస్యలపై మాజీ కార్పొరేటర్ ఆగంరాజు ముదిరాజ్ బుధవారం ఎమ్మెల్యే కెపి వివేకానందను ఆయన నివాసలో మర్యాదపూర్వకంగా కలిసి స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను వివరించారు. డివిజన్‌లో వాకింగ్ ట్రాక్, లైబ్రరీ బిల్డింగ్, బస్తి దవఖాన, రోడ్డు ప్యాచ్ వర్క్స్, ఓపెనింగ్ జిమ్స్ ఎస్ ఎన్ డిపి నాలా బ్లాక్ వల్ల మంజీరా పైప్ లైన్ రిపేర్ తదితర సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆగంరాజు మాట్లాడుతూ కాలనీలలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు ఎదురవకుండా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా దృష్టి సారించాలని ఎమ్మెల్యే వివేకానందను కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు బద్రి, డెవలప్మెంట్ అధ్యక్షులు కృష్ణయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

కుకింగ్ పోటీల్లో విజేతగా రీజెన్సీ కళాశాల

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : యువ చెఫ్స్‌లో ఉన్న నైపుణ్యం, సృజనాత్మకతను వెలికితీసే ఉద్దేశంతో తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ (టీసీఏ) రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన టీసీఏ క్యులినరీ లీగ్ 2.0 పోటీలో రీజెన్సీ కళాశాల విజేతగా నిలిచింది. రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో ఐదు ప్రత్యేక పోటీలు నిర్వహించారు. అవి.. వరంగల్ గ్లోబల్ కళాశాలలో మిల్లెట్ మానియా, నిజామాబాద్ ఇన్ఫినిటీ కళాశాలలో తెలంగాణ ఫుడ్ చాలెంజ్, కరీంనగర్ కిమ్స్ కళాశాలలో బిర్యానీ వెర్సస్ పులావ్, హైదరాబాద్ ఐఐహెచ్ఎంసీఏలో ది ఆర్ట్ ఆఫ్ ప్లేట్, హైదరాబాద్ రీజెన్సీ కళాశాలలో నియో తెలంగాణ నిర్వహించారు. ప్రతి విభాగంలో ఉత్తమంగా నిలిచిన రెండు బృందాలు గ్రాండ్ ఫినాలేకి అర్హత సాధించాయి. ఈ ఫినాలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, హైదరాబాద్ (ఐహెచ్ఎం-హైదరాబాద్) వేదికగా జరిగింది. ఇది కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖకు చెందిన కేంద్ర ప్రభుత్వ సంస్థ. ఈ పోటీ ద్వారా రాష్ట్రంలోని యువతలో వంటపై మక్కువ కలిగేలా చేయడం, స్థానిక వంటకాల ప్రాముఖ్యతను తెలియజేయడం జరిగింది. ఈ గ్రాండ్ ఫినాలేలో పోటీదారులు గంటన్నర పాటు సాగిన రైస్ కుకింగ్ ఛాలెంజ్‌లో తలపడ్డారు. ఈ పోటీలో పాల్గొన్న వారికి ముందుగా తెలియని పదార్థాలు ఇచ్చారు. ఆ పదార్థాలు ఉపయోగించి ఒక వంటకం తయారు చేయాలి. ఇది వారి సృజనాత్మకత, తక్షణ ఆలోచనశక్తి, వంట నైపుణ్యానికి సవాల్‌గా నిలిచింది. ఈ టీసీఏ క్యులినరీ లీగ్ 2.0 విజేతగా హైదరాబాద్‌కు చెందిన రీజెన్సీ కాలేజ్ ఆఫ్ క్యులినరీ ఆర్ట్స్ అండ్ హోటల్ మేనేజ్మెంట్ ఎంపికైంది.

జూనియర్ కళాశాల భూ సమస్యను పరిష్కరించండి

ఎంపీ మల్లు రవికి మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు వినతి

విశాలాంధ్ర - ఆమనగల్లు : నాలుగు మండలాలకు ప్రధాన కూడలి అయిన ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల భూ సమస్యను వెంటనే పరిష్క రించి, వచ్చే విద్యా సంవత్స రం నాటికి అసంపూర్తిగా మిగిలిపోయిన కళాశాల భవనం పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని బుధవారం నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లురవిని ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు వినతి పత్రంలో కోరారు. నగరంలోని ఎంపీ నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి. కళాశాల భూ సమస్యను పరిష్కరించాలని వినతిని అందించారు. గత 25 సంవత్సరాలుగా వివాదంతో జూనియర్ కళాశల, డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతుందని ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే భూ వివాద సమస్యను పరిష్కరించి విద్యార్థులకు న్యాయం చేయాలని, వచ్చే విద్యా సంవత్సరం నాటికి పాలిటెక్నిక్ తరగతులను ప్రారంభించాలని ఎంపీని కేశవులు కోరగా సానుకూలంగా స్పందించిన ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి భూ వివాద సమస్యను అతి త్వరగా పరిష్కరించి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చినట్లు కేశవులు తెలిపారు. కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇన్చార్జి మధుసూదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆపరేషన్ సింధూర్ చారిత్రాత్మక నిర్ణయం

విశాలాంధ్ర - మేడిపల్లి: జమ్మూ కాశ్మీర్ పహల్గం ఉగ్రదాడిని తిప్పికొడుతూ భారత సైన్యం ఉగ్రవాద స్థావరాలపై చేసిన ఆపరేషన్ సింధూర్ సుపర్ సక్సెస్ అయిన నేపథ్యంలో పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి స్పందిస్తూ ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిర్మూలించేందుకు భారత ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని, భారత సైన్యం వీర, పరాక్రమాలకు ఇది నాంది అని, సుమారు 25 మంది హిందువులను లక్ష్యంగా విచక్షణారహితంగా చంపిన ఉగ్రవాదులకు, దాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ ద్వారా 9 ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి భారత దెబ్బను పాకిస్తాన్‌కి రుచి చూపించిందని, సామాన్య ప్రజలకు ఎలాంటి నష్టం లేకుండా మొన్న సైన్యం చేసిన ఈ ఆపరేషన్ విశ్వవ్యాప్తంగా భారత్ గొప్పతనాన్ని ఔన్నత్యాన్ని మరోసారి చాటి చెప్పిందని, ఇదే స్ఫూర్తితో ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిర్మూలించేందుకు మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాలని యావత్ భారత ప్రజలు ఒక్కటై భారత సైన్యానికి, భారత ప్రభుత్వానికి అండ దండగా ఉంటారని, భవిష్యత్తులో ఉగ్రవాదం అనే ఊసే లేకుండా చేసే విధంగా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తుంగతుర్తి రవి ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ప్రతి భారతీయుడు అప్రమత్తంగా ఉంటూ, మన భారత సైన్యానికి అండగా ఉండాలని విజ్ఞప్తి చేస్తూ.. ఉగ్రదాడిలో బలైన అమరులకు మరోసారి నివాళులర్పిస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని అన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులను పరిశీలించిన సీపీఎం

విశాలాంధ్ర - కాప్రా : ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వసతులను సీపీఎం పరిశీలించింది. ఏఎస్ రావు నగర్, మహేష్ నగర్, కుషాయిగూడ జమ్మిగడ్డ ప్రాంతాలలోని ఆసుపత్రులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ కుషాయిగూడ జమ్మిగడ్డలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక సదుపాయాల లోపం తీవ్రంగా ఉందన్నారు. నిత్యం 100 నుండి 150 మంది అవుట్‌పేషెంట్లు వచ్చి చికిత్స పొందుతున్నా, కూర్చోవడానికి సరైన షెడ్డు లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారనీ వెంటనే షెడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. నలుగురు స్టాఫ్ నర్సులు అవసరమైనా కేవలం ఇద్దరే పనిచేస్తున్నారని, వెంటనే మిగతా ఇద్దరిని నియమించాలన్నారు. ఓకే ఫార్మసిస్టుకు అధిక పనిభారం ఉండటంతో మరొకరు అవసరమని, మందుల నిల్వ కోసం ఉన్న స్టోర్ రూమ్‌ను విశాలమైన స్టోర్ రూమ్‌లోకి మార్చాలని కోరారు. ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల ఫీజులనియంత్రణకు ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకం అమలులో బకాయిలు 1100 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నందున, ప్రైవేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సేవలు నిరాకరిస్తున్నాయని తెలిపారు. దీనికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ మే 12న మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్. సంతోషం, సర్కిల్ కమిటీ సభ్యులు పి.గణేశ్, కే.వెంకట్, నాయకులు పి.వెంకట్, ఎస్.శరత్ బాబు, ప్రభాకర్ లు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా పసుపుల

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా సందీప్ ముదిరాజ్ ను నియమిస్తూ రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు అని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ తెలియచేశారు ఈ సందర్భంగా సందీప్ ముదిరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి డివిజన్ అధ్యక్షుడిగా నియమించిన జిల్లా పార్టీ అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ బొక్కా బాల్ రెడ్డి అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ జిల్లా కార్యదర్శి కొమురయ్య కె హరి కిషన్ జి సోల్కర్ రెడ్డి లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు అని బిజెపి పార్టీ అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తానన్నారు. గతములో రాజేంద్రనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి గా పనిచేసిన అనుభవం ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చైతన్యం చేస్తూ పార్టీ అభివృద్ధి కొరకు కృషి చేస్తానన్నారు రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో బిజెపి పార్టీ గెలుపు లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ నగరపాలక సంస్థ అంబేద్కర్ విగ్రహం నుండి చిలుకానగర్ వరకు గల ప్రధాన రహదారి వెడల్పు, బిటి రోడ్డు సుందరీకరణ కొరకు రూ.10.45 కోట్ల హెచ్ఎండిఏ నిధులు విడుదల చేయగా కమిషనర్ శైలజ, హెచ్ఎండిఏ ఈఈ శ్రీనివాస్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డీఈఈ చిరంజీవి, మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్ లతో కలిసి రోడ్డును బుధవారం ఉదయం పరిశీలించారు. త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ అధికారులు, నగరపాలకసంస్థ అధికారులు, మాజీ కార్పోరేటర్లు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'హై అలర్ట్'

సీఎంలతో అమిత్ షా సమీక్ష

పారా మిలటరీ బలగాలకు సెలవులు రద్దు

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం విరుచుకుపడిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా భద్రతా బలగాలు, పోలీసులు అప్రమత్తమయ్యారు. దేశంలోని ముఖ్య నగరాల్లో భద్రతా బలగాలు భారీగా మోహరించాయి. పంజాబ్, రాజస్థాన్‌లో హై అలర్ట్ ప్రకటించారు. ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం రెడ్ అలర్ట్ జారీ చేసింది. పోలీసులు, రక్షణ శాఖ వర్గాలతో సమన్వయం చేసుకొని ముందుకుసాగాలని ప్రజలకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని యూపీ డీజీపీ సూచించారు. మరోవైపు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రకటించారు. సరిహద్దు గ్రామాల ప్రజలను ఖాళీ చేయించి, సురక్షిత ప్రాంతాలకు, బంకర్లకు తరలించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. జమ్మూలోని భారత సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. సీఎం ఒమర్ అబ్దుల్లాతో కశ్మీర్‌లో పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అన్ని భద్రతా చర్యలు కల్పించాలని సైన్యానికి ఆదేశాలు జారీ చేశారు.

అత్యవసర సమావేశం: అటు 'ఆపరేషన్ సిందూర్ ' నేపథ్యంలో పాక్, నేపాల్ సరిహద్దు రాష్ట్రాల సీఎంలు, డీజీపీలు, ప్రధాన కార్యదర్శులతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అత్యవసరంగా సమావేశమయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన భేటీలో జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్ సిక్కిం, పశ్చిమ బెంగాల్ సీఎంలు పాల్గొన్నారు. లడ్డాఖ్, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో 'ఆపరేషన్ సిందూర్', అనంతర పరిణామాలపై చర్చించారు. మరోవైపు కేంద్ర హోంశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సెలవుల్లో ఉన్న సిబ్బందిని వెనక్కి రప్పించాలని పారా మిలిటరీ బలగాలకు అమిత్ షా ఆదేశాలు జారీ చేశారు. దేశంలో అంతర్గత భద్రతను సమీక్షించిన అమిత్ షా ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిరంతర నిఘా అవసరమని పేర్కొన్నారు.

దేశ వ్యాప్తంగా మాక్ డ్రిల్

న్యూఢిల్లీ/ముంబై: పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ తర్వాత దేశంలో పౌర రక్షణ మాక్ డ్రిల్ జరిగింది. రాజధాని ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, చండీగఢ్, విశాఖ వంటి ప్రధాన నగరాలతో సహా అధిక ముప్పు కలిగిన 244 జిల్లాల్లో బుధవారం సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆపరేషన్ అభ్యాస్ పేరుతో మాక్ డ్రిల్ నిర్వహించారు. శత్రు దాడి జరిగినప్పుడు స్వీయ రక్షణతో పాటు విద్యార్థులు, యువకులు ఎలా ప్రతిస్పందించాలో అవగాహన కల్పించారు. మాక్ డ్రిల్‌లో అధికారులతో పాటు సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, వాలంటీర్లు హోంగార్డులు, ఎన్‌సీసీ/ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువ కేంద్రాలు, కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కర్నాటక, తెలంగాణ, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, పంజాబ్, చండీగఢ్ తదితర రాష్ట్రాలలో మాక్ డ్రిల్స్ జరిగాయి. ఢిల్లీలో సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు మొత్తం 11 జిల్లాల్లో... జిల్లాకు ఐదు ప్రదేశాలలో... 660 పాఠశాలలు... 40 మార్కెట్లలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఖాన్ మార్కెట్, చాందినీ చౌక్, ఎన్‌డీఎంసీ, ఆర్‌బీఐ భవనాలు, ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వంటి ముఖ్య ప్రదేశాలు, మయూర్ విహార్ ఫేజ్-3లోని విద్యా బాల్ భవన్ స్కూల్‌లో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్‌లు నిర్వహించారు. నోయిడా పోలీసులు, సీఐఎస్ఎఫ్ సంయుక్తంగా బొటానికల్ గార్డెన్ మెట్రో స్టేషన్‌లోఈ కసరత్తు జరిగింది. ఫరీదాబాద్‌లో జిల్లా ప్రధాన కార్యాలయం, సబ్-డివిజనల్ కార్యాలయాలు, పోలీసు విభాగాలు, ఆసుపత్రులలోనూ మాక్ డ్రిల్స్ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు పాల్గొన్నారు. ఘజియాబాద్‌లోని పది పాఠశాలలు, కళాశాలలలో, మణిపూర్‌లోని నాలుగు జిల్లాల్లో, అసోంలోని 14 జిల్లాల్లోని 18 ప్రదేశాలలో, ఒడిశాలోని 12 జిల్లాల్లో, హర్యానాలోని 22 జిల్లాల్లో ఈ కసరత్తు జరిగింది. మాక్ డ్రిల్ నిర్వహించారు. కోల్‌కతాలోని రూబీ పార్క్, బాలుర లా మార్టినియర్, బాలికల లా మార్టినియర్, ఫ్యూచర్ ఫౌండేషన్ స్కూల్‌లో మాక్ డ్రిల్ జరిగింది.. వారణాసిలోని కాశీ విశ్వనాథ్ ఆలయంలో హెచ్చరిక జారీ చేశారు. ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్‌లో మాక్ డ్రిల్ జరిగింది.

హైదరాబాద్‌లో: హైదరాబాద్‌లో సివిల్ మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసింది. జీహెచ్ఎంసీ పరిధిలోని అనేక ప్రాంతాల్లో సైరన్ మోగింది. యుద్ధమప్పుడు పౌరులు పాటించాల్సిన నియమాలను ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది వివరించారు. నానల్‌నగర్, కంచన్‌బాగ్, సికింద్రాబాద్, ఈసీఐఎల్ ఎన్ఎఫ్‌సీ మాక్ డ్రిల్స్‌ను కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. కాల్పుల శబ్దాలు వినబటం, సంఘ విద్రోహ శక్తులు కాల్పులు జరుపుతుండటం, ఒక భవనంలోకి వెళ్లి కాల్పులు జరిపితే... అక్కడ ఉన్నవారిని సురక్షితంగా బయటకు తెస్తున్నట్లుగా దృశ్యాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా ప్రాణాలు కాపాడాలో వివరించారు. డీఆర్‌డీఏ సమీప కాలనీలోని 24 అంతస్తుల భవనంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. మొత్తంగా 12 శాఖల అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. కాచిగూడ రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, విశాఖ నగరంలోని పాత పోస్టాఫీస్ కూడలిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు.

ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తే స్వాగతిస్తాం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-తిరుపతి: ఉగ్రవాదులను హతమార్చే పేరుతో పాకిస్థాన్‌పై యుద్ధం చేయాలనుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉగ్రవాదులను హతమార్చడం... యుద్ధం చేయడం వేర్వేరుగా చూడాలని అన్నారు. ఉగ్రవాదులను హతమార్చ దానికి భారత సైన్యం శిక్షణ తీసుకుందని, పాక్‌పై యుద్ధం చేయడానికి కాదని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదులను చంపడం న్యాయమేనని, పాకిస్థాన్ కూడా ఉగ్రవాదుల నిర్మూలనలో భారత్‌కు సహకరించాలన్నారు. పాకిస్థాన్‌లో ఉన్నది కూడా ప్రజలేనని, ప్రజాస్వామ్యబద్ధంగా ఉన్నటువంటి ప్రజలపై, ప్రభుత్వాలపై యుద్ధం ప్రకటించడం సరైనది కాదని పేర్కొన్నారు. ఉగ్రవాదులను నిర్మూలించకుండా దేశాలపై యుద్ధం జరిగితే ఉగ్రవాదం పెరుగుతుందే తప్ప నిర్మూలన జరగదని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకోసం పాకిస్థాన్‌పై యుద్ధానికి సీపీఐ వ్యతిరేకమని స్పష్టం చేశారు.

తక్షణమే 'ఉపాధి' బకాయిలు చెల్లించాలి

రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

9,10,11 తేదీల్లో పని ప్రదేశాల పరిశీలనకు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధి హామీ పనులకు సంబంధించిన బకాయిలు వెంటనే చెల్లించాలని, ప్రతి కూలీకి ఏటా రూ.12 వేల భృతి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఉపాధి హామీకి వాటా కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. మెటీరియల్ కంపోనెంట్ 50 శాతం నిధులను ప్రభుత్వమే భరించాలని, 200 రోజుల పని కల్పించాలని, రోజు కూలి రూ.700 ఇవ్వాలని, సకాలంలో వేతనాలు ఇవ్వాలని, వలసలు ఆపాలని డిమాండ్ చేసింది. ఈ డిమాండ్ల సాధనతో పాటు కూలీల సమస్యల పరిష్కారానికిగాను చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రంలో ఉపాధి హామీ పని ప్రదేశాలను ఈనెల 9,10,11 తేదీల్లో జిల్లా నాయకత్వాల ప్రతినిధి బృందాలు పరిశీలించి, క్షేత్రస్థాయి సమస్యలపై 12న కలెక్టర్లకు వినతులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు పిలుపునిచ్చారు. ఉపాధి హామీకి రాష్ట్ర బడ్జెట్లో నయా పైసా కేటాయించకుండా, పెత్తనం చేయడమేమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఉపాధి కూలీల పనికి రూ.700 కోట్లు పెండింగ్ ఉన్నప్పటికీ, వాటిని చెల్లించాలనే ఆలోచన ప్రభుత్వానికి రాకపోవడం సిగ్గుచేటని నాయకులు విమర్శించారు.

ఆర్డీటీకి విదేశీ సాయం పునరుద్ధరించాలి

సీఎస్‌కు సీపీఐ నేత రామకృష్ణ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి, అనంతపురంలోని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ కింద విదేశాల నుంచి ఆర్థిక సహాయం అందేలా తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ... శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల తరపున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, ఎస్కే యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు కృష్ణయ్య తదితరులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. 1969లో విన్సెంట్ ఫెర్రర్, అన్నే ఫెర్రర్ దంపతులచే ఆర్డీటీ అనంతపురం జిల్లాలో స్థాపించబడిందని, గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం, అన్యాయాలను నిర్మూలించడానికి, సమాన అవకాశాల కల్పన, సంపదను అందరికీ అందించడానికి ఈ సంస్థను ప్రారంభించారని గుర్తుచేశారు. ఆ తర్వాత సంస్థ కరువు పీడిత ప్రాంతాల్లో 'ఫుడ్-ఫర్-వర్క్' కార్యక్రమం ద్వారా వేలాదిగా బావులు తవ్వటం, లక్షలాది గృహాల నిర్మాణం, కుష్టు వ్యాధి చికిత్సా కేంద్రం స్థాపన వంటి పనులు చేపట్టిందని వివరించారు. తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ... కూలీలను రైతులుగా మార్చడంలో సహాయపడిందని తెలిపారు. గ్రామాల్లో స్థిరమైన అభివృద్ధి ద్వారా మహిళలు, పిల్లలు, వైకల్యం ఉన్న వ్యక్తులు, గిరిజన వర్గాల అభివృద్ధికోసం ఈ సంస్థ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. విద్య, వైద్యం, గృహనిర్మాణం, స్థిరమైన జీవనోపాధి, సాంస్కృతిక క్రీడా కార్యక్రమాల ద్వారా పేదల అభ్యున్నతికి తీవ్రంగా కృషి చేసిందని, గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాలను మెరుగుపరచడానికి మొబైల్ లైబ్రరీలు, ట్యూషన్ స్కూళ్లు ఏర్పాటు చేయడంతోపాటు స్కాలర్‌షిప్‌లను అందిస్తోందన్నారు. బత్తలపల్లి, కల్యాణదుర్గం, రెండు సెకండరీ అనుపత్రులు, ఒక ప్రైమరీ హెల్త్‌కేర్ సెంటర్ స్థాపించిందని, రోజువారీ 3వేల మంది పేదవారు ఈ ఆసుపత్రుల సేవల్ని అందుకుంటున్నారని వివరించారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఆదాయ ఉత్పత్తి కార్యక్రమాలు, వృత్తి శిక్షణ, మహిళల భద్రత, సమానత్వం కోసం కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. వికలాంగులకు కృత్రిమ అవయవాలు, పునరావాస కేంద్రాలు, ఉపాధి అవకాశాల్ని అందిస్తోందన్నారు. ఎకాలజీ సెక్టర్ ద్వారా నీటి, నేల పరిరక్షణ, అటవీకరణ, హార్టికల్చర్ ప్రవేశపెట్టిందని, వేలాది మంది రైతులకు మైక్రో ఇరిగేషన్ వ్యవస్థలు అందించి... నీటి అదా, ఉత్పత్తి పెంపు సాధించిందన్నారు. సౌర పలకల సహాయంతో స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణం, రోడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నదని వివరించారు. 2013లో ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ నుంచి గృహ నిర్మాణంలో అత్యుత్తమ సేవలకు గుర్తింపు లభించిందని తెలిపారు. ఫెర్రర్ మరణానంతరం ఆయన కుమారుడు మంఛో ఫెర్రర్ పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలలో మన్ననలు పొందారన్నారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఒక ఉద్యమంలా సాగిందని, 1960లలో అనంతపురంలో కరువుతో ఎండిపోయిన భూములలో రూపుదిద్దుకున్న నిశ్శబ్ద విప్లవం వేలాది గ్రామాల అభివృద్ధికి తార్కాణమైందని తెలిపారు. భారత ప్రభుత్వం ఇటీవల ఆర్డీటీ యొక్క విదేశీ సహకారం నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) లైసెన్సు పునరుద్ధరించకుండా నిలుపుదల చేసిందని, ఎఫ్‌సీఆర్ఏను సమస్యను అత్యవసరంగా పరిష్కరించకపోతే, దశాబ్దాలుగా కొనసాగుతున్న సేవలకు ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతీకారం తీర్చుకుంటా

నా వాళ్లతో పాటు నేనూ పోవాల్సింది: మసూద్ అజార్

ఇస్లామాబాద్: భారత్‌పై జాలి చూపను, ప్రతీకారం తీర్చుకుంటానని జైషే మహమ్మద్ అధినేత మసూద్ అజార్ హెచ్చరించాడు. ఆపరేషన్ సిందూర్‌లో తన కుటుంబానికి చెందిన 10 మంది చనిపోవడంతో ఆక్రోశం ప్రదర్శిస్తూ ఓ ప్రకటన విడుదల చేశాడు. 'నా కుటుంబానికి చెందిన 10 మంది ఈ దాడుల్లో చనిపోయారు. అమాయకులైన ఐదుగురు పిల్లలు స్వర్గస్తులయ్యారు. నాకు నా ప్రాణాల కంటే ఎక్కువైన అక్క సాహిబా, ఆమె భర్త, మేనల్లుడు ఆలిం ఫాజిల్, అతని భార్య, మేనకోడలు ఆలం ఫజీలా ప్రాణాలు కోల్పోయారు. మోదీ (భారత ప్రధాని) అమాయక పిల్లలను, మహిళలను, వృద్ధులను లక్ష్యం చేసుకున్నారు. ఈ బాధ, దు:ఖం భరించలేకున్నా. అయినా విచారం లేదు. భయం లేదు. నిరాశ లేదు. ఈ 14 మందిలో నేను ఒకడినైతే బాగుండేదని పదేపదే అనిపిస్తోంది. కానీ అందరి మృత్యువుకు సమయం ఖరారై వుంటుంది. అందులో తొందర, ఆలశ్యం జరగదు. మా ఇంట్లో మొత్తం నలుగురు పిల్లలు (3 నుంచి 7 ఏళ్ల వారు) ఉన్నారు. ఇప్పుడు వారంతా దేవుడి దగ్గరకు వెళ్లిపోయారు. పవిత్ర గ్రంథం ప్రకారం వారంతా అమరులయ్యారు. నియంత మోదీ విరుచుకుపడ్డారు. ఇక కనికనం ఆశించవద్దు' అని ప్రకటనలో మసూద్ అజార్ పేర్కొన్నాడు.

పౌరులకు అవగాహన కల్పించాలి: సీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాకిస్థాన్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సన్నద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా తీసుకుంటున్న భద్రతా చర్యలు, మాక్ డ్రిల్స్ నిర్వహణతో పాటు పౌర రక్షణ కార్యాచరణపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. సమావేశానికి సీఎస్, డీజీపీలతో పాటు టూరిజం, ఎండోమెంట్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ హెల్త్, ఆర్ అండ్ బీతోపాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, రైల్వే, ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, సీఐఎస్ఎఫ్ అధికారులతోనూ సీఎం చర్చించారు. అన్ని స్థాయిల్లో అధికారులు, సంస్థలు సిద్ధంగా ఉండాలని, కేంద్రం సూచనలను పూర్తిగా అమలు చేయాలని చంద్రబాబు సూచించారు. అత్యంత సమన్వయంతో పనిచేయాలని అన్ని శాఖలను ఆదేశించారు. ప్రజల కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, తప్పుడు సమాచారాన్ని అరికట్టాలని అన్నారు. తప్పుడు ప్రచారం వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తీర ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. టీటీడీ వంటి చోట్ల ప్రత్యేక రక్షణ, జాగ్రత్తలు అవసరమన్నారు. కేంద్ర సంస్థలకు అవసరమైన సహకారం అందిస్తామని, ఏ సమయంలోనైనా తమను సంప్రదించవచ్చని సీఎం అన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉత్తమ ఫలితాలు రావాలి

- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి
- ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పురస్కారాల అందజేత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫలితాలు రావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పదవ తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన సాంఘిక సంక్షేమ, గిరిజన గురుకులాలు, వసతి గృహాల విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమంలో మంత్రి డోలా, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 315 మంది పదవ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మెమొంటో, సర్టిఫికెట్లు అందించారు. ఇందులో 34 మంది మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులుగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ పేదల విద్యార్థుల పట్ల ముఖ్యమంత్రి, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. నీట్ ఉచిత కోచింగ్ సెంటర్లను ఈ ఏడాది నుంచి 10కి పెంచుతున్నామన్నారు. వచ్చే ఏడాది గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్, ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఐఎస్ కార్యదర్శి వి.ప్రసన్న వెంకటేష్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లావణ్య వేణి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి జి.గౌతమి, సంచాలకులు ఎస్.భార్గవి, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబులా అబద్ధాలు చెప్పలేను: జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజలకిచ్చిన హామీలను పూర్తి పారదర్శకంగా అమలు చేసిన మనకే ఇలాంటి పరిస్థితి వచ్చిందని, ఇక అబద్ధాలు చెప్పి...మోసాలు చేసిన చంద్రబాబు పరిస్థితి ఎలా ఉంటుందో... ఆయనలా తాను అబద్ధాలు చెప్పలేనని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్లమెంటు నియోజకవర్గాల పార్టీ పరిశీలకులు, పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలతో బుధవారం సమావేశమయ్యారు. జగన్ మాట్లాడుతూ, 2014లో... చంద్రబాబు తానిచ్చిన హామీలను అమలు చేయలేదని, మనం పాదయాత్రచేసి ప్రజలకు భరోసా ఇచ్చామన్నారు. తానిచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేయలేదని, రెండు రకాలుగా చంద్రబాబు ప్రజలను మోసగించాడని విమర్శించారు. అవినీతి విచ్చలవిడిగా కొనసాగుతుందని దుయ్యబట్టారు. లాలూకు రూ.1,500 కోట్లు, మరొకరికి రూ.3వేల కోట్ల భూములను కట్టబెట్టారని ధ్వజమెత్తారు. రైతులకు ఉచితంగా విద్యుత్ అందించడానికి సెకీతో తమ ప్రభుత్వంలోరూ.2.49కే విద్యుత్ కొనుగోలు చేయగా, ఇవాళ రూ.4.60కు కొనుగోలు చేశారని వివరించారు. పార్టీలో కష్టపడే కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. 2026లో వైసీపీ ప్లీనరీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావిస్తూ... భారత సైన్యానికి అండగా ఉందామన్నారు. భారత్‌లో రక్తపాతం సృష్టిస్తున్న ఉగ్రవాదుల, వారి శిబిరాలు, స్థావరాలపై చర్యలు అనివార్యం అన్నారు.

సైన్యానికి సర్వాధికారాలు

పాకిస్థాన్ జాతీయ భద్రతా మండలి

ఇస్లామాబాద్: ఆపరేషన్ సిందూర్ పేరిట తమ దేశంపై భారత్ మెరుపు దాడులను యుద్ధ చర్యగా పాకిస్థాన్ పేర్కొంది. తగు విధంగా బదులిస్తామని భారత్‌ను హెచ్చరించింది. ఇందుకోసం అన్ని బాధ్యతలను తమ సైన్యానికి అప్పగించినట్లు పాకిస్థాన్ జాతీయ భద్రతా మండలి ఒక ప్రకటనలో తెలిపింది. భారత్‌పై ప్రతీకార చర్యలకుగాను సర్వాధికారాలు సాయుధ దళాలకు అప్పగించినట్లు వెల్లడించింది. ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన జాతీయ భద్రతా మండలి (ఎన్ఎస్‌సీ) బుధవారం కేబినెట్ మంత్రులు, ముఖ్యమంత్రులు, త్రివిధ దళాధిపతులు, సీనియర్ అధికారులు సమావేశమైంది. తాజా పరిస్థితులను సమీక్షించి... ఐరాస చార్టర్‌లోని ఆర్టికల్ 51 ప్రకారం ఆత్మరక్షణకు కల్పించిన హక్కుకు కట్టుబడి భారత్‌కు బదులిస్తావ్వాలని నిర్ణయించింది. ఇందుకు సమయం, స్థలం, దాడుల తీరుపై నిర్ణయాన్ని సైన్యానికే వదిలివేసింది. 'అమాయక మహిళలు, పిల్లలను ఉద్దేశపూర్వకంగా లక్ష్యం చేసుకోవడం హేయం. మానవ, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా హేయమైన నేరానికి భారత సైన్యం పాల్పడింది. కల్పిత ఉగ్రవాదుల శిబిరాల నెపంతో దాడులు చేసి, అమాయక పౌరులను హతమార్చింది. నివాసాలు, మసీదులను ధ్వంసం చేసింది' అని పాక్ భద్రతా మండలి మండిపడింది. వేలాది మంది ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు కల్పించేలా గల్ఫ్ దేశాల వాణిజ్య విమానాలను ప్రమాదంలో పడేవేసేలా భారత్ దాడులు చేసిందని పేర్కొంది. నీలం-ఝీలం జలవిద్యుత్ ప్రాజెక్టును భారత్ లక్ష్యం చేసుకుందని పేర్కొంది. తమ భూభాగంలో ఉగ్రవాదులు లేరంటూ భారత్ ఆరోపణలను తోసిపుచ్చింది. ఏప్రిల్ 22 దాడులు ఆక్షేపణీయమని, వాటిపై తటస్థ, పారదర్శక విచారణను కోరినట్లు గుర్తుచేసింది. అమాయకుల ప్రాణాలు తీయడాన్ని పాకిస్థాన్ ఆమోదించదని, భారత్ ఉద్దేశపూర్వకంగా ఉద్రిక్తతలు సృష్టిస్తోందని, తదుపరి చర్యలకు ఆ దేశానిదే బాధ్యత అని భద్రతా మండలి పేర్కొంది.

పంజాబ్ ప్రావిన్స్‌లో ఎమర్జెన్సీ

భారత్ క్షిపణి దాడులతో అన్ని విద్యా వ్యవస్థలను మూసివేస్తూ పాకిస్థాన్, పంజాబ్ ప్రావిన్స్‌లో అత్యవసర పరిస్థితిని సీఎం మరియం నవాజ్ ప్రకటించారు. పంజాబ్‌లో హై అలర్ట్ విధించారు. పంజాబ్ పోలీసులు, భద్రతా సిబ్బందిని మోహరించారు. ప్రావిన్స్‌లోని అన్ని ఆసుపత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది సెలవులు రద్దు చేశారు. అన్ని జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు కూడా విధులకు హాజరు కావాలని ఆదేశాలిచ్చారు.

48 గంటలు ఎయిర్‌స్పేస్ బంద్

పాకిస్థాన్, పీఓకేలో భారత్ మెరుపు దాడులతో 48 గంటల పాటు గగనతలాన్ని మూసివేస్తూ పాకిస్థాన్ ఆదేశాలిచ్చింది. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఇస్లామాబాద్, లాహోర్ మీదగా వెళ్లే విమానాలను కరాచీకి దారి మళ్లించినట్లు ఏవియేషన్ అధికారులు తెలిపారు. అంతర్జాతీయ, దేశీయ విమాన సేవలకు ఆటంకం కలిగింది. అయితే కొద్ది సేపటి కోసం తెరిచి... కొన్ని విమానాలను అనుమతించిన తర్వాత 24 గంటల కోసం లాహోర్ విమానాశ్రయాన్ని మూసివేశారు. ఈ పరిణామాలతో కరాచీలోని జిన్నా విమానాశ్రయం కిటకిటలాడింది. అంతర్జాతీయ, దేశీయ విమానాలన్నీ అక్కడ నుంచే రాకపోకలు సాగించాయి.

నేటి నుంచి సహకార గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల ఆందోళన

విశాలాంధ్ర-విజయవాడ: దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని వేతన సవరణ సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సహకార గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ అధ్వర్యంలో గురువారం నుంచి ఉద్యోగులు ఆందోళనకు సిద్ధం అయ్యారు. డీసీసీబీ జాయింట్ ఫోరం ఎంప్లాయిస్ అసోసియేషన్స్ దేశ వ్యాపితంగా బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తున్న జిల్లా, సహకార, గ్రామీణ బ్యాంకుల సిబ్బందికి గత 2022 నవంబరు నుంచి వేతన సవరణ జరగలేదని, జాతీయ బ్యాంకుల ఒప్పందాన్ని రాష్ట్రంలో సహకార బ్యాంకులు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, ఎనిమిదో తేదీ నుంచి 11 వరకు నల్ల బ్యాడ్జ్ లు ధరించి విధుల్లోకి వెళ్లడం, 12,13,14 తేదీల్లో జిల్లా సహకార బ్యాంకు ముందు ధర్నాలు... అప్కాబ్ కు సహాయ నిరాకరణ చేపడుతున్నట్లు కమిటీ తెలిపింది. ఈ నెల16న చలో ఆప్కాబ్ కార్యక్రమం చేపట్టి, భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తామని ఏపీ సెంట్రల్ కో ఆపరేటివ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎస్.రవి కుమార్, కె.బాలాజీ ప్రసాద్ తెలిపారు.

18 ఎయిర్‌పోర్ట్‌లు మూసివేత

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్ భూభాగంలోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా మంగళవారం అర్ధరాత్రి మెరుపు దాడులు చేసిన నేపథ్యంలో గగనతలంలో కొంత మేర కేంద్రం భద్రతా ఆంక్షలు విధించింది. దీంతో దాదాపు 200కి పైగా విమానాలు రద్దయ్యాయి. శ్రీనగర్, లెహ్, అమృత్‌సర్, చండీగఢ్ సహా కనీసం 18 విమానాశ్రయాలను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. ఆయా విమానాశ్రయాల్లో బుధవారం ఉదయం నుంచి విమాన రాకపోకలు నిలిచిపోయాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంతో రగిలిపోయిన భారత్... ఎట్టకేలకు అందుకు ప్రతీకారం తీర్చుకుంది. దీంతో జమ్ము, పఠాన్‌కోట్, జోధ్‌పూర్, జైసల్మేర్, సిమ్లా, ధర్మశాల, జామ్‌నగర్ సహా ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లోని విమానాశ్రయాల్లో విమాన కార్యకలాపాలు నిలిచిపోయాయి. ప్రస్తుత పరిస్థితుల్లో అమృత్‌సర్, బికనేర్, చండీగఢ్, ధర్మశాల, గ్వాలియర్, జమ్మూ, జోధ్‌పూర్, కిషన్‌గఢ్, లేహ్, రాజ్‌కోట్, శ్రీనగర్ సహా పలు ఎయిర్‌పోర్టుల నుంచి ఈ నెల 10వ తేదీ వరకూ 165కిపైగా విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ఇండిగో తెలిపింది. పదో తేదీ ఉదయం వరకు శ్రీనగర్, జమ్మూ, లేహ్, జోధ్‌పూర్, అమృత్‌సర్, భుజ్, జామ్‌నగర్, రాజ్‌కోట్, చండీగఢ్ ఎయిర్‌పోర్టులకు తమ విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ఎయిర్ ఇండియా వెల్లడించింది. వీటితోపాటు స్పైస్‌జెట్, ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ ఎయిర్ విమానాలు కూడా రద్దయ్యాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.